ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
గురువారం 21, నవంబరు 2024


ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు

దొనకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 39 సిమెంట్ రోడ్ల పనులకు రూ.3కోట్లు నిధులు మంజూరయ్యాయి. అన్నీ గ్రామాల్లో ఐదేళ్ల తర్వాత ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలోనూ సిమెంటు రోడ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. అన్ని గ్రామాల్లో కలిపి మొత్తం 108 సిమెంటు రోడ్లను 23.12 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు. 17 రోడ్లు ఇప్పటికే పూర్తికాగా 51 రోడ్ల పనులు చివరి దశలో ఉన్నాయి. వారంలోగా అవి పూర్తికానున్నాయి. స్థల వివాదం కారణంగా తిమ్మాపురంలో రోడ్డు పని మొదలు కాలేదు. అలాగే కందులాపురంలో ఏ రోడ్డు ముందుగా వేయాలన్నది గ్రామ నాయకత్వం తేల్చుకోకపోవడంతో అక్కడ కూడా రోడ్డు పని మొదలుకాలేదు.


పామూరులో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

పల్లెకు పండగొచ్చె!

జిల్లావ్యాప్తంగా ఉపాధి మెటీరియల్ నిధులతో శరవేగంగా సాగుతున్న పనులు

పల్లెకు పండుగొచ్చింది. ప్రతి ఊళ్లో అభివృద్ధి ఉత్సవం నడుస్తోంది. ఎప్పట్నుంచో ఆగిపోయిన నిర్మాణ పనులు మొదలు కావడంతో ప్రజలు కూటమి ప్రభుత్వం పాలనాదక్షతను ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సిమెంట్ రోడ్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో దారులన్నీ బాగుపడుతున్నాయి. అంతేగాక ఉపాధి హామీ పథకం కింద పశువుల పాకల నిర్మాణాలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులపై ఏర్పడిన గుంతలు కూడా పూడ్చలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున రోడ్ల పనులు మంజూరు చేశారు. సంక్రాంతిలోపు ఈ పనులను నూరుశాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే డిసెంబరులోపే రోడ్లకు రూపురేఖలు తీసుకొచ్చేలా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు.

- 1,136 సిమెంట్ రోడ్లు, 617 పశువుల పాకల నిర్మాణ పనులు మంజూరు
- వాటిలో 90 శాతం వర్క్‌లు ప్రారంభం
- ఒక్క రోడ్ల విలువే రూ.115.65 కోట్లు
- మరో రూ.40 కోట్లతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదన
- ఈ పనులన్నీ సంక్రాంతిలోపు పూర్తే లక్ష్యం
- డిసెంబరులోపు రూపురేఖలు తీసుకొచ్చేలా ప్లాన్

ఒంగోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధులతో చేపట్టిన పల్లె పండుగ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వాటిల్లో ప్రధానంగా సిమెంట్ రోడ్లు, పశువుల పాకల నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 2,804 పనులకు నిధులు మంజూరు చేశారు. అందులో రూ.115.65 కోట్ల విలువైన 1,136 పనులు ఉన్నాయి. అందులో 1,096 సిమెంట్ రోడ్ల పనులు ఉండగా, మరో 617 పశువుల పాకల నిర్మాణాలు ఉన్నాయి. కేంద్రప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఉపాధి పథకంలో కూలీల వేతనాలతోపాటు మెటీరియల్ కోటా నిధులు కూడా భారీగా అందుబాటులో ఉంటాయి. ప్రతి వంద రూపాయల వ్యయంలో 60శాతం వేతన రూపంలో ఉంటే 40శాతం మెటీరియల్ కోటా నిధులు ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, ఉద్యాన పంటల సాగు, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు కూలీలకు వేతనాలు కల్పించే వాటిలో ఉన్నాయి. అదేసమయంలో మెటీరియల్ కోటా నిధులతో గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు ఇతర నిర్మాణాలు చేసుకోవచ్చు.

కమిషనర్ రాకతో ఊపు

పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.115.65 కోట్లతో 1,136 రోడ్ల పనులు మంజూరుచేయగా మరో రూ.21కోట్ల విలువైన 617 పశువుల పాకల పనులు ఇప్పటికే మంజూరు చేశారు. రోడ్ల పనులలో 1,096 సిమెంట్ రోడ్లు ఉన్నాయి. మొత్తం మంజూరు 1,136 రోడ్ల పనులలో 1,093 ప్రారంభించారు. వాటిలో 696 పనులకు సిమెంట్ రోడ్డు వేసేందుకు వీలుగా దిగువ లేయర్ పూర్తిచేశారు. వాటిలో 258 పనులకు కంకర డస్ట్ వేస్ట్ వేశారు. 137 పనులలో సిమెంట్

మిగతా 6లో...

వైసీపీ పూర్తిగా వదిలేసింది

ఉపాధి హామీ పథక నిధులతో గత టీడీపీ ప్రభుత్వ కాలంలో పెద్దఎత్తున సీసీరోడ్ల నిర్మాణం జరగ్గా.. ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా పథకం అమలైంది. సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని వైసీపీ పాలకులు మర్చిపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మళీకల అధికారంలోకి వచ్చాక ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధులపై ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లో కోటి 56 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా గత నెలాఖరు వరకు సుమారు కోటి 15లక్షల పనిదినాలు కల్పించారు. సుమారు 2.81 లక్షల కుటుంబాలకు చెందిన 4.79 లక్షల మంది కూలీలకు పనులు కల్పించగా వేతన రూపంలో దాదాపు రూ.239 కోట్ల మేర లభించాయి. తద్వారా రూ.160కోట్లకుపైగా మెటీరియల్ కోటా నిధులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున రూ.120 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ నిర్ణయించారు. ఆ మేరకు పనులు మంజూరు ప్రక్రియ చేపట్టారు. అదేసమయంలో పెద్ద ఎత్తున పశువుల పాకల నిర్మాణాలను ఉపాధి మెటీరియల్ కింద చేపట్టాలని నిర్ణయించింది. జిల్లాకు 1,075 యూనిట్లు మంజూరయ్యాయి వీటి కోసం రూ.22 కోట్ల మేర అవసరం కానున్నాయి.

ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ప్రాధాన్యం

రోడ్ల నిర్మాణ పనులు మంజూరు చేసి ప్రారంభించే క్రమంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలను గ్రామంలోకి అనుసంధానం చేసే రోడ్లు, ఇతరత్రా పలు పనులకు డిమాండ్ పెరిగింది. దీంతో రానున్న మార్చి ఆఖరు వరకు ఉపాధి పనుల ద్వారా వచ్చే మెటీరియల్ కోటా నిధులు మొత్తానికి సరిపడా పనులు చేయాలన్న నిర్ణయానికి పాలకులు వచ్చారు. ఇప్పటికే రూ.239 కోట్లు వేతన రూపంలో రాగా, సంక్రాంతి అనంతరం తిరిగి పనులు ప్రారంభించి మార్చి ఆఖరు వరకు ముమ్మరంగా పనులు చేపడితే మరో రూ.150కోట్లు వేతన రూపంలో సమకూరేలా పనులు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఆ రకంగా చూస్తే ఈ ఏడాది రూ.180 కోట్ల మేర మెటీరియల్ నిధులు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. తదనుగుణంగా ఇప్పుడే పనులు మంజూరు చేసే ప్రక్రియ చేపట్టారు.



అన్ని రంగాల్లో ప్రకాశించాలి

- బంగారు బాల్యం ముగింపు సభలో కలెక్టర్ అన్సారియా
- ఒంగోలు నగరంలో వివిధ పాఠశాలల విద్యార్థినుల ర్యాలీ
- ఎస్పీ దామోదర్, ఇతర అధికారులు హాజరు

7


ప్రసంగిస్తున్న కలెక్టర్ అన్సారియా

పీవీఆర్ స్కూలులో సభకు హాజరై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


ముగిసిన రీసర్వే గ్రామసభలు

- 298 గ్రామసభల్లో 8,885 ఫిర్యాదులు
- పలు రకాల సమస్యలపై వినతులు వెల్లువ
- వాటి పరిష్కారంపై దృష్టిపెట్టిన అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో భారీ అక్రమాలు కుప్పలుతెప్పలుగా వెలుగుచూశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీసర్వేలో జరిగిన అవకతవకలను సరిదిద్దేందుకు జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లాలో 298 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ ప్రక్రియ

మిగతా 6లో...

డీసీసీబీ అధికారులపై విచారణాధికారి సీరియస్

- వివరణలు, పథకాల వివరాలు ఇవ్వకపోవడాన్ని తప్పుబడుతూ ఘాటుగా లేఖ
- కలెక్టర్ దృష్టికి కూడా వారి తీరు
- బ్యాంకు అధికారుల్లో కదలిక
- నేడు కలెక్టర్‌కు నివేదిక

ఒంగోలు,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) అధికారుల తీరుపై విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు సీరియస్ అయినట్లు తెలిసింది. ప్రత్యక్ష విచారణను బ్యాంకులో పదిరోజులకు పైగా నిర్వహించిన ఆయన తుది నివేదికను కలెక్టర్‌కు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే అందుకు అవసరమైన బ్యాంకులోని ఆయా విభాగాల పర్యవేక్షణాధికారుల వివరణలను, అలాగే ప్రభుత్వ పథకాలకు రుణాలు ఇచ్చిన జాబితాలను ఇవ్వాలని కోరారు. తన విచారణ అంతా పూర్తయినా ఆ వివరాలు, వివరణలు సకాలంలో అందక నివేదిక జాప్యం జరుగుతోందంటూ పలుమార్లు ఆయా విభాగాల పర్యవేక్షణ అధికారులను కోరారు. అయితే శనివారం రాత్రికి ఒకరిద్దరు మాత్రమే ఇవ్వగా సోమవారం ఆ విషయాన్ని ఆయన ప్రస్తుత బ్యాంకు సీఈవోగా ఉన్న అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. తాను పలుమార్లు చెప్తున్నా ఆశించిన

మిగతా 6లో...

చెరువు భూమిని ఆక్రమించుకొని వరి సాగు చేసిన ఆక్రమణదారులు


భూంఫట్

- నూజెండ్లపల్లిలో 40 ఎకరాల చెరువు భూమి ఆక్రమణ
- దాని విలువ సుమారు రూ. 4 కోట్లు
- వైసీపీ హయాంలో యథేచ్ఛగా రహదారి నిర్మాణం
- కబ్జా భూమిలో బోర్లు వేసి వరి, ఇతర పంటల సాగు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు



ముండ్లమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెండ్లపల్లి చెరువు తొట్టి భూమి ఆక్రమణకు గురైంది. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి ఇతర చేతుల్లోకి వెళ్లిపోయింది. దీనివెనుక వైసీపీ నాయకుల హస్తముందని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కాపాడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు మామూళ్ల మత్తుకు అలవాటు పడి చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా కొందరు గ్రామ, మండల వైసీపీ నాయకుల అండదండలతో సుదూర ప్రాంతాలైన విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన వారు వచ్చి పట్టా భూములు కొనుగోలు చేసి దాని పక్కనే ఉన్న చెరువు తొట్టి భూమిని కలుపుకున్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు ఆక్రమించుకుంటే మనమెందుకు ఆక్రమించుకోకూడదని ఒక అడుగు ముందుకు వేసి నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం గ్రామాలకు చెందిన కొందరు ఆక్రమణదారులు మిగతా భూమిని ఆక్రమించుకొని యథేచ్ఛగా చెరువులో బావులు

మిగతా 6లో...

గ్రానైట్ క్వారీపై కేసు కొట్టివేత

- పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు
- సహేతుకంగా లేదని తోసిపుచ్చిన న్యాయాధికారి

6



చకచకా

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రణాళిక

7

ఉలికిపాటు!

- వాణిజ్య పన్నుల శాఖలో ఏసీబీ కలకలం
- కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన డీసీటీవో
- గతంలోనూ ముగ్గురు దొరికారు


కార్యాలయం నుంచి దస్త్రాలను తీసుకెళ్తున్న ఏసీబీ అధికారులు


శ్రీనివాస ప్రసాద్

ఒంగోలు క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వ్యాణిజ్య పన్నుల శాఖ జిల్లా కార్యాలయం అవినీతిమయంగా మారింది. ఏకంగా రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ డీసీటీవో బుధవారం ఏసీబీకి పట్టుబడటమే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనతో సిబ్బంది అంతా ఒక్కసారి ఉలికిపాటుకు గురయ్యారు. గతంలో కూడా అదే కార్యాలయంలో ఏసీటీవో, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే విధంగా వ్యవహరిస్తూ వాణిజ్య పన్నుల అధికారులు తమ జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి

మిగతా 6లో...

సిబ్బంది అంతా పరార్..

వాణిజ్య పన్నుల శాఖకు చెందిన రెండు కార్యాలయాలు నగరంలో ఒకే చోట ఉన్నాయి. రెండో అంతస్తులో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం-1, మూడో అంతస్తులో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం-2 ఉన్నాయి. అయితే కార్యాలయం-2లో డీసీటీవో కె.ఎస్.శ్రీనివాస ప్రసాద్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో కార్యాలయం-1లో ఉన్న అధికారులు సిబ్బంది అంతా భోజన విరామం పేరుతో పరారయ్యారు. కార్యాలయం-2లో ఉన్నవారు మాత్రం అంతా ఒకచోటకు చేరి బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. డీసీటీవో అవినీతి మరక ఎవరికి అంటుకుంటుందో అనే ఆందోళనలో సిబ్బంది ఉండిపోయారు. ఏసీబీ అధికారులు రాత్రి వరకు కార్యాలయంలోని అన్ని ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్న ఎస్‌ఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : కనపర్తి గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 19 క్వార్టర్ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ బి.శ్రీకాంత్ బుధవారం తన సిబ్బందితో దాడి చేసి రాజనీడి రాముడును అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు నగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు తమ ఉపకార వేతనాల రెన్యువల్ కోసం, కొత్తగా మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎన్.లక్ష్మానాయక్ బుధవారం కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఫ్రెష్, రెన్యువల్ ఉపకార వేతనాలను పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని, ఇందు కోసం ప్రభుత్వం జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ, పీజీ చదువుతున్న అన్ని రకాల టెక్నికల్, కోర్సుల విద్యార్థులతో ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేయించాలని, ఆయా కళాశాలల యాజమాన్యాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గ్రామ, వార్డు సచివాలయల్లో విద్య, సంక్షేమ సహాయకుల లాగిన్ ద్వారా ఫైవ్ స్టెప్ వెరిఫికేషన్ చేయించుకోవాలని డీడీ కోరారు.

పంచాయతీ కార్యదర్శి చేతివాటంపై విచారణ

సంతనూతలపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రుద్రవరం పంచాయతీలో మంగమూరు పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కుమార్ ఇన్‌చార్జ్‌గా పనిచేసి అక్రమంగా నిధుల డ్రా చేయడంపై కలెక్టర్ ఆదేశాలమేరకు బుధవారం ఈవోఆర్డీ రమణమ్మ విచారణ చేపట్టారు. రుద్రవరం గ్రామపంచాయతీలో గత అక్టోబరు 16న ఎమ్మెల్యే ప్రోగ్రాం సమయంలో ఇక్కడ పనిచేసే పంచాయతీ కార్యదర్శి మెటర్నటీ లీవ్‌లో ఉండటంతో రెండు రోజులు మంగమూరు పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కుమార్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే ప్రోగ్రాం సమయంలో పారిశుద్యం పేరుతో బ్లీచింగ్, సున్నంబస్తాల కొనుగోలు పేరుతో పంచాయతీలో నిధులను డ్రా చేసేందుకు మెటర్నటీలీవ్‌లో ఉన్న కార్యదర్శి చేత ఓటీపీ చెప్పించుకుని నిధులను డ్రా చేశారు. ఈక్రమంలో సర్పంచ్‌ను కూడా విచారించారు. మెటర్నిటీ లీవ్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శిని రెండురోజులు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న కార్యదర్శికి నిధులు డ్రాచేసుకునేందుకు ఓటీపీ ఎలా చెబుతావని ప్రశ్నించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటాలి

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం కారైకుడిలో ఈనెల 29నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు జరగనున్న అంతర్ యూనివర్శిటీ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రకేసరి యూనివర్శిటీకి చెందిన క్రీడాకారులు విజయం సాధించాలని వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక యూనివర్శిటీ ప్రాంగణంలో కబడ్డీ పోటీలకు ఎంపికైన మహిళా క్రీడాకారులను ఆయన అభినందించారు. కాగా కమిటీ సభ్యులు జి.సాయిసురేష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ దేవీప్రసాద్ క్రీడాకారులను ఎంపిక చేశారు. వారిలో ఎస్‌కేషాకీర(మార్కాపురం), సీహెచ్.పూజిత, వి.స్వాతి(కందుకూరు), బి.హైమావతి(సింగరాయకొండ), కాశీశ్వరి(కంభం), ఎం.శిరీష, ఎ.బాలకోటమ్మ, ఎ.చంద్రిక, ఎస్‌కే.రబియా నస్రీన్(ఒంగోలు), ఎం.మధిరారెడ్డి(శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీ), భవాని(సింగరాయకొండ) ఉన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ● ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందని, చిన్నతనం నుంచే ఆసక్తి పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా గ్రంథాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. విద్యార్థులు, పాఠకులతో ఆయన మాట్లాడి పుస్తకాల లభ్యత, సౌకర్యాల గురించి వాకబు చేశారు. అనంతరం జరిగిన సభలో జేసీ విద్యార్థులతో పుస్తక పఠనంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకాలు చదివే అలవాటు వల్ల లక్ష్యాన్ని ఏర్పరుచుకునే స్పృహ ఏర్పడుతుందని తెలిపారు. చినిగిన చొక్కానైనా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరేశలింగంపంతులు చెప్పారని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.20 కోట్ల సెస్సు గ్రంథాలయ సంస్థకు రావాల్సి ఉందని, దానిని వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జేసీ తెలిపారు. ఇక జిల్లా గ్రంథాలయంలో మహనీయులు, చరిత్రకారుల చిత్రపటాల ఏర్పాటు, సాహిత్య సాంస్కృతిక సంస్థలు తమ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అందుబాటులో ఉంచే ప్రతిపాదనలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించామని తెలిపారు. అనంతరం విజేతలకు జేసీ గోపాలకృష్ణ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, పి.ఇమ్మానియేల్, డి.సందీప్, శివకుమారి, జి.శాంసన్, కృష్ణవేణి, మృదుల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మందకృష్ణను విమర్శిస్తే వైసీపీ నేతలకు గుణపాఠం చెబుతాం

● మాదిగలకు మేలు చంద్రబాబుతోనే సాధ్యం ● ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు ప్రభుదాస్


నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్‌నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మందకృష్ణను విమర్శిస్తే వైసీపీ నేతలకు గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ హెచ్చరించారు. ఆయన పోరాటం ఫలితంగా మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యత లభించిందని చెప్పారు. మంత్రులుగా, కార్పొరేషన్ చైర్మన్‌లుగా పదవులు అనుభవించిన ఆదిమూలపు సురేష్, కొమ్మూరి కనకరావులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. బుధవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్లు సురేష్, కనకారావులు తమ నాయకుడు మందకృష్ణ మాదిగను విమర్శించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పోరాట ఫలితంగానే రాజకీయంగా మాదిగలకు గుర్తింపు వచ్చిందన్నారు. మరోసారి తమ నాయకుడు మందకృష్ణపై నోరు పారేసుకుంటే మాదిగ జాతి మొత్తం తగిన గుణపాఠం చెబుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో మంత్రి హోదాలో ఉన్న ఆదిమూలపు సురేష్ మాదిగ జాతికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. జగన్ వద్ద మెప్పుకోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ అనే బ్రాండ్ లేకపోతే కనకరావు ఎక్కడుండేవారో ఒక్కసారి గుర్తు పెట్టుకోవాలన్నారు. మందకృష్ణమాదిగను విమర్శించిన నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపీధుబాబు, సుబ్బారావు, ఫ్రాన్సిస్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా బీపీసీఎల్ పైపులైన్ వేయాలి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ● చెరువుకు దూరంగా ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశం

సంతనూతలపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట చెరువులో బీపీసీఎల్ పైపులైన్ విషయంలో ఎవరికీ ఎటువంటి ఆటంకం లేకుండా ఏర్పాటు చేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జేసీ ఆర్.గోపాలక్రిష్ణ, ఎమ్మెల్యే బీఎన్ ఆధ్వర్యంలో సమావేశ జరిగింది. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్‌కు పైపులైన్‌ను పేర్నమిట్ట చెరువులో నుంచి బీపీసీఎల్ ప్రతిపాదించడంపై స్థానికులు గతంలో ఆందోళన చేశారు. ఈక్రమంలోనే చెరువు సమస్యపై జేసీ, ఎమ్మెల్యే, పేర్నమిట్ట చెరువు సంరక్షణ సమితి ప్రతినిధులు, బీపీసీఎల్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ తాగునీటి వనరులకు ఇబ్బంది కలుగకుండా, పైపులైన్‌ను చెరువు పక్కగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒంగోలు నగరం వేగంగా విస్తరిస్తున్నందున్న భవిష్యత్తులో పేర్నమిట్ట చెరువును సమస్టర్‌స్టోరేజీ ట్యాంకుగా కూడా మార్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయని, ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. దీనిపై బీపీసీఎల్ ప్రతినిధులు మాట్లాడుతూ చెరువు బెడ్‌లెవల్ నుంచి 10-15 మీటర్ల లోతులో ఈ పైపులైన్‌ను అత్యున్నత నాణ్యతాప్రమాణాలతో నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. అనతరం జేసీ గోపాలక్రిష్ణ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలు, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని చెరువులో నుంచి పైపులైన్ వేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పైపులైన్ ఏర్పాటుకు రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయిస్తామని, ప్రజలు, కంపెనీ ప్రతినిధులు సహకరించాలని జేసీ కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, సంతనూతలపాడు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీపై కేసు కొట్టివేత

చీమకుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామతీర్థం సమీపంలో ఉన్న మెస్సర్స్ గోల్డెన్ గ్రానైట్స్‌పై నమోదై కోర్టు విచారణలో ఉన్న కేసును కొట్టి వేశారు. బీవీఎస్ గ్రానైట్స్, డి.సురేష్‌బాబులు మెస్సర్స్ గోల్డెన్ గ్రానైట్స్ క్వారీపై ఒంగోలు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2006లో పిటీషన్ దాఖలు చేశారు. మెస్సర్స్ గోల్డెన్ గ్రానైట్ వారు అన్యాయంగా స్థలం ఆక్రమించుకొని, ఎన్‌వోసీ, అలాగే 2006 నుంచి అన్యాయంగా మైనింగ్ చేస్తున్నారని పిటిషనర్ వాదనలు వినిపించారు. సివిల్‌కోర్టు వివరంగా పరిశీలన చేసిన తర్వాత, చివరి వాదనలు పూర్తి అనంతరం పిటీషనర్ ఈ కేసు దాఖలు చేసే హక్కు లేదని, వారి విక్రయ దస్తా వేజు వాల్యూ లేనివని న్యాయాధికారి కేసును కొట్టివేశారు. కాగా కేసు గెలవటంతో గోల్డెన్ గ్రానైట్ వారు అక్రమార్కులుపై చట్టపరంగా చర్యలు తీసుకోవటానికి సమాయత్తమవుతున్నారు.

ప్రైవేటు ఫైనాన్స్ పేరుతో ఇద్దరిపై దాడి

ఒంగోలు(క్రైం), నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ప్రైవేటు ఫైనాన్స్ పేరుతో ఓ వ్యక్తిని చితక బాదారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక బస్టాండ్ సెంటర్ గేట్‌లో టీకొట్టు నిర్వహిస్తున్న బాజీ, అతని వద్ద పనిచేసే రహీమ్‌లపై ప్రైవేటు ఫైనాన్స్‌కు చెందిన ప్రతినిధులు అని చెప్పుకుంటున్న దినేష్, బాలాజీ, మరో యువకుడు కలిసి స్కూటీకి సంబంధించి ఫైనాన్స్‌లో పెండింగ్ ఉందంటూ దాడి చేశారు. ఈక్రమంలో రహీమ్‌ను నోటి వెంట రక్తం వచ్చేలా కొట్టారు. ఆర్టీసీ ఔట్‌పోస్టులో ఉన్న కానిస్టేబులు, అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు వచ్చి అడ్డుకున్నా వారు ఆగలేదు. ఈ మేరకు గాయపడిన రహీమ్ రిమ్స్‌కు వెళ్ళి చికిత్స చేయించుకొని అక్కడ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

● మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు


కుక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు కార్పొరే షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగో లు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు కార్పొరే షన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుం టున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలి పారు. బుధవారం స్థానిక కొత్త మామిడి పాలెంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో వీధి కుక్కకి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లను ఆయన ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆపరేషన్లు చేయడం ద్వారా కుక్కల్లో సంతానోత్పత్తిని అరికట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పశుసంవర్థక శాఖ జేడీ బేబీరాణి, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, వెటర్నరీ పాలీ క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ జె.శ్రీనివాసులు, డాక్టర్ సురేంద్ర, యానిమల్ బర్త్ కంట్రోలర్ డాక్టర్ సుధీర్, పీపుల్ ఫర్ యానిమల్ బోర్డు సభ్యులు టి.విష్ణువర్ధన్, సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఫౌండర్ టి.దివ్య పాల్గొన్నారు.

24న కమ్మ వారి వనభోజనాలు


సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన వనభోజనాల కార్య క్రమం జరుగుతుందని, కమ్మ కులస్థులు తమ కుటుంబసభ్యులతో సహా పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. బుధవారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌లోని లాస్య గ్రాండ్ రెస్టారెంట్‌లో జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఏడుగుండ్లపాడు, వెంకట్రాజుపాలెం దగ్గర ఉన్న ఒక వెంచర్‌లో వనభోజన కార్యక్రమం జరుగుతుందని, దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ జిల్లాల కమ్మ సంఘ ప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రధానకార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి గార్లపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం ఏర్పడిన తర్వాత తొలిసారి నిర్వహించే వనభోజన కార్యక్రమానికి ఎంతోమంది సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు. కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు మాట్లాడుతూ వనభోజనాలకు హాజరయ్యే వారి కోసం నగరంతో పాటు వివిధ మండలాల నుంచి వాహన సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సీతారామయ్య, గౌరవ అధ్యక్షులు చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నాగబోయిన భాస్కరరావు, పావులూరి బాపయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్లుగా అంజయ్య, సేవ్యానాయక్

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎర్రగొండపాలేనికి చెందిన చెవుల ఆంజయ్య, కాండ్లావత్ సేవ్యా నాయక్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. బుధవారం వారు మాట్లాడుతూ టీడీపీలో కష్టపడిన ప్రతిఒక్కరిని పార్టీ అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. తమను డైరెక్టర్లుగా ఎంపిక చేసి ప్రోత్సహించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఏరిక్షన్‌బాబుకు, సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి కట్టుబడి పార్టీకి మంచి పేరు తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తామని అంజయ్య, సేవ్యానాయక్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వారిని అభినందించారు.

ఉలికిపాటు!

(5వ పేజీ తరువాయి)

ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రధాన వనరు వాణిజ్య పన్నుల శాఖ. ఇలాంటి విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి పనికి లంచం షరామామూలైంది. ఆక్వా ట్రేడర్స్, గ్రానైట్ కంపెనీలు, బంగారం, బియ్యం వ్యాపారులు ఇలా అన్నిరకాల వారు ప్రభుత్వానికి వాణిజ్య పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే అధికారులు చేతివాటానికి అలవాటు పడి ప్రభుత్వానికి చేరాల్సిన పన్నులను భారీగా తగ్గించి వేస్తున్నారు. అందకు ప్రతిగా మామూళ్ల రూపంలో భారీగా లబ్ధిపొందడం పరిపాటిగా మారింది. ఉదాహరణకు టంగుటూరుకు చెందిన వెంకటేశ్వర ఆక్వా ట్రేడర్స్ యజమాని శ్రీధర్‌కు మూడు బ్రాంచ్‌లు ఉన్నాయి. అయితే ఇటీవల ఓ శాఖలో తనిఖీలు చేసిన డీసీటీవో శ్రీనివాసప్రసాద్ రూ.10లక్షలు జరిమానా విధించారు. మరో రెండు బ్రాంచీలలో జరిగిన లావాదేవీలకు జరిమానా లేకుండా చేస్తానని, అందుకుగాను లంచంగా రూ.1.50లక్షలు కావాలని డిమాండ్ చేశారు. ఆ విధంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడానికి సిద్ధమయ్యారు. అయితే సదరు యజమాని ఏసీబీని ఆశ్రయించడంతో అతని ఆటకట్టినట్లైంది. ఇంతేకాకుండా గ్రానైట్ పాలిషింగ్ చేసిన రాళ్ల ఎగుమతి విషయంలో కూడా ఆ శాఖ వసూలు చేయాల్సిన పన్నులు సక్రమంగా చేయకుండా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ముగిసిన రీసర్వే గ్రామసభలు

(5వ పేజీ తరువాయి)

ముగిసి వారం రోజులు కావడంతో వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించారు. రీసర్వేలో పలు రకాల సమస్యలపై అర్జీలు వచ్చాయి. వాటిని పరిష్కరించేందుకు మార్గదర్శకాలపై ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగానికి శిక్షణ కూడా ఇచ్చారు. వచ్చిన అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నోటీసులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభం కాగా డిసెంబరు ఆఖరుకు ఈ అభ్యంతరాలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు.

298 గ్రామసభలు.. 8,885 ఫిర్యాదులు

జిల్లాలోని 298 గ్రామసభల్లో 8,885 ఫిర్యాదులు రాగా అందులో 448 గ్రామసభల్లోనే పరిష్కరించగా 8,437 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ప్రధానంగా సబ్ డివిజన్ కోసం 3,663 ఫిర్యాదులు రాగా భూముల విస్తీర్ణం తేడాను సరిచేయాలని 2,210 ఫిర్యాదులు వచ్చాయి. మరలా తమ భూములను సర్వే చేయాలని కూడా భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆ ఫిర్యాదుల ఆధారంగా ముందుగా నోటీసులు జారీచేసి ఆ తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఆ అర్జీని ఇద్దరికి అమోదయోగ్యంగా ఉంటే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారు. ఇలా కాకుండా ఉద్దేశపూర్వకంగా ఉన్న కొన్ని వివాదాల విషయంలో కూడా చట్టపరంగా చర్యలు తీసుకోని ఆ సమస్యను ముగించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

జాయింట్ ఎల్‌పీఎంలే అధికం

గ్రామసభల్లో వచ్చిన అర్జీల్లో ఎక్కువ శాతం విస్తీర్ణంతోపాటు జాయింట్ ఎల్‌పీఎంలే అధికంగా ఉన్నాయి విస్తీర్ణం తక్కువ చేసి చూపెట్టారని కూడా అర్జీలు వచ్చాయి. పలు విభాగాల్లో కూడా వినతులు భారీగా రావడంతో వాటన్నింటిని పరిష్కరించే దిశగా రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో తదనుగుణంగా జిల్లాలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహించిన గ్రామసభల్లో అప్పటి రెవెన్యూ సిబ్బందితో పాటు వైసీపీ నేతలపై కూడా పలు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. వైసీపీ నేతలు చెప్పినట్లుగా నిర్వహించి ఉంటే అప్పట్లో పనిచేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకొనే అవకాశం ఉందనే హెచ్చరికలు నడుస్తున్నాయి. ఏదిఏమైనా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే గ్రామసభల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయనేది ప్రస్తుతం వచ్చిన వినతులను బట్టే తెలుస్తోంది.

భూంఫట్

(5వ పేజీ తరువాయి)

తవ్వారు. మరి కొందరు ఏకంగా బోర్లు వేశారు. నూజెండ్లపల్లి చెరువు మొత్తం 93.87 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో దాదాపు 35 నుంచి 40 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. భూములకు విపరీతంగా రేట్లు రావటంతో ఆక్రమణదారుల కన్ను చెరువు తొట్టి భూమిపై పడింది. అద్దంకి పట్టణానికి అతి దగ్గరగా ఉండటం, ప్రస్తుతం అక్కడ ఆక్రమించుకున్న భూమి విలువ ఎకరం రూ. 10 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో ఆక్రమణలకు గురైన భూమి విలువ సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఉంటుంది.

నూజెండ్లపల్లి చెరువు తొట్టి భూమి సర్వే నెంబరు 163/2లో 5.32 ఎకరాలు, 164/1బీలో 22 సెంట్లు, 164/2బీలో 9.79 ఎకరాలు, 165లో 7.32 ఎకరాలు, 1661బీలో 1.70 ఎకరాలు, 166/1బీ1లో 15 సెంట్లు, 253/1ఏలో 3.46 ఎకరాలు, 253/3ఏలో 7.44 ఎకరాలు, 254/1లో 1.65 ఎకరాలు, 254/2లో 3.03 ఎకరాలు, 254/3లో 1.02 ఎకరాలు, 255లో 8.74 ఎకరాలు, 256/1/ఏ1లో 1.31 ఎకరాలు, 256/1ఏ2లో 3.07 ఎకరాలు, 256/2బీలో 14 సెంట్లు, 260/1లో 14.89 ఎకరాలు, 261/1ఏలో రెండు ఎకరాలు, 261/1బీ1లో 2.19 ఎకరాలు, 261/3బీలో 17 సెంట్లు, 274/3బీలో 39 సెంట్లు, 274/3సీలో 1.23 ఎకరాలు, 281/1లో ఏడు సెంట్లు, 282/1బీలో 1.29 ఎకరాలు, 319/2లో 47 సెంట్లు, 328/2లో ఏడు సెంట్లు, 331/3లో 1.90 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో 30 నుంచి 40 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం ఆ భూముల్లో ఆక్రమణదారులు వరి, జొన్న, కంది పంటలను సాగు చేశారు. గత ఏడాది ఆక్రమణదారులు యథేచ్ఛగా నడి చెరువులో రహదారిని సైతం ఆక్రమించారు. చెరువు పంచాయతీ ఆధీనంలో ఉండటంతో పంచాయతీ తీర్మానం లేకుండానే వైసీపీ నాయకులు రహదారి నిర్మాణానికి సహకరించినట్లు సమాచారం. ఏదిఏమైనా కోట్ల రూపాయల విలువ చేసే చెరువు తొట్టి భూమి కాస్త రాబందుల చేతుల్లోకి వెళ్లిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.


చెరువులో రహదారిని నిర్మించిన ఆక్రమణదారులు

మా దృష్టికి రాలేదు : ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్

నూజెండ్లపల్లి చెరువు తొట్టి భూమి ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి రాలేదని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్. శ్రీకాంత్ తెలిపారు. చెరువును పరిశీలించి ఆక్రమణ దారులకు నోటీసులు ఇస్తామని ఆయన తెలిపారు.

డీసీసీబీ అధికారులపై విచారణాధికారి సీరియస్

(5వ పేజీ తరువాయి)

విధంగా ఇతర అధికారుల నుంచి స్పందన లేదన్న విషయాన్ని సీఈవో చెప్పినట్లు సమాచారం. దీంతో లోకేశ్వరరావు బ్యాంకు అధికారుల తీరును ఘాటుగా ప్రశ్నిస్తూ రాతపూర్వకంగా నోటీసు ఇచ్చి ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

దారిమళ్లించేందుకు యత్నాలు

తొలి నుంచి బ్యాంకు అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందికి అనుకూలంగా వ్యవహరిస్తూ అవసరమైన ఫైళ్లను చూపకపోవడం, అక్కడ ఏమి జరగలేదన్న భావన వచ్చేలా విచారణ కమిటీపై వత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికి లోకేశ్వరరావు కాస్తంత కఠినంగా వ్యవహరించి లోతుగా పరిశీలన చేశారు. అలా మొత్తం 62 ఫిర్యాదులపై విచారణ చేసిన ఆయన వాటిని ఎనిమిది విభాగాలుగా చేసి సంబంధిత విభాగాల పర్యవేక్షకులుగా ఉన్న డీజీఎం, ఏజీఎం స్థాయి అధికారులను రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ పథకాలైన జగనన్న పాల వెల్లువ, జగనన్న తోడు, సీహెచ్‌సీ గ్రూపుల పేరుతో ఇచ్చిన ట్రాక్టర్ల లబ్ధిదారులు, ఇతర పథకాల లబ్ధిదారుల జాబితాలను ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరారు. భవిష్యత్‌లో సెక్షన్ 51 విచారణ జరిగితే అందులో ఈ జాబితాలు కీలకం కానున్నాయి.

ఒకరిద్దరు మాత్రమే స్పందన

సదరు అధికారుల వివరణలు, ఈ జాబితాలను శనివారం సాయంత్రానికి ఇవ్వాలని కోరగా ఒకరిద్దరు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిని ప్రశ్నిస్తూ సోమవారం బ్యాంకు అధికారులపై విచారణాధికారి లోకేశ్వరరావు సీరియస్ అవుతూ ఘాటుగా నోటీసు ఇచ్చి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇలాగే వ్యవహరిస్తే ఈ విషయాన్ని తన నివేదికలో పేర్కొంటానని స్పష్టం చేసినట్లు తెలిసింది. బ్యాంకు అధికారులు మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు బ్యాంకులోనే ఉండి సంబంధిత పథకాల వివరాలు, అలాగే ఆయా విభాగాలలో గుర్తించిన లోపాలపై బ్యాంకు సీఈఓ పేరుతో విచారణాధికారికి ఇచ్చినట్లు సమాచారం. వాటిని బుధవారం పరిశీలించిన ఆయన అన్నింటిని కలిపి పూర్తి నివేదికను గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఇవ్వనున్నట్లు తెలిసింది.

పల్లెకు పండగొచ్చె!

(5వ పేజీ తరువాయి)

కాంక్రీట్ కూడా వేశారు. జిల్లాలో ఇటీవల పీఆర్ కమిషనర్ కృష్ణతేజ్ పర్యటనతో ఈ పనులు మరింత ఊపందుకున్నాయి. ఒంగోలు, దర్శి, మార్కాపురం నియోజకవర్గాలలో ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే 617 పాకలకు సంబంధించి 394 పనులు ప్రారంభించారు. చేసిన పనులకు బిల్లుల చెల్లింపులపై ప్రతి గురువారం కలెక్టర్, డ్వామా పీడీల సమీక్షిస్తుండడంతో క్షేత్రస్థాయిలో పనులు బాగా ఊపందుకున్నాయి. ఇప్పటివరకు మంజూరైన పనులను ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతికి పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చేస్తున్నట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. అలాగే మరో రూ.40 కోట్లతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పనులు త్వరలో మంజూరు చేయనున్నట్లు చెప్పారు. స్థానికంగా పనులు చేపట్టిన వారు త్వరితగతిన నాణ్యతతో వాటిని పూర్తిచేయాలని సూచించారు.

గురువు దిద్దిన బడి

ప్రధానోపాధ్యాయుడి కృషితో ఆదర్శంగా నడుస్తున్న
తిమ్మాయపాలెం ఉన్నత పాఠశాల



తిమ్మాయపాలెం ఉన్నత పాఠశాల (ఫైల్)



సీఎం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న కె.వి. శ్రీనివాసరావు

కనీసం వంద మంది విద్యార్థులు కూడా లేని ఆ పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు వచ్చారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం, సంఖ్యను పెంచడం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన ప్రణాళిక వేసుకున్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ ఇదే చేస్తారు. దాన్ని అమలు చేయడంలో వచ్చే ఒడిదొడుకులను అందరూ తట్టుకోలేరు. ఆ ఉపాధ్యాయుడు మాత్రం దీనికి భిన్నంగా కదిలారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తిపెంచే మార్గాలు అన్వేషించారు. అదనపు సమయం ట్యూషన్లు చెప్పారు. అప్పటి వరకూ ప్రభుత్వ బడి అంటే ఒక అపనమ్మకంతో ఉండే తల్లిదండ్రులు సైతం సర్కారు చదువుకు జై కొట్టేలా చేశారు. దాతలు ముందుకొచ్చి సహకరించేలా మార్పు తెచ్చారు. వీటన్నింటి ఫలితంగా ఆ పాఠశాలలో ఒక ఏడాది గరిష్ఠంగా 1,023 మంది విద్యార్థులు చేరే స్థాయికి తీసుకెళ్లిన ఆ మాస్టర్ మరెవరో కాదు.. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు పొందిన కె.వి.శ్రీనివాసరావు. ఆ పాఠశాల మరెక్కడో కాదు. అద్దంకి మండలం తిమ్మాయపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఆ బడి వృద్ధి వెనుక కృషిపై ప్రత్యేక కథనం..

- వందలోపు విద్యార్థుల నుంచి ఒక ఏడాది వెయ్యి మందికి చేరిక
- విద్యార్థులపై ప్రత్యేక దృష్టి, ఉపాధ్యాయుల కృషి
- గ్రామస్థుల సహకారం, దాతల తోడ్పాటుతో ముందుకు...

అద్దంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కె.వి.శ్రీనివాసరావు 1994 డీఎస్సీ ద్వారా సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా కారంచేడు మండలం కొడవలివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో చేరారు. 2016 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై అద్దంకి మండలం తిమ్మాయపాలెం యూపీ స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటికి ఆ పాఠశాలలో 84 మంది విద్యార్థులు ఉండేవారు. శ్రీనివాసరావు తిమ్మాయపాలెంను తన జన్మభూమి కంటే మిన్నగా ప్రేమిస్తూ గ్రామస్థులతో మమేకమయ్యేవారు. కొద్ది సంవత్సరాలకే 250 మంది విద్యార్థులతో పూర్తి స్థాయిలో హైస్కూల్‌గా రూపాంతరం చెందింది. ఆ పాఠశాలకే హెచ్‌ఎంగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అప్పటికే 450 మంది విద్యార్థులయ్యారు. 2021-22 విద్యా సంవత్సరం నాటికి 1023 మంది విద్యార్థులు చేరారు. ఆయన శ్రమ ఫలించి జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉండే ఉన్నత పాఠశాలల జాబితాలో తిమ్మాయపాలెం హైస్కూల్‌నూ చేర్చారు. ఈ క్రమంలోనే రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కూడా అదే పాఠశాలలో ఏర్పాటైంది. అద్దంకి, ముండ్లమూరు, పంగులూరు మండలాల్లోని 28 గ్రామాల నుంచి తిమ్మాయపాలెం హైస్కూల్‌కు విద్యార్థులు వచ్చేవారు. స్కూల్ అసిస్టెంట్‌గా చేరినప్పటి నుంచి సుమారు 28 సంవత్సరాల సర్వీసులో 19 సంవత్సరాలు పాటు తిమ్మాయపాలెంలోనే శ్రీనివాసరావు పనిచేశారు. అద్దంకిలోని కాకానిపాలెం హైస్కూల్‌లో 7 సంవత్సరాలు పనిచేయగా, గత ఏడాదిన్నర నుంచి చక్రాయపాలెం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల విజయవాడలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. స్వచ్ఛ పాఠశాలగా కూడా తిమ్మాయపాలెం హైస్కూల్ ఎంపికవడంలో ఆయన ముద్ర ఉంది.

ప్రత్యేక కార్యక్రమాలు, ప్రచారాల కృషితో..

- పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధించటంతో పాటు, ఉపాధ్యాయులు గ్రామగ్రామాన తిరిగి క్యాంపెయిన్ నిర్వహించారు. కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ప్రచారం చేశారు.
- అన్ని రకాల పోటీ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.
- రోజూ అదనంగా స్టడీ అవర్స్ నిర్వహించేవారు.
- దాతలు, ఉపాధ్యాయుల సహకారంతో సాయంత్రం స్నాక్స్ కూడా ఏర్పాటు చేశారు.
- అద్దంకి, ముండ్లమూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయించారు.
- బస్సుల్లో విద్యార్థులు ఎక్కి వెళ్లే వరకు శ్రీనివాసరావు అక్కడే ఉండేవారు. ఇలా ప్రతి ఒక్క విషయంలో ప్రత్యేక శ్రద్ధతోపాటు గ్రామస్థుల సహకారం కూడా పూర్తి స్థాయిలో అందింది.
- జాతీయ స్థాయిలో జరిగిన ఇన్‌స్పైయిన్ సైన్స్ ఫేర్‌లో కూడా తిమ్మాయపాలెం విద్యార్థిని పాల్గొంది.
- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తిమ్మాయపాలెం విద్యార్థిని ద్వితీయ స్థానం పొంది చంద్రబాబు చేతులు మీదుగా బహుమతి అందుకుంది.
- దాతల సహకారంతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులు కూడా చేయించారు.



సాయంత్రం అల్పాహారం అందిస్తూ..



స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ వ్యాసరచన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి అందుకుంటున్న తిమ్మాయపాలెం విద్యార్థిని (ఫైల్)

కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యేలా శిక్షణ



విద్యతో పాటు క్విజ్, పలు కాంపిటేటివ్ పరీక్షలతో ఇతర రంగాల్లో రాణించేలా హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. క్విజ్ కాంపిటేషన్‌లో రూ.50 వేల ప్రైజ్ మనీ కూడా పొందాను.

- పీవీఎల్ ఆదిత్య, బీటెక్ మొదటి సంవత్సరం, నూజివీడు ట్రిపుల్‌ఐటీ.

చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పారు



ఉత్తమ విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ నేర్పారు. పాఠశాలలో నేర్పిన క్రమశిక్షణ ఉత్తమ విద్యార్థులుగా నిలిచేందుకు ఎంతగానో దోహద పడింది. ఉపాధ్యాయులంతా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడంతో మంచి ఫలితాలు సాధించాం.

- ఎస్‌వి పార్ధసాయి, జూనియర్ ఇంటర్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ

గ్రామస్థులు, దాతల సహకారం మరువలేనిది



గ్రామస్థులు, దాతల సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం. అదే సమయంలో సహచర ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అల్పాహారం, స్నాక్స్‌ను ఏర్పాటు చేశాం. సమష్టి కృషితోనే పాఠశాలల అభివృద్ధి జరుగుతోంది.

- కేవీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం, చక్రాయపాలెం స్కూల్ (ప్రస్తుతం)



కంభం చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా (ఫైల్)

చకచకా..

- రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి
- కంభం చెరువు పర్యాటకులను ఆకట్టుకునేలా చర్యలకు అడుగులు
- ఇటీవల చెరువుపై కలెక్టర్, జేసీల పరిశీలన.. బోటింగ్‌కు కృషి చేస్తామని హామీ


కంభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే 2వ అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపుతుండటంపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యాటక అభివృద్ధిపై కేంద్రీకరించింది. ఇందులోభాగంగా గత నెల 29వ తేదీన కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ కంభం చెరువును పరిశీలించారు. గత వారం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వరూప కంభం చెరువు కట్టపై జరిగిన సమావేశంలో కంభం చెరువును పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. తరువాత రెండో రోజే మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాథ్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ అధికారి బెన్‌హర్, ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి కంభం చెరువును పరిశీలించడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. చెరువును పర్యాటంగా వృద్ధి చేసి బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

- ఆసియా ఖండంలోనే అతిపెద్ద చెరువుగా కంభం చెరువు పేరు గడించింది. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల సతీమణి వరదరాజమ్మ ఈ ప్రాంత ప్రజలు కరువుతో పడుతున్న బాధలను గమనించి విశాలమైన కట్టను నిర్మించారు. నల్లమల అడవుల నుంచి ప్రవహించే గుండ్లకమ్మ, జంపలేరు వాగుల నుంచి నీరు కంభం చెరువుకు చేరుతోంది. అప్పటి నుంచి ఈ చెరువు రైతులపాలిట కల్పవృక్షంగా మారింది. చెరువులో ప్రస్తుతం 13 అడుగుల పూడిక ఏర్పడింది. ఈ చెరువుకు వెలుగొండ ప్రాజెక్టు ద్వారా శాశ్వత సాగునీటి పారుదల ఉండేలా పనులు జరుగుతున్నాయి. కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన కంభం చెరువు సందర్శకులను కట్టిపడేస్తోంది. 1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రెండు సార్లు కంభం చెరువును చూసి చల్లని వాతావరణంలో సూర్యాస్తమయం అద్భుతం అని కొనియాడారు. ఆయనతోపాటు ఆ తరువాత ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వై.ఎస్.రాజశేఖరరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డితో సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు చెరువును చూసి మంత్రముగ్ధులయ్యారు. కంభం చెరువు పరిరక్షణ కమిటీ పేరుతో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, విద్యావంతులు కలిసి రైతులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సెలవులు వచ్చాయంటే ప్రజలు కుటుంబసమేతంగా కంభం చెరువుకట్టపైకి వస్తారు. వినాయక చవితి, తేరాతేజీ పండుగల సమయంలో హిందువులు, ముస్లింలు భారీఎత్తున చేరుతారు. కార్తీక మాసంలో కూడా ప్రజలు భారీగానే వస్తుంటారు.

- **డ్రోన్‌ల ద్వారా చెరువు పరిశీలన**

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2016 ఆగస్టులో ఉన్నతాధికారులు డ్రోన్ కెమెరాల ద్వారా చెరువును పరిశీలించారు. చెరువుకట్టపై నుంచి చెరువు వైశాల్యం చూసి అప్పట్లో రాజుల పనితనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఆదాయ వనరుగా మారుతుందన్నారు. కంభం చెరువుకు రావాలంటే రైలు, రోడ్డు మార్గాలున్నాయి. చెరువుకట్టపై మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే పర్యాటకులను మరింతగా ఆకర్షిస్తుంది.

ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోవాలి



కంభం చెరువును పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని ఈ ప్రాంత వాసుల కల. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఆ కల నెరవేరుతుందనే నమ్మకంతో ఉన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కంభం చెరువును పర్యాటక కేంద్రంగా ప్రకటిస్తారని ఆశిస్తున్నాం.

- గోన చెన్నకేశవులు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఒంగోలులో 'బంగారు బాల్యం' కార్యక్రమం ముగింపు ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) విద్యార్థిని నృత్యం


అన్ని రంగాల్లో పిల్లలు ప్రకాశించాలి

- 'బంగారు బాల్యం' ముగింపు సభలో కలెక్టర్ అన్సారియా పిలుపు
- ఒంగోలులో ఆకట్టుకున్న భారీ ర్యాలీ



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యవనికపై అన్ని రంగాల్లో మన జిల్లా బిడ్డలు ప్రకాశించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఈ దిశగా ఆరోగ్య, సురక్షిత, సంతోషకరం, సాధికారితతో కూడిన బాల్యాన్ని మన జిల్లాలోని బాలలందరికీ ఇవ్వాలన్న లక్ష్యంతోనే 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో వారం రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా పీవీఆర్ బాలుర హైస్కూలులో బుధవారం సాయంత్రం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి ఆడబిడ్డ కనీసం డిగ్రీ చదవాలని, జీవితంలో అత్యున్నత స్థాయికి వెళ్ళాలని ఆకాంక్షించారు. బాలలపై నేరాలు జరగకుండా, వారు బాలకార్మికులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ వారం పాటు నిర్వహించిన ఉత్సవాలతోనే ఈ కార్యక్రమం ముగిసిపోలేదని, నిరంతరం ఇదే స్ఫూర్తితో అధికార యంత్రాంగం పనిచేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. బాల్య వివాహరహిత, బాల కార్మికరహిత, ఆరోగ్యకర, అక్షర చైతన్యవంతమైన జిల్లా ఆవిష్కృతమే లక్ష్యంగా బంగారు బాల్యం కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఈ బాలోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ బంగారు బాల్యంకు తల్లిదండ్రుల ప్రేమ, ఉపాధ్యాయుల శ్రద్ధ, మంచి స్నేహితుల సాంగత్యం, పోలీస్‌శాఖ వంటి రక్షణ వ్యవస్థలు ముఖ్యమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు అవసరమైన మేరకే వాడాలన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు స్థానిక పాత గుంటూరు రోడ్డులోని ఎ1 కన్వెన్షన్ నుంచి అద్దంకి బస్టాండు మీదుగా పీవీఆర్ స్కూలు వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి, సార్డ్స్ ప్రతినిధి సునీల్, ఐసీడీఎస్ పీడీ మాధురి ఉన్నారు.



'బంగారు బాల్యం' అక్షర ఆకృతిలో విద్యార్థులు

పోతురాజుకాలువ పనులపై విచారణ చేయాలి

- శాసనసభ జీరో అవర్‌లో ఎమ్మెల్యే దామచర్ల డిమాండ్

ఒంగోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని పోతురాజు కాలువ ఆధునికీకరణ పనుల్లో గత వైసీపీ ప్రభుత్వంలో భారీగా అవకతవకలు, అవినీతి జరిగిందని, ఆయా పనులపై విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ జీరో అవర్‌లో బుధవారం ఈ అంశాన్ని ఎమ్మెల్యే దామచర్ల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు పోతురాజు కాలువ ఆధునికీకరణ కోసం తన విజ్ఞప్తి మేరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.100కోట్లు మంజూరు చేశారన్నారు. పనులు చేపట్టేలోపు వైసీపీ అధికారంలోకి రాగా రూ.89కోట్లతో టెండర్లు ఖరారుచేశారని, అనంతరం రివర్స్ టెండర్‌ల పేరుతో రూ.67కోట్లతో పనులు చేపట్టి రూ.42కోట్లు నిధులు ఖర్చు చేశారన్నారు. అయితే వాస్తవంగా పనులు పరిశీలిస్తే అందులో నాలుగో వంతు కూడా జరిగిన దాఖ లాలు లేవని, ఈ పనుల్లో వైసీపీ ప్రభుత్వంలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దానిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఒంగోలు నగర ప్రజలను ముంపు నుంచి కాపాడేందుకు అత్యంత ప్రధానమైన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు తిరిగి చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు అపార్ కష్టాలు..

● ఆధార్‌లో తప్పుల సవరణకు పరుగులు
● ఇబ్బందిపడుతున్న తల్లిదండ్రులు

సంతనూతలపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్రం ప్రభుత్వం ఆదేశించింది. ప్రతీ విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఐడీ కేటాయించాలని సూచించింది. అకడమిక్ పురోగతి అంచనాకు ఇది ఉపయోగపడనుందని తెలిపింది. ఈమేరకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. సంతనూతలపాడు మండలంలో 46 ప్రభుత్వ, 24 ప్రైవేట్ పాఠశాలలు, 3 ప్రైవేట్‌కళాశాలు ఉన్నాయి. వీటిలో 1-10 వతరగతి విద్యార్థులు 9,143 మంది ఉన్నారు. ఇంటర్ కళాశాలలో 2,442 మంది ఉన్నారు. వీరందరికి అపార్ ఐడీ కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,334 మందికి అపార్‌ఐడీలు కేటాయించారు. అయితే దీనిని రూపొందించడానికి క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారు.

పనులు మానుకుని...

పాఠశాల రికార్డులు, ఆధార్‌కార్డులు, యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలు ఒకేలా ఉంటే అపార్ ఐడీ జనరేట్ అవుతోంది. పాఠశాల రికార్డుల్లో, ఆధార్‌లు వివరాలు ఒకేలా ఉండి యూడైస్ ప్లస్‌లో తప్పుగా నమోదైతే ఎంఈవో లాగిన్‌లో సరిచేస్తున్నారు. చాలా పాఠశాలల్లో 60శాతం మంది వివరాలు మూడింట్లో సరిపోతున్నాయి. ఆధార్‌లో విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, ఇంటిపేర్లు, పుట్టిన తేదీ వంటి వాటిలో ఎక్కువగా ఉంటున్నాయి. మరికొంత మంది వివరాలు వేరే పాఠశాల నుంచి ప్రస్తుతం చదివే స్కూలుకు మారి సంవత్సరం, రెండేళ్లు కావస్తున్నా వాళ్ల గతంలో చదివిన స్కూలు నుంచి ప్రస్తుత పాఠశాలకు మార్చుకోకుండా ఉండటం వంటి తప్పులు ఎక్కువగా ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల వేరే రాష్ట్రాల్లో చదివి, ఇక్కడకు వచ్చిన వాళ్ల అక్కడ ఆన్‌లైన్‌లో సరిచేయకపోవడంతో సమస్య ఏర్పడింది, దీంతో తలిదండ్రులకు పెద్ద సమస్య వచ్చి పడింది. ఆధార్‌లో మార్పులు జరగాలంటే జనన ధృవీకరణపత్రం తప్పనిసరి. ఆధార్‌కేంద్రాల్లో డిజిటల్ సంతకమున్న పత్రాలనే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ కారణంగా చాలామంది ఇబ్బందిపడుతున్నారు. పిల్లల తల్లిదండ్రులు పనులు మానుకుని ఆధార్‌కేంద్రాలు, సచివాలయాలు, జిల్లా కేంద్రాలకు ఆధార్‌కార్డు సవరణ కోసం ఉరుకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అపార్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతోంది.



సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో విద్యార్థిని వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయురాలు

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

● దివ్యాంగుల హక్కుల సేవా సమితి విజ్ఞప్తి

ఒంగోలు నగరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దివ్యాంగులను పింఛన్లను పునరుద్ధరించాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి నాయకులు కోరారు. బుధవారం అమరావతిలో రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాలు, సంక్షేమశాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎలాంటి సాహేతుక కారణాలు చూపకుండానే దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసిందన్నారు. పొరుగు సేవల కింద ఉద్యోగం చేస్తున్న దివ్యాంగులకు కూడా పింఛన్లు రద్దు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంలోని రేషన్‌కార్డులో దివ్యాంగుల పేరు ఉంటే ఆ కుటుంబానికి కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని రద్దు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది దివ్యాంగులు పింఛన్లను ఈ విధంగా రద్దు చేశారని వారు చెప్పారు. పొరుగు సేవల కింద పనిచేస్తున్న దివ్యాంగులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్ళగా ఆధార్ నంబరు నమోదు చేయటంతోనే ఉద్యోగి అని దరఖాస్తునే తిరస్కరిస్తున్నారని తెలిపారు. పొరుగు సేవల ఉద్యోగికి రెగ్యులర్ ఉద్యోగిగా సౌకర్యాలు, వేతనాలు కల్పించకుండా ఉద్యోగి అనే పేరుతో పింఛన్‌ను తిరస్కరించటం అన్యాయమన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషావలి, వెంకటేశ్వరరావు, అమీర్‌హంజా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పారిశ్రామికవేత్తలకు ఎగుమతులపై అవగాహన ఉండాలి

● ఈసీజీసీ అధికారి ముఖర్జి

ఒంగోలు నగరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్న పారిశ్రామికవేత్తలు తాము తయారు చేస్తున్న ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి, దిగుమతి చేసుకోవటంతో అవగాహన కలిగి ఉండాలని ఎక్స్‌పోర్టు క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీజీసీ) ప్రతినిధి ముఖర్జి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఒంగోలులోని సరోవర్ హోటల్ సమావేశం హాలులో ఎక్స్‌పోర్టు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం కార్యక్రమం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బత్తుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈసీజీసీ అధికారి ముఖర్జి, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ప్రతినిధి జి.రఘునాథబాబు మాట్లాడారు. ఎగుమతులు, దిగుమతుల్లో సరైన మెలకువలు పాటిస్తే నష్టపోకుండా ఉంటారన్నారు. ఎగుమతి చేసే ఉత్పత్తులకు ఇన్సూరెన్సు కలిగి ఉంటే ఎలాంటి నష్టం జరిగినా తగిన పరిహారం అందుతుందని చెప్పారు. అదే విధంగా మీ వద్ద నుంచి సరుకును దిగుమతి చేసుకున్న వారు సకాలంలో సొమ్ము చెల్లించకపోయినా ఆ వివాదాన్ని పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దేశంలోనే 80శాతం మంది ఎగుమతిదారులు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్టు ఆర్గనైజేషన్‌లో సభ్యులుగా ఉన్నారన్నారు. వీరికి ఎగుమతి, దిగుమతుల్లో వచ్చే ఇబ్బందులను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024-29కి సంబంధించిన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించిందన్నారు. ఇందులో పారిశ్రామికవేత్తలకు గరిష్ఠంగా 25శాతం సబ్సిడీ ప్రభుత్వం నుంచి అందుతుందని, అయితే దీనికి సంబంధించి విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదని వివరించారు. సమావేశంలో గ్రానైట్, వస్త్ర తదితర ఎగుమ తిదారులు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతినిధి ముఖర్జి

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

పెరుగు శ్రీనివాస ప్రసాద్, గృహనిర్మాణశాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, కొండపి మండల ప్రత్యేకాధికారి

అధికారితో ముఖాముఖి



ప్రశ్న: పీఎంఏవై (1.0) కార్యక్రమం ఎప్పటి వరకు కొనసాగుతోంది?

జవాబు: గడిచిన ఐదేళ్లలో పీఎంఏవై (1.0) పథకంలో ఇళ్లు నిర్మించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తి చేసుకోవాలి. పథకం రానున్న మార్చి వరకు కొనసాగుతోంది.

ప్ర: ఈపథకంలో లబ్ధిదారులకు డబ్బులు, మెటీరియల్ సక్రమంగా అందుతున్నాయా?

జ: లబ్ధిదారులకు పేమెంట్స్ వారంవారం ఇస్తున్నాం. మెటీరియల్ సిమెంటు, ఐరన్ కూడా గోడౌన్‌లలో అందుబాటులో ఉంది.

ప్ర: కొత్త ఇళ్లు ఎప్పుడు మంజూరవుతాయి?

జ: పీఎంఏవై (2.0) కార్యక్రమం సంక్రాంతి నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో ఇళ్లులేని వారికి కొత్తవి మంజూరవుతాయి.

ప్ర: 2014-19 మధ్యలో నిర్మించిన ఇళ్ల పరిస్థితి ఏమిటి?

జ: జిల్లా వ్యాప్తంగా ఇటీవల క్షేత్రస్థాయి సర్వే చేశాం. జిల్లాలో 27,026 ఇళ్లకుగాను 48 కోట్ల 15 లక్షల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో ఆ నిధులు విడులవుతాయి.

ప్ర: శాఖలో జిల్లాలో క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉందా?

జ: సిబ్బంది కొరతలేదు. ఇటీవల ఖాళీగా ఉన్న పోస్టులకు క్వాలిఫై అయిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ప్రభుత్వం భర్తీ చేసింది.

- కొండపి, ఆంధ్రజ్యోతి

మాల కార్పొరేషన్ చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందన



చైర్మన్ విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అభినందించారు. తాడేపల్లిలో బుధవారం చైర్మన్ విజయ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్ చైర్మన్ విజయ్ కుమార్‌కు జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా నాయీబ్రాహ్మణుల సమారాధన



సమారాధనలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర క్షౌరశాలల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీఆర్ఎస్‌కే గ్రీన్‌సిటీలో నాయిబ్రాహ్మణ కార్తీక సమారాధన ఘనంగా సాగింది. జిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పథకంవారి మధుబాబు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురుస్వామి, వీఆర్ఎస్‌కే గ్రూప్స్ అధినేత వల్లూరి వెంకటరామయ్య, ఒంగోలు ప్యాకింగ్ ఇండస్ట్రీస్ అధినేత గోనుగుంట శేషారావు, నాయిబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర క్షౌరశాల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొనిజేటి రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా ఏల్చూరి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా భూసరపల్లి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులుగా అజయ్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మహిళా కబడ్డీ జట్టుకు రైజ్ విద్యార్థినులు



క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆళగప్ప యూనివర్శిటీలో జరగనున్న మహిళా కబడ్డీ పోటీలలో జేఎన్‌టీయూ యూనివర్శిటీ తరుపున ఆడే 12 మంది టీంలో స్థానిక రైజ్ కృష్ణసాయి గ్రూపునకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ శిద్ధా హనుమంతరావు తెలిపారు. బుధవారం స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో జట్టుకు ఎంపికైన పి.అంజనీదేవి, డీవీ.సుస్మితలను డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, గౌరవచైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్.హిమచంద్రబాబు, ఎన్.సుబ్బారావు అభినందించారు.

ప్రతి ఒక్కరికీ తపాలా బ్యాంకింగ్ సేవలు

● పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణరాజ్

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ తపాలా ద్వారా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సర్వీసులను అందజేస్తున్నట్లు ఒంగోలుకు చెందిన పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణరాజ్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులోని తపాలా కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ పోస్ట్ బ్యాంక్ నుంచైనా నగదు తీసుకోవచ్చని, అందుకు ఎటువంటి చార్జీలు లేవన్నారు. కేవలం రూ.200తో ఖాతాను తీసుకోవచ్చని, పోస్టాఫీసుకు వెళ్లి నగదు తీసుకోలేని వారి కోసం ఇంటి వద్దకే వచ్చి అందించే సౌకర్యం ఉందన్నారు. సచివాలయ పరిధిలో ఉన్న ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాంక్‌పై దృష్టి సారించాలని ఎంపీడీవో జ్యోతి కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రఘుబాబు, ఏపీవో ధనుంజయ, టీఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులకు అండగా ఉంటా

● నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని వైసీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు పేర్కొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ముఖ్యనాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కష్టకాలంలో ఉన్న పార్టీకి అండగా ఉండి పని చేస్తున్న శ్రేణులకు అండగా ఉంటానని తెలిపారు. ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కార్పొరేటర్లు ఇమ్రాన్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, కుప్పం ప్రసాద్, క్రాంతికుమార్, బొట్లా సుబ్బారావు, రొండా అంజిరెడ్డి, చావలి శివ, మీరావలి, ఎస్‌కే నాగూర్, కరుణాకర్, భూమిరెడ్డి రమణమ్మ, మధు, పి.సుధాకర్, రొండా అంజిరెడ్డి, కటారి ప్రసాద్ పాల్గొన్నారు.

వాహన చోదకులకు కౌన్సెలింగ్

టంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఎస్సై నాగమల్లీశ్వరరావు బుధవారం వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతంచేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ముఠా కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు కార్పొరేట్, ప్రైవేటుపెట్టుబడుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహాధర్నాలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గోపి, వెంకట్రావు, చంద్ర, సంజీవయ్య, కోటేశ్వరరావు, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ పడిభజన



పడిభజనలో పాల్గొన్న స్వాములు

చీమకుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లామల్లి గ్రామంలో అయ్యప్ప అఖండపడిభజన కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం వైభవంగా జరిపారు. గ్రామానికి చెందిన సీహెచ్.హనుమంతరావు, సుభాషిణి దంపతులు ఏర్పాటు చేసిన ఈ భజనలో శివశంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తిపాటలు ఆలపించారు. అయ్యప్పకు అభిషేకం భక్తిశ్రద్ధలతో జరిపారు. సర్వదీక్షాస్వాములు పాల్గొన్నారు.

5 మద్యం బాటిళ్లు పట్టివేత

టంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కారుమంచిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దాసరి మాధవిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 5 క్వార్టర్ బాటిళ్లు దొరికాయి. ఎస్సై నాగమల్లీశ్వరరావు కేసు నమోదు చేశారు.

సీసీరోడ్ల పనులపై జడ్పీ సీఈవో సమీక్ష

కొండపి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న సీసీరోడ్లపై జడ్పీ సీఈవో చిరంజీవి సమీక్షించారు. కొండపిలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం మండల పరిషత్ అతిథిగృహాన్ని చిరంజీవి పరిశీలించారు. అదేవిధంగా బీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న సిమెంటు రోడ్డను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవోలు రామాంజనేయులు, రమణమూర్తి, సుజాత, దేవసేనకుమారి, జయమణి పాల్గొన్నారు.

వరి, శనగ పంటల పరిశీలన

కొండపి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రప్పడియ, నెన్నూరుపాడు, పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏడీఏ ఇ.నిర్మలకుమారి, ఏవో డి.విజయ్‌కుమార్ వరి, శనగ పంటలను పరిశీలించారు. వరిలో ఆకుముడత నివారణకు రైతులకు పలుసూచనలు చేశారు. సమావేశంలో వీఏఏలు జ్యోష్న, శ్రీకాంత్, వెంకటరావు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా పోస్టులపై వైసీపీ ఫిర్యాదు

ఒంగోలు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందని పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త చుండూరి రవిబాబు ఆరోపించారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ కార్యకర్తలపై బనాయిస్తున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.రాజశేఖర్, కుప్పం ప్రసాద్ పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: సోషల్‌మీడియాలో వస్తున్న అభ్యంతరకర పోస్టులపై బుధవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మండల, పట్టణ కన్వీనర్లు పమిడి వెంకటేశ్వర్లు, శేఖరరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు తోటల పరిశీలన

టంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు పరిసర పొలాల్లో వేసిన పొగతోటలను బుధవారం టుబాకో బోర్డు అధికారులు పరిశీలించారు. తోటల పెరుగుదల, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల స్థితిగతులపై రైతులతో మాట్లాడారు. రావి బ్రహ్మయ్య పొలంలో నాలుగు రోజుల క్రితం నాటిన పొగమొక్కలను పరిశీలించి సూచనలు చేశారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చీమకుర్తి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ సుబ్బారావు కోరారు. పల్లామల్లి జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు, మహిళలుపై జరుగుతున్న నేరాలు, రోడ్డుప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అమ్మనబ్రోలు గురుకులంలో..

నాగులుప్పలపాడు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు సూచించారు. అమ్మనబ్రోలు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు పోలీసులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏదైనా ఇబ్బంది కలిగినప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.శ్రీకాంత్, ఏఎస్ఐ వెంకటలక్ష్మి, ప్రిన్సిపాల్ కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

సంతనూతలపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. స్థానిక ఎండ్లూరు డొంకవద్ద మహిళ ప్రాంగణంలో, పేర్నమిట్ట శ్రీప్రతిభ, సరస్వతి జూనియర్ కళాశాలలో నూతన ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు కల్పించారు. ఈనెల 23, 24 తేదీల్లో అన్ని బీఎల్‌వో కేంద్రాల్లో ఓటు నమోదు, చేర్పులు, సవరణల ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తాలూకా ఎస్సై అనిత చట్టాలపై అవగాహన కల్పించారు.

కొండపిలో..

కొండపి: జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండే విద్యార్థులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని డీటీ రవికుమార్ సూచించారు. బుధవారం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పలు అంశాలపై ప్రసంగించారు. ఎలక్షన్ డీటీ డేవిడ్‌రాజు, ఎంఆర్ఐ శ్రీనివాసులు, అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, జీజేసీ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ అరుణ, కె.ఉప్పలపాడు హైస్కూల్ హెచ్‌ఎం సుసన్నకుమార్, ఎమ్మెస్సార్ డీసీ ప్రిన్సిపాల్ స్వామిదాస్, హరిబాబు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

సంతనూతలపాడు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట జడ్పీ హైస్కూల్లో బుధవారం షూటింగ్‌బాల్ జూనియర్, సబ్‌జూనియర్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. 60 మంది క్రీడాకారులు పాల్గొనగా జూనియర్ విభాగానికి 12 మంది బాలికలు, 12 మంది బాలురు, సబ్‌జూనియర్ 12 మంది బాలికలు, 12 మంది బాలురు ఎంపికచేశారు. త్వరలో అనంతపురంలో జరిగే 43వ రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని హెచ్‌ఎం పార్వతిశాంతి తెలిపారు. కార్యక్రమంలో ఫణీంద్రకుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలోను, అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. బుధవారం మార్టూరుకు చెందిన సి.ప్రవీణ్‌కుమార్, సంపత్‌కుమార్ సింగరాయకొండలో శుభకార్యానికి వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామం బయల్దేరారు. ఏడుగుండ్లపాడు వద్దకు వచ్చేసరికి ప్రైవేట్ బస్సు ఒక్కసారిగా రావడంతో ప్రవీణ్‌కుమార్ తాను సడన్ బ్రేక్ వేశారు. దీంతో మోటార్ సైకిల్ అదుపుతప్పి ప్రవీణ్‌కుమార్‌తో పాటు సంపత్‌కుమార్ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఘనంగా శంకు, చక్రాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠలో పాల్గొన్న అర్చకులు, గ్రామస్థులు

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దొడ్డవరప్పాడు దళితవాడలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి శంకు, చక్రాల ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి ఆధ్వర్యంలో వేదపండితులు దివి శేషాచార్యులు యాజ్ఞీకంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గోరంట్ల వెంకట్‌రావు, ముళ్లూరి మురళి, గోరంట్ల వెంకటేష్, చుండూరి రఘురాం, బెజవాడ వెంకటేశ్వర్లు, బొమ్మల రామలింగం, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

మద్దిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపీడీవో వి.జ్యోతి పేర్కొన్నారు.బుధవారం బంగారు బాలోత్సవం కార్యక్రమం ముగింపు సందర్భంగా మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. తహసీల్దార్ సుజన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులదన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన

నాగులుప్పలపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్‌ఐవీని నిర్మూలించవచ్చని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ మల్లీశ్వరి పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులోని ఆక్వా కంపెనీలోని మహిళా కూలీలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకే మార్గాలను వివరించారు. బాధితుల పట్ల వివక్షత చూపకూడదని చెప్పారు. 2030 నాటికి హెచ్‌ఐవీ రహిత రాష్ట్రం లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది దివ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం



మజ్నును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న డాక్టర్ షేక్ మజ్నును బుధవారం అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక స్కూల్‌ల జరిగిన కాంప్లెక్సు సమావేశంలో తోటి ఉపాధ్యాయులు ఆమెను సన్మానించి విద్యాసేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేస్ కళాశాలలో సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జియో స్పేషియల్ సర్వే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. సీనియర్ ఇంజనీర్ ఇన్ జేఐఎస్‌కి చెందిన పాపిశెట్టి వెంకటేష్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు జియో స్పేషియల్ సర్వే, దాని ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, ఏవో రమణబాబు, విభాగాధిపతి గోపు గణేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గం



పవన్ కల్యాణ్ రామాంజనేయులు కన్వీనర్ సబీనా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా సీహెచ్.పవన్‌కల్యాణ్, సన్నిబోయిన రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా స్టాలిన్, ప్రజ్వల్, సుభానాబీ, సహాయకార్యదర్శిగా సురేంద్ర, సురేష్, బెంజిమెన్, సహాబీ, కోశాధికారిగా బి.రామాంజనేయులు, జిల్లా మహిళా కన్వీనర్‌గా సబీహాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేఖరుల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఒంగోలులో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ ఇంజనీరింగ్ కాలేజీలు, అలాగే నియోజకవర్గకేంద్రాల్లో డిగ్రీ, మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీకి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రవీంద్రభారతి విద్యార్థులకు బహుమతులు

ఒంగోలు విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో ఒంగోలులోని రవీంద్రభారతి హైస్కూలుకుచెందిన విద్యార్థులు పలు పతకాలను సాధించారు. వక్తృత్వంలో ఎస్.పూర్ణవ్ ద్వితీయ, డ్రాయింగ్‌లో బి.విష్ణుకార్తీక్ తృతీయ, డాన్స్‌లో జి.హరిణి, ఆర్.కౌముది, బి.కారుణ్య, పి.కేయూర, ఎస్.శ్రీవల్లి, జి.అరవింద గ్రూపు ద్వితీయ బహుమతి సాధించారు. ఎ.జాహ్నవి, కె.లాస్య, కె.జ్యోతిక, కె.తన్మయిల టీం తృతీయ బహుమతి, క్విజ్ జూనియర్ విభాగంలో ఎం. ఝాన్సీవిష్ణేష్, బీవీ.కార్తీక్, ఎన్.వేదస్వరూప్ టీం తృతీయ, సీనియర్ విభాగంలో జి.చరణ్, ఎస్.కార్తీక్, ఎం.దినేశ్వర్‌ల టీం తృతీయ బహుమతి సాధించారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ టి.సాత్విక్‌రాజ్, ప్రిన్సిపాల్ టి.లక్ష్మీరాజ్, అధ్యాపకులు అభినందించారు.

గ్యాస్ డీలర్ శేషారావు మృతి



శేషారావు(ఫైల్)

చీమకుర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ డీలర్ కసుకుర్తి శేషారావు(62) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గతంలో ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేశారు శేషారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం చీమకుర్తిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పలువురు టీడీపీ నాయకులు, పట్టణవాసులు ఆయన భౌతికకాయానికి ఘనంగా నివాళులు అర్పించారు.

క్రైం సమాచారం

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కష్టపడాలి

● 6వ అదనపు జిల్లా న్యాయాధికారి శుభవాణి



వార్డెన్‌కు పలుసూచనలిస్తున్న న్యాయాధికారి

మార్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మార్కాపురం 6వ అదనపు జిల్లా న్యాయాధికారి శుభవాణి అన్నారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి శుభవాణి మాట్లాడుతూ జీవితంలో పైకి ఎదగాలంటే మాతృభాషతో పాటు ఆంగ్లంపై పట్టు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. భవనం పాతబడిపోయినట్లు గుర్తించారు. అంతేకాక వంట మనిషిలేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు గమనించారు. పరిశుభ్రత విషయంలో శ్రద్ధచూపాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ బి.ఏడుకొండలు, న్యాయసేవ సహాయ న్యాయవాది ఎం.అన్వర్‌బేగ్, ఎన్‌జీవో ప్రతినిధి బంకా అనిల్‌రాజు, డీవీఎమ్‌సీ సభ్యులు బి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తూకం తగ్గకుండా చూడాలి

గిద్దలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చౌకడిపోలకు బియ్యం, చక్కెర, తదితర వస్తువులు అందించే సమయంలో తూకాలు తక్కువ రాకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగడాల రంగస్వామి విజిలెన్స్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. చాలామంది డీలర్లకు గోడౌన్ నుంచి తక్కువ తూకాలతో బియ్యం, చక్కెర తదితర వస్తువులు వస్తున్నాయన్నారు. దీంతో డీలర్లు సైతం చేసేదేమి లేక రేషన్‌కార్డుదారులకు మరింత తగ్గించి వస్తువులను పంపిణీ చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారించి తూకాలు తక్కువ రాకుండా చూడాలని కోరారు.

ఆలయంలో చోరీ

● రూ 20వేల నగదు మాయం

కొనకనమిట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబాపురం గ్రామంలో వెలసిన శ్రీబాలత్రిపురసుందరిదేవి అమ్మవారిగుడిలో మంగళవారం చోరీ చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి గుడిలోకి దొంగలు తలుపులు పగలకొట్టి ప్రవేశించారు. హుండి పగలకొట్టి అందులో ఉన్న సుమారు రూ20వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఉదయం ఆలయ పూజారి వెళ్లే వెళ్లేసరికి గుడితాళాలు పగలకొట్టి హుండి పగలకొట్టి ఉండటంతో గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామంలో ప్రజలు గుడి లోకి వెళ్లి చూసి అనంతరం కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే దేవాలయాల దొంగతనాలకు పాల్పడే పాత నేరస్థులను విచారించే పనిలో ఉన్నామన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి పరిశీలన



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న జేసీ

పొదిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొదిలి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని జేసీ గోపాల కృష్ణ బుధవారం పరిశీలించారు. ఎన్టీఆర్ టౌన్‌షిప్ కోసం సర్వే నెంబరు 1310/1,2,4లో 5.26 ఎకరాలు, సర్వే నెంబరు 1309/3,4లో 14.16ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి జేసీకి వివరించారు. ఇతరులు ఆక్రమించినట్లు గుర్తించారు. ఈ స్థలాన్ని కోర్టు ఉత్తర్వుల మేరకు ఖాళీ చేయించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఆ స్థలానికి వెళ్లి ప్రస్తుత పరిస్థితిని జేసీ పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగులు కావాలని కోరితే ప్రభుత్వం నిర్ధేశించిన ధరకు ప్లాట్లు కేటాయించే అవకాశం ఉంది. జేసీ వెంట ఒంగోలు డెవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ అధికారి, ఆర్ఐ నరసింహారావు, సర్వేయర్ గురవయ్య, విఆర్వో సురేష్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మార్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించుకోకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో 956 సర్వే నంబరులోని ఆర్‌అండ్‌బీకి చెందిన డొంక పోరంబోకు భూమిని కొందరు ఆక్రమించారు. వాటిల్లో గృహాలు, పలు రకాలైన నిర్మాణాలు చేపట్టారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి ఏకంగా ఓ షోరూం నిర్మించేందుకు ఉపక్రమించాడు. ఈ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు పర్యాయాలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఆ భూమికి కొలతలు వేశారు. ఆక్రమించిన వారికి నోటీసులు అందజేశారు. అయినా వాళ్లు పట్టించుకోకపోవడంతో బుధవారం తహసీల్దార్ చిరంజీవి దరిమడుగు వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు తొలగించుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణల విషయంలో ఉపేక్షించేదిలేదని వారికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సంజీవయ్య, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా వుండాలి

● విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలి

● సైబరు నేరాలపై ఎస్ఐ సంపత్ ఆధ్వర్యంలో అవగాహన

పుల్లలచెరువు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నిత్యం మొబైల్ ఫోన్లుకు దూరంగా వుండి క్రమశిక్షణ మెలగాలని పుల్లలచెరువు ఎస్ఐ సంపత్ కుమార్ అన్నారు.బుధవారం జేడ్పీ పాఠశాలలో సైబరు నేరాలు, ట్రాఫిక్ రూల్స్, మహిళల సమస్యలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరు నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని బ్యాంకు నుంచి ఓటీపీ చెప్పమని అడిగి సైబరు నేరగాళ్ళు బ్యాంకులోని డబ్బులు కాజేస్తున్నారని అన్నారు. వాటప్స్‌లో వచ్చే లింకులపై నోక్కవద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి వాహనాలు నడపాలని అన్నారు.ముఖ్యంగా విద్యార్థులు అసభ్యకరంగా మాట్లాడటం, ఈవిటిజింగ్‌కు పాల్పడి కేరీర్ నాశనం చేసుకోవద్దని అన్నారు. బాలికల ఏదైనా సమస్య వుంటే వెంటనే పోలీసులకు ఫీర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న చౌడయ్య

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎర్రగొండ పాలెం ఎస్సై పి.చౌడయ్య అన్నారు. బుధవారం పట్టణం లోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థు లకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. అలాగే తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చినవారవుతారన్నారు. సిగిరెట్, మందు, డ్రగ్స్ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మీ తోటి విద్యార్థులు ఎవరైన వ్యసనాలకు లోనవుతుంటే వెంటనే వారి తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కోనేరు

● రోడ్డు వెంబడి మురుగు, చెత్తతో నిండిన దైన్యం ● దుర్గంధభరితంగా పరిసరాలు ● పట్టించుకోని పాలకులు



చెత్తా చెదారంతో నిండిన కోనేరు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొనేరు అంటే ఎంతో చరిత్ర, ప్రాధాన్యత ఉంటుంది. అలాంటి కోనేరు నేడు చెత్త కుండిలా తయారైంది. ఎర్రగొండపాలెం పట్టణంలోని కాశీవిశ్వేశ్వర దేవాలయం, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఉన్న కోనేరే ఇందుకు ఉదాహరణ.

ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కొనేరు ప్రస్తుతం చెత్తతో నిండింది. ఆ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు కూడా అక్కడే పేరుకుపోతోంది. దీంతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. మరోవైపు ఈ ప్రాంతాన్ని విషసర్పాలు అవాసంగా మార్చుకున్నాయి. పురాతన కొనేరు ఇలా ఉండటంతో పట్టణ ప్రజలు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోనేరు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు

ఆ దారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

మూడు రోడ్ల కూడలిగా ఉన్న ఈ రహదారిలో నిత్యం ప్రజలు తిరుగుతుంటారు. శివాలయానికి, అంజనేయ స్వామి దేవాలయాలకు భక్తులు ఉదయం సాయంత్రం వస్తుంటారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో భక్తులు ఎక్కువగా తిరుగుతున్నారు. అలాగే కొనేరు సమీపంలో పాఠశాల కూడ ఉంది. ఈ పాఠశాలకు విద్యార్థు లు వారి తల్లిదండ్రులు వచ్చి పోయే సమయంలో దుర్వాసనకు ముక్కులు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

నాటి మంత్రిని పలుమార్లు కలిసినా

ఆ ప్రాంత ప్రజలు బ్రాహ్మణ సంఘం నాయకుల గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కలిసి సమస్యను వివరించారు. అయితే ఆయన దీనిపై దృష్టి సారించలేదు. వెళ్లిన ప్రతి సారి అంచనాలు వేయాలని పనులు చేపట్టాలని అధికారులకు చెప్పడం మినహా చేసింది ఏమి లేదని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న కొణిదెల పవన్‌కల్యాన్ స్పందించి కోనేరు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అధికారుల్లో స్పందన కరువు

కొనేరు అభివృద్ధి చేయాలని అధికారులకు పలు మార్లు వినతిపత్రం అందించాం. అయినా స్పందన లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం. కొనేరు అభివృద్ధికి అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. స్థానిక నాయకత్వం సమస్యపై దృష్టిసారించాలి.

నానా నాగేశ్వరరావు, వై.పాలెం

పలుమార్లు వినతులు అందాయి

గతంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, ప్రజల నుండి వినతులు వచ్చాయి. అక్కడ చెత్త, మురికి నీర వేయవద్దని ఆ ప్రాంత ప్రజలకు చెప్పాం. ప్రస్తుతం 10 రోజులకు ఒకసారి పంచాయితీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కొనేరు చూట్టు ప్రహారీ, మెట్ల అభివృద్ధికి సూమారు కోటి రూపాయలు నిధులు వెచ్చించాల్సి ఉంది. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

ఈదుల రాజశేఖర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎర్రగొండపాలెం

సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులైనందున సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అంతేకాక సైబర్ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చుట్టూ సమాజాన్ని విద్యార్థులు జాగృతం చేయాలన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే 90 శాతానికి పైగా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వాటి కట్టడికి అప్రమత్తత ఒక్కటే మార్గమన్నా రు. మాదక ద్రవ్యాల వినియోగం వైపు వెళ్తే జీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థులు క్షణి క ఆవేశాలకు దూరంగా ఉండాల న్నారు. మార్కాపురం సీఐ పి.సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయన్నారు. విశృంఖల, పాశవికమైన ఆలోచనా విధానాల వలన ఈ దురాగతాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వాటిని కట్టడికి చట్టాల ద్వారానే కాక మనుషుల మస్తిస్కాల్లో మార్పులు రావాల్సి వుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మీర్జా షంషీర్ అలీబేగ్, కాలేజీ డైరెక్టర్ మీర్జా మహమ్మద్ మసూద్ అలీబేగ్, రూరల్ ఎస్సై అంకమ్మరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీలో సడలింపులు ఇవ్వాలి

అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కందుల



అసెంబ్లీలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి

మార్కాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమేదైనా ఉందంటే అది పశ్చిమ ప్రకాశమే.. ఈ ప్రాంతంలో వర్షాధారంతోనే పంటలు పండాలి. ఎంత కష్టపడిన ఎకరాకు రూ.15 వేలకు మించి ఆదాయం రాదు. అయితే ఇక్కడ ఆర్థికంగా వెనుకబడిన వారికి అందజేసే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీలో 5 ఎకరాల లోపు ఉండాలని నింబంధన పెట్టారు దీంతో ఎంతో మంది పేదలైనప్పటికీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు అందుకోలేక పోతున్నారు. అగ్రకులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లలకు ఈ సర్టిఫికేట్లు పలు రకాలైన ఫీజు రాయితీలకు ఉపయోగపడతాయి. అయితే ప్రస్తుత నిబంధనతో ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం రావడం లేదు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా పరిమితిని 5 నుంచి 10 ఎకరాలకు పెంచాలి' అని బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రస్తావించారు. ఎంతో సారవంతమైన భూములున్న కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాలో ఎకరాకు రూ.లక్షకు పైగానే ఆదాయం వస్తుందన్నారు. ఆ ప్రాంతాల వారితో సమానంగా 5 ఎకరాల్లోపు పరిమితిని విధించడం అన్యాయమన్నారు. ఈ విష యంలో రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. తద్వారా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

ప్రతి గ్రామానికి తాగునీరివ్వాలి : ముత్తుముల

గిద్దలూరు టౌన్ : ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సహకారంతో దేశమంతట స్వచ్ఛమైన నీరు అందించే జలజీవన్ మిషన్ ద్వారా గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గతంలో పరిపాలించిన వైసీపీ ప్రభుత్వం నిరంకుశ విధానాలతో పేదలను అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో గిద్దలూరు నియోజకవర్గంలో రెండు పెద్ద ప్లాంట్ల ద్వారా 60 గ్రామాలకు సురక్షితమైన నీరు అందించి ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. అయినప్పటికీ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాలను తుంగలో తొక్కిందని అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవ తీసుకుని ఈ పథకాన్ని అమలు చేసేలా చూడాలని కోరారు.

రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి

దర్శి ఏడీఏ బాలజీ నాయక్



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

పొదిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఏ పైరులోనైనా పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని దర్శి ఏడీఏ బాలజీ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నవరం, కంభాలపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని తెలిపారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించి కషాయాలు తయారు చేసుకొని వినియోగించుకోవాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో కంది పంటను పరిశీలించారు. రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్ అందుబాటులో ఉందన్నారు దీని ద్వారా పంటను ఆశించు పురుగులు, తెగుళ్లను గుర్తించవచ్చన్నారు. తద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జైన్‌లబ్దీన్, ఏఈవో, విపిఎఎస్, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని కే.ఎస్‌పల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మొక్క జొన్న పంట వేసే రైతులు 6, 7 తడుల నీటి అవసరం ఉంటుందన్నారు. కావున బోర్లలో నీటిమట్టం చూసుకుని సాగు చేయాలని పేర్కొన్నారు. అలాగే కంపెనీల దగ్గర నుండి అగ్రిమెంట్లు తీసుకుని మాత్రమే సాగు చేయాలన్నారు. బిందుసేద్యం, తుంపర సేద్యం పరికరాలు 90 శాతం రాయితీపై అందజేస్తు న్నామని ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ తెలిపారు. గ్రామసభ అనంతరం కంది, మొక్కజొన్న, పసుపు పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ పంటలకు వచ్చే చీడపీడల గురించి, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణా. దికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ సహాయకులు ఫాతిమా, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మినుములో సస్యరక్షణ చర్యలుచేపట్టాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం, చిన్నగుడిపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పప్పుశనగ, మినుము, మిరప, జొన్నపంటల్లో ఆకుముడత తెగులు ఆశించడం గమనించారు. నివారణకు ఎసిఫేట్ 1 జిమ్ లేదా పిప్రోనిల్ 2ఎంఎల్ డైమిథేట్ 2 ఎంఎల్ లేదా థైమెథోగ్జామ్ 0.2గ్రాములు లీటరు నీటికి కలిపి పికారి చేయాలని సూచించారు. మిరపలో కొమ్మ తెగులు నివారణకు ఆఫర్ ఆక్సిక్లోరైడె3 గ్రాములు, లేదా ఆజాఆక్సిస్ట్రోబిన్ 1ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. ఫసల్‌బీమాను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, వీహెచ్ఏ నీలానాయక్, వీఏఏ హరిజన నాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ మురళీకృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ఉపాధ్యాక్షులుగా ఓపే మల్లిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఎన్నో గ్రంథాలయాలలో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వయోజనవిద్య విశ్రాంత ఉప సంచాలకులు డాక్టర్ ఏ.వీరారెడ్డి, కొల్లి విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు లావణ్య, సాంబశివరాజు, గ్రంథపాలకుడు గాయం వెంకట శివారెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు : స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంఈవోలు, శింగంపల్లి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మానవహారం నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఏవో బుజ్జిబాయ్, పాఠశాల కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, రిటైర్డ్ వీడీవో చలమారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : గ్రంథాలయాన్ని విద్యార్థులు యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పి. చౌడయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పొదిలి : వారంరోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు నేటితో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, గ్రంథపాలకుడు శాంసన్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్‌వీఎస్ కుమార్, షకీల, హుస్సేన్ పాల్గొన్నారు.

గిద్దలూరు : లక్ష్యం లేకుండా చదువుకోవడం వ్యర్థమని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటదాస్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, జేవీవీ నాయకులు స్వరూపారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు. కాగా రాచర్ల గ్రంథాలయంలో జరిగిన ముగింపు సభలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు శివకోటేశ్వరరావు, గిరిధరశర్మ, పశువైద్యులు హరిబాబు, గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మంచి భవిష్యత్‌కు విద్యే మూలం అని ఎర్రగొండపాలెం కస్తూరిబా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి తిరుమలదేవి అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో బాగంగా బుధవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్ద దోర్నాల : బంగారు బాల్యం పోటీల్లో పెద్ద బొమ్మలాపురం విద్యార్థిని జిల్లా స్థాయికి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయురాలు జే ఝాన్సీ లక్ష్మీబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దదోర్నాల : విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్య క్రమం బుధవారం నిర్వహించారు. గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో భాగంగా కళాశాల విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించారు.

నేటి నుంచి ఎన్‌పీసీఐ మ్యాపింగ్

గిద్దలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటదాస్ తెలిపారు. 21న గణేష్‌నగర్, ఏటీఎంపాలెం, 22న బందెలదొడ్డిబజార్, కొంగళవీడు రోడ్డు, 23న క్లబ్ రోడ్డు, కోటగడ్డవీధి, 25న అర్బన్‌కాలనీ, నంద్యాల రోడ్డు, 26న నల్లబండ బజారు, రాచర్లరోడ్డు సచివాలయ పరిధిలో ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే పోస్టల్ అధికారులకు సచివాలయ సిబ్బంది సహకరించాలన్నారు. అన్ని పథకాలకు సంబంధించి ఆధార్ లింకేజ్ కార్యక్రమం చేపడతామన్నారు. బ్యాంక్ అకౌంట్లకు కూడా ఆధార్ మ్యాపింగ్ చేయిస్తామన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులే : ఎంఈవో

కంభం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉండాలని ఎంఈవో-2 శార్వాణి అన్నారు. పట్టణంలోని ఎల్‌కోట ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాన్ని ఆమె పరిశీలించారు. పాఠశాల నిర్వహణ గురించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులతో కలిసి డిజిటల్ శిక్షణ తరగతులను వీక్షించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ చిన్ని, పద్మావతిదేవి, కంభం, జంగంగుంట్ల, ఎల్‌కోట కాంప్లెక్స్‌ల నుంచి సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ప్రతిఒక్కరూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించాలి



ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్న డిపో మేనేజర్ నరసింహులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. ఆర్టీసీ గిఫ్ట్ పథకంలో భాగంగా ప్రయాణికులకు బుధవారం ఆయన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిఫ్ట్ పథకంలో భాగంగా గుండంచర్ల రూట్‌లో తిరిగే ప్రయాణికులు వారి టికెట్లు గిఫ్ట్ బాక్సులో వేశారన్నారు. వారిలో జి.గురవయ్య గుండంచర్ల, ఎస్సైర్ పుచ్చకాయలపల్లిలకు బహుమతులు లభించాయన్నారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థిని ప్రతిభ

పొదిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బంగారుబాల్యం కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలకోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మోహీన్ ప్రతిభ కనబరిచి తృతీయస్థానంలో నిలిచారు. జిల్లా ఎస్పీ ఎఆర్.దామోదర్ విద్యార్థినికి బహుమతితో పాటు ప్రశంసపత్రాన్ని అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీఎస్.కుమార్‌రెడ్డి, విద్యార్థులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పిచ్చయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పొదలకొండపల్లె జిల్లాపరిషత్ హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యను బుధవారం పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ షేక్.గౌస్‌భాషా అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది మొర్రి పిచ్చయ్యను శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలగించిన డ్రైనేజ్, ఫుట్‌పాత్‌లను నిర్మించాలి

పొదిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించిన మున్సిపల్ అధికారులు డ్రైనేజ్, ఫుట్‌పాత్‌లను త్వరితగతిన నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్ డిమాండ్ చేశారు. తొలగించిన కాలువలను నిర్మించాలంటూ మండల కన్వీనర్ బాలనరసయ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పట్టణ జనాభా అవసరాలకు అనుకూలంగా డ్రైనేజ్ వ్యవస్థలను ఆధునికీకరించాలన్నారు

అవీ..ఇవీ



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఉగ్ర వినతి

కనిగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సీఎం చంద్రబాబును బుధవారం కలిసి విన్నవించారు. కనిగిరిలో ట్రిపుల్ ఐటీ కాలేజి ఏర్పాటుకు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్‌కేర్ విధానాన్ని సీఎంకు వివరించానని, అలాగే ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు కనిగిరి ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో తొలి బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కనిగిరిలో చేయటం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

ఎనర్జీ అసిస్టెంట్‌పై చర్యలకు ఆదేశం

పీసీపల్లి,నవంబరు20(ఆంధ్రజ్యోతి):గత కొద్ది రోజులుగా విధులకు గైర్హాజరవుతున్న గుదేవారిపాలెం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ వెంకటేశ్ నాయక్‌పై శాఖపరమైన చర్యలకు ఆదేశిస్తున్నట్లు పీసీపల్లి ఎంపీడీవో ప్రభాకరశర్మ చెప్పారు. బుధవారం పెదఅలవలపాడు, గుదేవారిపాలెం సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీసీఐ సర్వే, జియో ట్యాగింగ్ సర్వేలపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా గుదేవారిపాలెం ఎనర్జీ అసిస్టెంట్ కొద్దిరోజులుగా హాజరు కావడంలేదని గుర్తించారు. విధులకు హాజరు కాని ఎనర్జీ అసిస్టెంట్‌పై చర్యలకు సిఫార్సు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది వేళకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తదుపరి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న క్యాటిల్‌షెడ్స్, ఎస్‌బీఐ సర్వేలను ఆయన పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సుందరరామయ్య

డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

తాళ్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రికార్డులను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని ఎంపీడీవో కల్లూరి సుందరరామయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామకార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2024-2025 సంవత్సరానికి నిర్ణయించిన డిమాండ్ పన్ను, పన్నుయేతర డేటాను సిద్ధంగా ఉంచాలన్నారు. ఇంటి పన్ను నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలన్నారు. సేకరించిన డేటాను వెబ్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసి భద్రపరిచే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే నన్నారు. నవంబర్ 30 నాటికి నూరుశాతం ఎంట్రీ జరిగేలా చూడాలన్నారు. అలాగే పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నీరు రాని ట్యాపుల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తాగునీరు లేక విద్యార్థుల అవస్థలు

పామూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై నెల రోజులు కావస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి అంగళ్లలో లూజు వాటర్ కొనుగోలు చేసుకొని దాహార్తిని తీర్చుకొంటున్నారు. పాఠశాలలో సుమారుగా 850 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్ వద్ద విద్యాకమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు విద్యార్థులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి ఇక్కట్లను తీర్చాలని వారు కోరారు.

మంచం పట్టిన రుద్రసముద్రం

విజృంభిస్తున్న విషజ్వరాలు

చుట్టుముట్టిన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్

అందని సర్కారు వైద్యం

సుదూరప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందుతున్న పీడితులు



డెంగ్యూ జ్వరంతో మంచం పట్టిన కటారి రాములు



టైఫాయిడ్ జ్వరంతో ఆర్ఎంపీ వద్ద చికిత్సలు పొందుతున్న బసవమ్మ, చెన్నమ్మ

దొనకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో పదిహేను రోజులుగా విషజ్వరాలు విజృభిస్తున్నాయి. ప్రజలను లేవనీయకుండా పట్టిపీడిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే డెంగ్యూ జ్వరానికి గురై ముగ్గురు, నల్గురు నర్సరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో వైద్యం పొందుతున్నారు. ఇంట్లో ఒకరితో మొదలైన జ్వరం మిగతా కుటుంబ సభ్యులకు ప్రబలుతుండటంతో ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని జ్వర పీడితులు వాపోతున్నారు. అలాగే మరికొందరు మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన పడ్డారు. గ్రామంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా జ్వరాలు సోకవడంతో సర్కారు వైద్యం అందక అందుబాటులో ఉన్న ప్రైవేట్, ఆర్ఎంపీ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు.పదిహేను రోజులుగా జ్వరాలతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వ వైద్య సిబ్బంది పట్టించుకోలేదని జ్వరపీడితులు వాపోతున్నారు. చేసేదిలేక నర్సరావు పేట, మార్కాపురం, ఎర్రగొండపాలెం తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ వైద్యశాలల్లో వైద్యసేవలు పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆరోగ్యకేంద్ర సిబ్బంది స్పందించి విషజ్వరాలు గ్రామం మొత్తం ప్రబలకముందే గ్రామంలో అవసరమైన మందులతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితులకు సరైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పొగాకు సాగును తగ్గించాలి



పీసీపల్లి మండలం తలకొండపాడులో రైతులతో కలిసి వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ

పీసీపల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన మినుము, శనగ వంటి మెట్ట పైర్లను సాగుచేయాలని కనిగిరి ఏడీఏ ఈవీ రమణ అన్నారు.మండలంలోని మారెళ్ల, తలకొండపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో మంచి ధర పలుకుతుందని రైతులు పొగాకును సాగు చేస్తున్నారన్నారు.ఈ ఏడాది ఇతర రాష్ట్రాలలో కూడా పొగాకు అధికంగా సాగైనందువలన మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండకపోవచ్చునని అన్నారు. రైతులు పొగాకు సాగు తగ్గించి శనగ, మినుము పైర్లను సాగుచేస్తే తక్కువ ఖర్చుతో అధికదిగుబడులు సాధించవచ్చునని అన్నారు. వ్యవసాయ అధికారి ప్రకాశరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరి వెన్ను దశలో ఉన్నందున ప్రొపికొనజోల్ ఒక ఎకరాకు 250ఎంఎల్ మందును నీటిలో కలిపి పైరుకు పిచికారీ చేయాలన్నారు. జింక్ లోపం ఉన్న వరిలో చిలేటెడ్ జింక్ 100గ్రాముల పొడిని నీటిలో స్ప్రే చేయాలన్నారు.

కంది పైరు కంకి దశలో ఉన్న సమయంలో చివర ఎండుతున్నట్లు కనిపిస్తే ఎకరాకు అరలీటరు వేపనూనె, అరకేజీ సాఫ్ పొడిని నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏవోవో పుల్లయ్య వీపీఏలు కల్యాణ్, సాయిప్రియ తదితరులు ఉన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు : పంటలు సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి, జేడీఏ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం మండలంలోని సింగనపాలెం, ముండ్లమూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేడీఏ శ్రీనివాసరావు వరి పైరు, మొక్క జొన్న నూర్పిడిని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేసే విధానాన్ని అలవర్చు కోవాలన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడ వద్దన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ఇన్సూరెన్స్‌కు రైతులు సీఎస్‌సీ సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు.



ముండ్లమూరులో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి, సిబ్బంది

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

కనిగిరి ఏడీఏ ఈవీ రమణ

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, ఉద్యానవన శాఖ అధికారి రవి వెంకన్న బాబు, పశు వైద్యాధికారి ఎం విజయలక్ష్మి, వీఏఏ శోభారాణి, ఎంపీఈవో దయా సాగర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సన్నకారు రైతులకు ప్రభుత్వం చేయూత

కనిగిరి : చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తున్నదని అగ్రికల్చర్, హార్టికల్చర్ ఏవోలు జ్యోష్నాదేవి, అంజలీబాయి అన్నారు. మండలంలోని వంగపాడు గ్రామంలో కంది, వరి, శనగ, మినుము, బొబ్బర పంటలను బుధవారం పరిశీలించారు. ఆయా పంటలలో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

కేజీబీవీని సందర్శించిన ఎంపీడీవో, ఎంఈవో

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



బాలికల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో, ఎంఈవో సుందరరామయ్య, సుబ్బయ్య

తాళ్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం తీసుకోకుంటే రక్తహీనత వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని,డైట్ సక్రమంగా తీసుకుని రక్తహీనత సోకకుండా చూసుకోవాలని ఎంపీడీవో కె.సుందరరామయ్య, ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు.కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలపై 'రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు' అన్న కథనం మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎంపీడీవో, ఎంఈవోలు కేజీబీవీ విద్యాలయాన్ని బుధవారం సాయంత్రం సందర్శించారు. బాలికల ఆరోగ్యంపై వాకబు చేశారు. ఉదయం వైద్య బృందం వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారని బాలికలు తెలిపారు. విద్యాలయంలోని ఆరోగ్య కార్యకర్త ఎక్కడ ఉన్నారని ప్రశ్నించగా డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లారని చెప్పారు. దీంతో బాధ్యతారాహిత్యంగా ఉన్న కార్యకర్తకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఎంపీడీవో ఆదేశించారు. విద్యాలయం వంట గది సమీపాన గల పరిసరాల నుంచి దుర్వాసన రావడాన్ని వారు గమనించారు. విద్యాలయం బయటవైపు మురుగు నీరు నిల్వ ఉంటున్నదని ఎస్‌వో చెప్పగా తక్షణమే మురుగు కాలువను శుభ్రం చేయించాలని గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.సుజిత, పంచాయతీ కార్యదర్శి ఐ.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

పామూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి అవకాశవాద రాజకీయాలను నడుపుతున్న బీజేపీని ఇంటికి సాగనంపడమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక అమ్మ ఫంక్షన్ హాల్ సీపీఎం పామూరు మండల 6వ మహాసభ షేక్ ఖాదర్‌బాష అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హనీఫ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అధిక భారాలను మోపుతున్నారని, ఉపాధి పథకంలో కూలీలకు తగిన ఆదాయం రావడం లేదని అన్నారు. రాబోవు రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఉద్యమాలు చేపట్టేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముందుగా సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ షేక్ మిరావలి జెండా ఆవిష్కరణ చేయగా ఎం. విఠలరావు ఏచూరి, మండ్ల వెంకటేశ్వర్లు చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండల శాఖ కార్యదర్శి కే మాల్యాద్రి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో జిల్లా నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా నాయకురాలు సయ్యద్ షమ్మి, యు. రాజ్యలక్ష్మి, శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.



సీపీఎం మండల మహాసభలో మాట్లాడుతున్న హనీఫ్

అమృత్ పథకాన్ని అమలు చేయాలి

దర్శి: దర్శి నగర పంచాయతీలోని ప్రజల తాగునీటి సమస్య పూర్తిగా నివారించేందుకు అమృత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి టి. రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం సీపీఎం ఏడో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు అమృత్ పథకం క్రింద ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరయ్యాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణం గురించి పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా కదలిక లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, ఎం. రమేష్, వి. ఆంజనేయులు, బాబు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సీపీఎం దర్శి మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నందు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా టి. రంగారావు, కేవీ. పిచ్చయ్య, యు. నారాయణ, ఈ. నాగేశ్వరరావు, టి. రమాదేవి, పి. పుల్లయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దొనకొండ మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలు

దొనకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం డిసెంబర్ నెలలో రైల్వే అధికారులు దొనకొండ మీదుగా శబరిమలైకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. డిసెంబరు నెల 23, 30 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు 07147 నెంబరు గల ప్రత్యేక రైలు మచిలీపట్నంలో బయలుదేరి విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట మీదుగా సాయంత్రం 5.15 గంటలకు దొనకొండకు చేరి మరుసటిరోజు రాత్రి 7.50 గంటలకు కొల్లం చేరుతుంది. డిసెంబరు 25వ తేదీ, జనవరి 1వ తేదీల్లో 07148 నెంబరు గల ప్రత్యేక రైలు అర్ధరాత్రి 2.30 గంటలకు కొల్లంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు దొనకొండకు చేరుతుంది.అయ్యప్పస్వామి దీక్షధారులు రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక రైలును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

సంక్షిప్తంగా..

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

పామూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పామూరు సీఐ ఎం. భీమా నాయక్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, తాజా పోకడలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ టి. కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కురిచేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రంథపాలకురాలు సుమతి అధ్యక్షతన జరిగింది. జడ్పీటీసీ సభ్యులు నుపం వెంకట నాగిరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పాఠశాలకు 45 కుర్చీలు బహూకరణ

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కోవిలంపాడు మాజీ సర్పంచ్ సయ్యద్ బీబీదౌలత్ 25, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి 20 కుర్చీలను బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగినేని తిరుపతయ్య వారిని అభినందించారు.

బాలోత్సవం బంగారమే

కురిచేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ప్రవేశ పెట్టిన బంగారు బాలోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన బంగారు బాల్యం కార్యక్రమాలు నిజంగా బంగారమే అని మండల విద్యాశాఖాధికారి వస్రాం నాయక్ అన్నారు. బాలోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు.

ఘనంగా అయ్యప్పల హోమగుండం

ముండ్లమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ళ గ్రామంలో అయ్యప్ప దీక్షాధారుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హోమగుండం నిర్వహించారు. ముందుగా పూజలు నిర్వహించి అనంతరం అద్దంకికి చెందిన గురుస్వామి వాసు ఆధ్వర్యంలో పడి భజన కార్యక్రమం జరిగింది. అనంతరం హోమ గుండంలో అయ్యప్ప దీక్షధారులు నడిచి తమ భక్తిని చాటుకున్నారు.

దేవస్థాన పారా జవాన్లకు దుస్తుల పంపిణీ

పామూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పామూరులోని శ్రీ మదనవేణుగోపాలస్వామి, శ్రీ వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించిన పారా జవాన్లకు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు ఒక్కొక్కరికి రెండేసి జతల యూనిఫాంను అందజేశారు.

దీక్షాధారులకు భిక్ష

పామూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో దీక్షాధారులకు స్థానిక అశ్విని వైద్యశాల డాక్టర్ గద్దె ఏడుకొండలు హైమావతి దంపతులు బుధవారం అన్నదానం నిర్వహించారు. కుమారుడు సాయి త్రినాధ్ జన్మదినం సందర్భంగా 12 సంవత్సరాలుగా ఆయన ఈ ఏర్పాటు చేస్తున్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

పీసీపల్లి,నవంబరు20(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో అత్యవసరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వైద్యాధికారిణి డాక్టర్ మంజులతో కలిసి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

చిత్రలేఖనంలో పొట్లపాడు విద్యార్థికి ప్రథమ బహుమతి

కురిచేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనంలో పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్. దివ్య ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ విద్యార్థినికి బుధవారం ఒంగోలులో కలెక్టరు తమీమ్ అన్సారియా బహుమతిని అందజేశారు.

అంబవరం విద్యార్థికి తృతీయ స్థానం

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి అభ్యసిస్తున్న గంధం ప్రవీణ్‌కుమార్ జిల్లా స్థాయిలో జరిగిన చిత్రలేఖనంలో తృతీయ బహుమతి సాధించాడు.

క్రైం సమాచారం

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కనిగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న కారు ఢీకొని వ్యక్తి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం కందుకూరు రోడ్డులోని ఆజీస్‌పురం గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొదిలికి చెందిన షేక్ సలీమ్ పీసీపల్లి మండలంలోని అలవలపాడు పరిధిలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. పొదిలి నుంచి కనిగిరి మీదుగా అలవలపాడుకు బైక్‌పై వెళ్తున్నాడు. కందుకూరు నుంచి కనిగిరి వైపు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఆయన్ను స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఎటువంటి సమాచారం లేదని ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు


దర్శి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య లాడ్జిలో పేకాట ఆడుతున్న సమాచారం తెలియటంతో దర్శి సీఐ వై. రామారావు ఆధ్వర్యంలో ఎస్సై ఎం. మురళీ, సిబ్బంది దాడిచేశారు. అక్కడ పేకాడుతూ తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారి వద్ద రూ.22,100 నగదును, పేకలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బెల్ట్ షాపులపై దాడులు

కురిచేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దర్శి ఎక్సైజ్ పోలీసులు బుధవారం కురిచేడు మండలంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేశారు. వారి వద్ద 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కురిచేడులోని దర్శి రోడ్డులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి వద్ద 12 మద్యం బాటిళ్లు, వినుకొండ రోడ్డులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి వద్ద 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇరువురిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.



అడకత్తెరలో.. వీఆర్వోలు



ఒక పక్క ఎమ్మెల్సీ ఓటర్ల పరిశీలన, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధం చేసేపని... మరోపక్క హౌస్ హోల్డ్ సర్వేకు సంబంధించి జియో కో ఆర్డినేట్స్ తీసుకోవాల్సిన పని. వీటి లో ఓట్ల పరిశీలన రెవెన్యూ అధికారులు చూస్తుం టే, హౌస్ హోల్డ్ సర్వే ఎంపీడీవో పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ రెండింటికీ వీఆర్వోలు వెళ్లాల్సిందే. అయితే ఇక్కడే అసలు చిక్కువచ్చిపడితే, వివిధ శాఖల మధ్య వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చు మెల్లగా రాజుకుంటోంది. వీఆర్వోలను విధులకు పంపే విషయంలో ఎవరి అధికారాన్ని వారు చూపిస్తుంటే, మధ్యలో వీఆర్వోలు నలిగిపోతున్నారు.

- గత వైసీపీ సర్కారు పాలనలో చేసిన మార్పులే కారణం
- సచివాలయాల ఏర్పాటు మినహా పటిష్ట నిర్వహణ లేకే
- వీఆర్వోలు పనిచేసేది రెవెన్యూలో... వేతనం ఇచ్చే అధికారం ఎంపీడీవోలకు
- తహసీల్దార్, ఎంపీడీవోల మధ్య పెరుగుతున్న దూరం
- ఎన్నికల విధులు, హౌస్ హోల్డ్ సర్వేల పనుల్లో గందరగోళం
- మా ఉత్తర్వులు ఫాలో అవ్వాలంటే మా ఉత్తర్వులంటూ ఆధిపత్య పోరు
- ఛార్జిమెమోలు, వేతనాల నిలుపుదల వరకు ముదిరిన వ్యవహారం
- కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళుతున్న వీఆర్వోలు

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు తప్పనిసరి కావటంతో ఓటర్ల దరఖాస్తుల పరిశీలనకు వెళ్లాలో, సర్వేకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపమన్నట్టు తయారయింది వీఆర్ఓల పరిస్థితి. ఓపక్క తహసీల్దార్లు వారు చెప్పిన విధులకు వెళ్లాలని ఆదేశాలిస్తుంటే, మరోపక్క ఎంపీడీఓలు మాకు తెలియకుండా మీ ఇష్టమొచ్చినట్టు వెళ్ళిపోతే ఎట్లా! జీతమిచ్చేది మేమయితే మా మాట ఎందుకు వినరంటూ మెమోలు ఇచ్చే పరిస్థితి నుంచి చివరకు జీతాలు ఆపేస్తామని బెదిరించే వరకు వెళ్లిందంటే వారిమధ్య అధికారిక పోరు ఎంతవరకు వెళ్లిందనేది అర్ధమవుతుంది. విధులు సక్రమంగా చేద్దామనుకునే వీఆర్ఓల పరిస్థితి ఇబ్బందికరంగా మారితే, తహసీల్దార్, ఎంపీడీఓల మధ్య ఏర్పడుతున్న సమన్వయ లోపాన్ని కొందరు వీఆర్ఓలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. అసలు విధులలోనే లేకుండా తహసీల్దార్ అడిగితే, ఎంపీడీఓ రమ్మన్నారని, ఎంపీడీఓ ఫోన్ చేస్తే, తహసీల్దార్ మరో పనికి పంపారంటూ ఇద్దరి దగ్గర ఒకరిపైఒకరికి చెప్పి తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి కూడా ఉంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొన్ని మండలాల్లో రెండు శాఖల మధ్య చిచ్చు రాజుకుంటూనే ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారం కలెక్టర్‌ల దృష్టికి తీసుకువెళ్లాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే ఆందోళనకు దిగాలనే ఆలోచనకు వీఆర్ఓలు వచ్చినట్టు చెబుతున్నారు. దీనంతటికీ వైసీపీ సర్కారు కాలంలో వీఆర్ఓల విధులు రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్నా, సచివాలయాల ఏర్పాటు తర్వాత వారితోపాటే వీరి వేతనాలు కూడా ఎంపీడీఓలు ఇచ్చేలా మార్పులు చేయటమే. అయితే రెండూ ప్రభుత్వ శాఖలే కావటంతో వారి మధ్య అధికారిక పోరు లేకుండా సమన్వయంతో పనిచేస్తే అంత సమస్య అయ్యేదికాదు. మొత్తం మీద గత వైసీపీ సర్కారు చేసిన అనాలోచిత మార్పులు ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లో చిచ్చు రేపటానికి కారణమవుతోంది.

అంతా ఓటర్ల జాబితా బిజీలో

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధంచేసే పని ఒకపక్కన ఉంటే, ఈ నెల 6 నుంచి బుధవారం వరకు ఓటరు దరఖాస్తుల పరిశీలన పనిలో వీఆర్ఓలు ఉన్నారు. ఈ నెల 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. అప్పటి నుంచి డిసెంబర్ 7 వరకు మళ్లీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, ఇతర లోపాల పరిశీలన పని ఉంటుంది. వీటిని తప్పనిసరిగా బీఎల్ఓలే చెయ్యాల్సి ఉంది. త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సిద్ధంచేసే పనికూడా జరుగుతోంది. దీనికి ఓటర్ల దరఖాస్తులు ఉండవు. అయితే నీటిపారుదల శాఖ ఇచ్చిన ఆయకట్టుదారుల వివరాల ఆధారంగా రెవెన్యూ శాఖే ఓటర్ల జాబితా సిద్ధం చేయాల్సి

(మిగతా 6వ పేజీలో..)

రూ.కోట్లలో.. కిక్



- అందుబాటులో కోరుకున్న మద్యం
- నెల వ్యవధిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.260 కోట్లకు తాగేశారు
- బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం విక్రయం
- జగన్ హయాంలో కన్నా ఒక్క నెలలో రూ.20 కోట్ల అదనపు సేల్

గుంటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న బ్రాండ్లు.. కావాల్సిన మద్యం.. గతంలోలా చెల్లింపులకు పరిమితులు లేకపోవడం.. కొన్ని బార్లలోనూ ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు.. నేపథ్యంలో అటు మందుబాబులు, ఇటు ఎక్సైజ్ శాఖ ఖుషీ చేసుకుంటోంది. మందుబాబులు తెగ తాగేస్తోండగా.. ఎక్సైజ్ శాఖకు రూ.కోట్లు కిక్కు వస్తోంది. బ్రాందీ షాపుల విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. జగన్ హయాంలో గత ఐదేళ్ళుగా జేబులో దండిగా డబ్బులున్నా కూడా కోరుకున్న మద్యాన్ని కొనుక్కొని తాగలేని పరిస్థితి ఉండేది. పేరొందిన డిస్టలరీల కంపెనీలు ఉత్పత్తి చేసే మద్యంకు బదులు జే బ్రాండ్ పేరుతో నాశిరకం మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో అమ్మించారు. గత్యంతరం లేక పలువురు నాశిరకం మద్యాన్ని కొనుగోలు చేసి తాగి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోరుకున్న మద్యం అందుబాటులోకి తెస్తామని, చౌక మద్యాన్ని నాణ్యంగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే

(మిగతా 6వ పేజీలో..)

జేకేసీ విద్యార్థి కావడం గర్వకారణం

- ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
- ఆడిటోరియం ప్రారంభోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు



సభలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, వేదికపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మన్నవ మోహనకృష్ణ, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చుక్కపల్లి రమేష్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల ఎంతో మంది ఉన్నతికి కారణమైంది. ఇలాంటి కళాశాల విద్యార్థినని చెప్పుకోవడం గర్వకారణం. కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్యం చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించారు. ఫలితంగా ఇక్కడ చదివిన ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు.. అని రాష్ట్ర డీజీపీ, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పునర్ నిర్మించారు. రూ.2.50 కోట్లు వ్యయంతో నిర్మించిన ఈ ఆడిటోరియాన్ని బుధవారం డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రసంగిస్తూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎంతోమందికి చదువుతో పాటు సంస్కారం నేర్పించిన ఘనత జేకేసీదన్నారు. ఆకృతిలేని రాళ్ళలాంటి తమలాంటి ఎంతోమందిని శిల్పాలుగా తీర్చిదిద్దిన ఘనత జేకేసీ అధ్యాపకులదన్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం జేకేసీ కళాశాలలో చదువుకున్నానని, అప్పట్లో ఇక్కడ నేర్పిన చదువు, క్రమశిక్షణ కారణంగానే నేషనల్ పోలీసు అకాడమీలో చేరినట్లు చెప్పారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తమకు క్రమశిక్షణ, అంకితభావం కళాశాలలో చదుకునే సమయంలో అలవడ్డాయన్నారు. ఫలితంగానే సేవా, రాజకీయరంగాల్లో రాణిస్తున్నట్లు వారు చెప్పారు. జేకేసీ పూర్వ విద్యార్థులు కావడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపిచంద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యర్లగడ్డ ఉమాదేవి, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మాదల శ్రీనివాసు, చుక్కపల్లి రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ, కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రకృతిని ప్రేమిద్దాం.. కాపాడుదాం

- భావితరాలకు మంచి పర్యావరణాన్ని ఇవ్వాలి
- కార్తీక వనసమారాధనలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలని, దానిని కాపాడాలని కలెక్టర్ వెంకటమురళి పిలుపిచ్చారు. అటవీశాఖా ఆధ్వర్యంలో సూర్యలంక సముద్రతీరంలో బుధవారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు నాటి నీరు పోశారు. అధికారులతో కూడా మొక్కలు నాటించారు. తదుపరి అధికారులతో కలిసి కార్తీక వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే తరాలకు మంచి పర్యావరణం అందించడానికి ఇప్పుడు నాటే మొక్కలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ప్రకృతిని ప్రేమించి చెట్లను, జంతువులను, పక్షులను సంరక్షించాలన్నారు. పరిశ్రమల స్థాపనతో గడిచిన 155 ఏళ్ళల్లో ప్రపంచవ్యాప్తంగా 2 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగిందన్నారు. ఉష్ణోగ్రతలలో మార్పులను నియంత్రించాలంటే విరివిగా మొక్కలను నాటాలన్నారు. అటవీశాఖ ద్వారా జిల్లాలో 63 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, అటవీశాఖాధికారి భీమయ్య, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీపీవో ప్రభాకర్, తహసీల్దార్ షేక్.సలీమా, వ్యవసాయాధికారి ఎ.రామకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉందన్నారు. ఈ నెల 27 వరకు మత్స్యకారులను వేటకు వెళ్ళనివ్వరాదని చెప్పారు. ఇప్పటికే చేపల వేటకు వెళ్ళిన మత్స్యకారులను వెంటనే బయటకు పిలిపించాలని ఆదేశించారు. ధాన్యాన్ని 22 నుంచి 27వ తేదీ వరకు కోయరాదన్నారు. భారీవర్షాలతో లోతట్టుప్రాంతాలు మునిగితే తక్షణమే ఆ ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు మండల కేంద్రాల్లోనే విధిగా నివాసం ఉండాలన్నారు. ఎంపీడీవోలు మండలాలు విడిచి వెళ్ళరాదన్నారు. సహాయక చర్యల కొరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు, పెంపుడు జంతువులను సురక్షిత ప్రాంతాలలో ఉంచుకోవాలన్నారు.



సిబ్బందితో కలిసి వనభోజనాలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి



సూర్యలంక తీరంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

డీఎంను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు

నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం చంద్రశేఖర్‌ను సరెండర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను వీసీఎండీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ సరెండర్ ఉత్తర్వులు వెలువడి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ బుధవారం వెలుగులోకి వచ్చాయి. ప్రైవేటు గోడౌన్ల లీజు కొనసాగింపు విషయంలో అవకతవకలు జరిగాయని, వాటికి పరోక్షంగా డీఎం సహకరించారని ఆరోపిస్తూ కర్లపాలెం మండలానికి చెందిన కొంతమంది నేరుగా సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జిల్లా అధికారులు విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే ఆయనపై సరెండర్ వేటు వేసినట్లు తెలుస్తోంది. జిల్లా పౌరసరఫరాల విభాగం అధికారి విలియమ్స్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ధాన్యం సేకరణకు సంబంధించిన ప్రక్రియ ముమ్మరంగా సాగుతుండడంతో మిల్లుల నుంచి బ్యాంకు గ్యారెంటీలు తీసుకునే విషయంపై దృష్టి సారించినట్లు సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి అధికారి విలియమ్స్ తెలిపారు.

సముద్రంలో ఉండే విశిష్ట మత్స్య సంపద కాలుష్యం దెబ్బకు అంతరించి పోయే ముప్పును ఎదర్కొంటోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడానికి తోడు పారిశ్రామిక వ్యర్థా లకు కూడా సముద్రమే అంతిమ మజిలీ కావడంతో ఎన్నోరకాల మత్స్యజాతులు అరుదైన జాతి కోవలోకి చేరిపోయాయి. ఈ క్రమంలో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలను పట్టించుకునే వారే కరువయ్యారు. గడచిన ఐదేళ్లలో ఈ విచ్చలవిడి తనం పతాకస్థాయికి చేరుకోవడంతో మొత్తం మత్స్య రంగమే ప్రమాదంలో పడే విలపించే స్థితికి చేరుకుంది. ఇక, మత్స్యకారుల గురించి చెప్పాలంటే సముద్రంలో చేపల వేటే వారి వృత్తి. నెలలో ఇరవై రోజులు గంగమ్మతోటే వారి ప్రయాణం. ఆటుపోట్లు, గంగమ్మ ఉరకలు, తుఫాన్ హెచ్చరికలు ఇవేవీ కడలితో వారికి ఉన్న బంధాన్ని తెంచలేవు. రెక్కలు ముక్కలయ్యేలా కష్టపడుతున్నా వారి జీవనప్రమాణాలు మాత్రం మెరుగుపడడం లేదు. గురువారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులతో పాటు ఆ రంగం ఎదుర్కొంటున్న అనేక ఆటుపోట్లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం....

మత్స్య విలాపం!

- కాలుష్య కోరలతో అంతరించిపోతున్న విశిష్ట మత్స్యజాతులు
- ఎగుమతుల్లోనూ వెనకడుగే
- వైసీపీ పాలనలో మత్స్యకారులపై నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో గంగపుత్రుల సంక్షేమం
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి) జిల్లాలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న వారు దాదాపు 50,000 మంది వరకు ఉంటారు. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఈ సంఖ్య 20,000 ఉండటం గమనార్హం. ముఖ్యంగా చీరాల, చినగంజాం, రేపల్లె, బాపట్ల తీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎక్కువగా ఉంటారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క కార్యక్రమం కూడా మత్స్యకారుల కోసం చేపట్టక పోవడం గమనార్హం. ప్రతి ఏటా చేపల వేట నిలుపుదల చేసే రెండు నెలల కాలానికి మాత్రం అరకొరగా మత్స్యకార భరోసా పథకం కింద జమ చేసి 'మమ' అనిపించింది. జిల్లా వ్యాప్తంగా 'భరోసా'కు అర్హులైన వారే దాదాపు 25,000 మంది వరకు ఉండగా, 12,000 మంది ఖాతాల్లో మాత్రమే జమ చేసి గంగపుత్రులకు అన్యాయం చేసిన ఘనత వైసీపీది.

పురోగమింప చేయడానికి తీసుకోవాల్సినవి

చేపల పెంపకానికి అనువైన చెరువులను గుర్తించే ప్రక్రియ 2014-19 మధ్య ముమ్మరంగా జరిగింది. కానీ తర్వాత గద్దెనెక్కిన వారు పట్టించుకోవడమే మానేశారు. ప్రస్తుతం వాటిని గుర్తించ డంతో పాటు నీటి వనరులను కూడా కల్పించడం కూటమి ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం. మత్స్యకార సొసైటీలను అన్ని విధాలుగా గత ప్రభు త్వం కుదేలు చేసింది. ఇప్పటికే సొసైటీలకు ఎన్నికలు జరిపే ప్రక్రియను కూటమి ప్రభు త్వం చేపట్టింది. సహకార సంఘాలకు పూర్వ వైభవం దక్కే విధంగా ప్రభుత్వం వైపు నుంచి చేయూత అందించి నిలదొక్కుకునే అవకాశం కల్పించడం ప్రాధాన్యంగా చేయాల్సి ఉంది.

ఎగుమతులపై దృష్టి పెట్టాలి

గడచిన ఐదేళ్లలో ఎగుమతులలో జిల్లా వాటా పడిపోతూ వస్తోంది. 86 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం ఉన్న జిల్లాలో దాదాపు 3,000 వరకు వేట పడవలు ఉన్నాయి. ఏటా 850 టన్నుల వరకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేసేవారు. కానీ గడచిన ఐదేళ్లలో అవలంభించిన అస్తవ్యస్త విధానాలతో ఇది కాస్తా 600 టన్నులకు పరిమితమైనట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- నేడు విడుదల చేయాల్సిన నోటిఫికేషన్ నిలిపివేత
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- సిద్ధమైన ఓటర్ల జాబితాలు.. ఏడు లక్షల మందికి ఓటు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఎన్నికలకు అధికారులు సిద్ధమవగా.. తమకు గ్రామాల్లో పట్టు ఉందని నిరూపించుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతుండగా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికలకు సంబంధించి గురువారం విడు దల చేయాల్సిన నోఫికేషన్ ను ప్రభుత్వం నిలిపివేసిం ది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపి వేయాలని అధికారులను ప్రభు త్వం ఆదేశించింది. నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ) పరిధిలోని టీసీల వారీగా రైతుల జాబితాలను సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 2,500 మంది నుంచి 3,000 వరకు రైతులను ఓటర్లుగా నమోదు చేశారు. సుమారు ఏడు లక్షల మందిని ఓటర్లుగా అధికారులు గుర్తించారు. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహిం చేందుకు 2,628 టీసీల వారీగా ఓటర్ల జాబితాలను అధికారులు విడుదల చేశారు. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాలతో నోటిఫికేషన్ నిలిచిపోయింది. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.



విజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న పర్చూరు క్రికెట్ ప్రతినిధులు

క్రికెట్ క్రీడా ప్రాంగణం పరిశీలన

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రప్రదేశ్) : పర్చూరులోని రుగ్వేద్ క్రికెట్ ఏరీనా క్రీడా ప్రాంగణాన్ని ఆంధ్రా క్రికెట్ గ్రౌండ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి అధ్యక్షుడు, సౌత్‌జోన్ కన్వీనర్ బీ విజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పర్చూరు నియోజకవర్గంలోని క్రికెట్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొవరతో ఏసీఏ బృందం ఈ క్రికెట్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ప్రాంగణం పరిస్థితులు, వసతులు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రికెట్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి జిల్లా, రాష్ట్ర, రంజీ స్థాయి ఆటల పోటీలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పర్చూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏసీఏ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ గౌతమ్, ఇంటూరి వంశీ, తులసి శ్రీనివాసరావు, చెరుకూరి శ్రీధర్ (చింపయ్య) తంగెళ్ల మల్లికార్జునరావు, మధుబాబు, మాధవరావు, సత్యనారాయణ, రమేష్, పఠాన్‌సమీర్, రాజేష్, బాజీ, గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అమెజాన్ కంపెనీ ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన సెయింట్ ఆన్స్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమెజాన్ కంపెనీ ఇంటర్న్‌షిప్ కోసం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలలో అర్హత సాధించి తమ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన బీటెక్ డేటా సైన్స్ విభాగంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గోపు సింధూజను కళాశాల యాజమాన్య ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింధూజకు ఇంటర్న్‌షిప్ 6నెలలు కాలపరిమితి ఉంటుందని, నెలకు రూ.1.10 లక్షలు వేతనం ఇతర సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. అనంతరం 2025లో బెంగళూరులోని అమెజాన్ కంపెనీ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ సి.సుబ్బారావు (డైరెక్టర్, అక్రిడేషన్స్), వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్‌గా రామకృష్ణ

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్‌గా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గోరంట్ల రామకృష్ణను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియమించారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీచేశారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేసేందుకు పార్టీ నాయకులను సమన్వయం చేసేలా పని చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు విధిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఏలూరి పిలుపునిచ్చారు. నాయకులు ఆయా మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు.

అడకత్తెరలో.. వీఆర్వోలు

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇదికూడా జరుగుతోంది. ఆ జాబితా పరిశీలన కూడా ఏకకాలంలోనే జరుగుతోంది. ఇది కాక ప్రతి సంవత్సరం కొత్త ఓట్ల చేరికలకు సంబంధించి 2025 జనవరి 5 నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పూర్తిచేసేలా స్పెషల్ సమ్మరీ రివిజన్ కూడా జరుగుతోంది. వీటన్నిటికీ వీఆర్‌ఓలు బీఎల్‌ఓ హోదాలో హాజరు కావలసిందే. ఎన్నికల విధుల్లో బీఎల్‌ఓలుగా ఆయా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో వీఆర్‌ఓలనే నియమిస్తారు. వారు చాలకుంటే ఇతర శాఖల సిబ్బందిని కూడా బీఎల్‌ఓలుగా తీసుకునే అధికారం ఉండటంతో ఇతర సిబ్బందినికూడా దీనికి ఉపయోగిస్తున్నారు. ఇదిట్లా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం హౌస్‌హోల్డ్ సర్వే చేపట్టింది. దీనికి ఇప్పటికే సచివాలయ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సర్వే వేగవంతం కావటంలేదనే వత్తిడి కూడా ప్రభుత్వం నుంచి వస్తుండటంతో చాలా మండలాల్లో ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందినే కాకుండా వీఆర్‌ఓలను కూడా సర్వే విధులకు పంపుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ సమన్వయంతో ఉన్న మండలాల్లో వీరి సమస్య పెద్దగా లేకున్నా, కొన్ని మండలాల్లో మాత్రం అగ్గి రాజుకుంటోంది.

వైసీపీ సర్కారు పెట్టిన చిచ్చుతో...

గతంలో రెవెన్యూ శాఖ కింద పనిచేసే సిబ్బంది మొత్తానికి వేతనాలు సిద్ధంచేసి పంపే అధికారం ఆయా మండలాల తహసీల్దార్‌లకే ఉండేది. వైసీపీ సర్కారు వచ్చాక దీనిలో తీవ్ర గందరగోళ పరిస్థితిని తీసుకొచ్చింది. వీఆర్‌ఓల వేతనాలు వేసే అధికారం ఎంపీడీఓలకు అప్పగించారు. అయితే ఇక్కడా మరో మెలిక ఉంది. వీఆర్‌ఓలలో గ్రేడ్-1, గ్రేడ్-2 అనే రెండు కేటగిరీలు చేశారు. పాత కాలం నుంచి ఉన్న వీఆర్‌ఓలను గ్రేడ్-1 కింద ఉంచి, వారికి జీతం తహసీల్దార్ పరిధిలోనే ఇచ్చేలా పాత పద్దతినే ఉంచేస్తే, వీఆర్‌ఏలు, ఇతర శాఖల నుంచి ప్రమోషన్‌పై వచ్చిన వీఆర్‌ఓలను గ్రేడ్-2 కింద కేటాయించారు. వీరికి మాత్రం తహసీల్దార్ కాకుండా ఎంపీడీఓలు వేతనాలు వెయ్యాల్సి ఉంటుంది. అటు సచివాలయంలోనూ విలేజ్ రెవెన్యూ సెక్రటరీలు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికీ ఎంపీడీఓలే వేతన బిల్లులు పంపాల్సి ఉంటుంది. గ్రేడ్-2 కింద ఉన్నవారు కూడా రెవెన్యూ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. అయితే తాజాగా పెరిగిన పని వత్తిడి కారణంగా ఎవరికివారు మా సిబ్బందంటే మా సిబ్బందంటూ వారికి విధులు అప్పగించేస్తున్నారు. అయితే రెండు చోట్ల విధులకు హాజరు కాలేక సతమతమవటం వీఆర్‌ఓల వంతవుతోంది. ఈ తరహా అనాలోచిత మార్పులు చేసిన వైసీపీ సర్కారు నిర్ణయాల కారణంగా ఇప్పుడు శాఖల మధ్యే సమన్వయం లోపించటానికి, వారి మధ్య వివాదాలకు కారణమవుతోంది. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని, పెదనందిపాడు, అటు బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మరికొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈ వ్యవహారం తారాస్థాయికి చేరితే, మరికొన్నిచోట్ల సర్దుకుపోతూ, పని వత్తిడి వచ్చినప్పుడు బయటపడుతూ వస్తున్నారు. తెనాలి, మరికొన్నిచోట్ల వీఆర్‌ఓలపై తహసీల్దార్‌లు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలనా విధులకు రావాలని తెగేసి చెబుతుంటే, ఎంపీడీఓలు తాము చెప్పిన విధులకు రాకుంటే మెమోలే జారీ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని వీఆర్‌ఓలు ఆరోపిస్తున్నారు. తెనాలిలో ఇప్పటికే ముగ్గురికి మెమోలు ఇస్తే, ఒకరి వేతనం ఆపుతామని బెదిరించారని, నెలనెలా వచ్చే జీతంతో బతికేవారిపై ఇటువంటి బెదిరింపులకు దిగితే ఎట్లాగంటూ వారు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వీఆర్‌వోల సంఘంలో ఈ వివాదాన్ని పెట్టి తేల్చుకుంటామంటూ వారు తగ్గకుండా హెచ్చరికలు చేయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాల వీఆర్‌వోలు ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళితే, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కలెక్టర్‌కు విన్నవించుకుని, ఫలితం కనిపించకపోతే, ప్రత్యక్ష ఆందోళనకు దిగాలనే ఆలోచనలోనూ ఉన్నట్లు సమాచారం. కొందరు తహసీల్దార్‌లు ఏకంగా సీఎం దగ్గరకు ఈ గందరగోళాన్ని తీసుకెళ్లి సరిదిద్దాలని కోరే ఆలోచనలో ఉంటే, మరోపక్క ఎంపీడీవోలు కూడా లోకేష్ దగ్గరకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన మార్పులవల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

అద్దంకిలో తగ్గిన నైట్, డే బీట్‌లు

- బ్యాంక్‌లు, గోల్డ్ షాపుల వద్ద కాపు కాసి ఉంటున్న దొంగలు
- పగలు రెక్కీ.. రాత్రి చోరీలు
- తరచూ దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



చిందరవందరగా పడిఉన్న వస్తువులు, వాసవీనగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో తెరిచి ఉంచిన బీరువా (ఫైల్)

అద్దంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో చోరీలు బాగా పెరిగాయి. గతంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగగా, తాజాగా జరిగిన చోరీలలో అత్యధిక భాగం ఇళ్లలో మనుషులు ఉండగానే చోరీలు జరుగుతుండడంతో ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. ఇటీవల జరిగిన పలు చోరీలను పరిశీలిస్తే పగలు సమయంలో పక్కాగా రెక్కీ నిర్వహించి రాత్రికి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లం అవుతుంది. ప్రధానంగా బ్యాంక్‌లు, గోల్డ్ షాపులు ఉన్న ప్రాంతాలలో దొంగలు కాపు కాచి ఉంటున్నట్లు కన్పిస్తుంది. ఈ క్రమంలోనే పలు చోరీలలో పెద్ద మొత్తం నగదు, బంగారం కూడా అపహరణకు గురవుతున్నాయి. ఇటీవల అద్దంకి పట్టణంలో జరిగిన రెండు చోరీలను పరిశీలిస్తే కాకానిపాలెంకు చెందిన ఉపాధ్యాయిని చోరీ జరిగిన రోజు సాయంత్రం రామాటాకీస్ బజారులోని ఓ గోల్డ్ షాపు నుంచి గిఫ్ట్ ఇచ్చేందుకు చిన్న ఆభరణం కొనుగోలు చేశారు. అయితే ఆ బంగారంతో పాటు ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు బ్యాగ్‌ను గోల్డ్ షాపులో తీసుకున్నారు. ఇక వాసవీనగర్‌లో విశ్వభారతి స్కూల్ సమీపంలో జరిగిన చోరీ విషయాన్ని పరిశీలిస్తే ఎన్‌ఎస్పీలో పనిచేసే మహిళ అదే రోజు బ్యాంక్‌కు వెళ్లి వచ్చారు. అయితే బ్యాంక్ నుంచి ఎలాంటి నగదు తీసుకు రాలేదు. నెల రోజుల కిందట ఓ మహిళ గోల్డ్ షాపు నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లగా హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారం గొలుసు ఇద్దరు మహిళలు కొట్టేశారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే ప్రధానంగా బ్యాంక్‌లు, గోల్డ్ షాపులు ఉన్న ప్రాంతాలలో దొంగలు కాపు కాసి ఉండి, వారి వెంట నడిచి ఇళ్ల సమీపంలో రెక్కీ నిర్వహిస్తున్నారనే అనుమనాలు వస్తున్నాయి. గతంలో పగలు సమయంలో రెండు, మూడు బ్యాచ్‌లుగా బ్లూకోట్స్ సిబ్బంది పగలు సమయంలో నగదు, బంగారం లావాదేవి లు జరిగే ప్రాంతాలలో తిరి గే వారు. ఇక రాత్రి సమయంలో ఏదో ఒక పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది రెండు వాహనాలలో గస్తీ తిరిగే వారు. అయితే కొంత కాలం గా గస్తీ మొక్కుబడిగా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక పలు సందర్భాలలో అద్దంకి పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. దీంతో నిఘా పూర్తిగా అటకెక్కడంతో దొంగలు మరింత రెచ్చిపోయి చోరీలకు పాల్పడుతున్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇళ్లలో మనుషులు నిద్రిస్తుండగానే చోరీలు జరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తుంది. దొంగలు ఇళ్లలోకి ప్రవేశించిన సమయంలో ఆయా కుటుంబసభ్యులకు మెళుకువ వస్తే ప్రాణాలకే ముప్పు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదన్న అనుమనాలు వ్యక్తం అవుతున్నాయి.

పగలు, రాత్రి సమయాలలో మరింత గస్తీ పెంచి చోరీలను అరికట్టే విధంగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని అద్దంకి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ప్రగతికి అధికారులు శ్రమించాలి

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండర్ కార్యాలయాన్ని ప్రారంభించిన రైల్వే జీఎం జైన్



క్రాసింగ్ లైన్‌లు పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సందర్శించారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ ఆనందకుమార్ పటేల్‌తో కలిసి నూతనంగా నిర్మించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోస్ట్ కమాండర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ శివారులోని రైల్వే క్రాసింగ్ పాయింట్‌ను నిశితంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. వార్షిక తనిఖీలలో భాగంగా వచ్చినట్లు తెలిపారు. గూడూరు - విజయవాడ సెక్షన్‌లో రక్షణ ఏర్పాట్లతో పాటు అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు చెప్పారు. అహర్నిశలు శ్రమించి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జీఎం వెంట స్టేషన్ సూపరింటెండెంట్ సింగయ్య, సిబ్బంది ఉన్నారు.

మనో వికాస కేంద్రంలో వైద్య పరీక్షలు

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకటమురళి, జిల్లా కోర్టు భవన సముదాయాల న్యాయాధికారి ఆదేశాల మేరకు చీరాల పరిధిలోని చైతన్య మనో వికాస కేంద్రంలో డీసీహెచ్‌ఎస్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో వైద్యులు మానసిక దివ్యాంగులకు వినికిడి, కంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డా.నివేదిత, డా.లాస్య యాదవ్, డా.రవికుమార్, సోషల్ వర్కర్ సుబ్బలక్ష్మీ, నిర్వాహకులు వెంకన్నబాబు, మాధురి పాల్గొన్నారు.

అధిక దిగుబడిపై రైతులకు అవగాహన

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో రైతులు అధిక దిగుబడిని ఎలా సాధించాలో ఏవో మేరమ్మ రైతులకు వివరించారు. గన్నవరం, పూనూరు గ్రామాలలో బుధవారం పత్తిని ఆమె పరిశీలించారు. సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.

తాడేపల్లికి తరలిన జనసేన పార్టీ కార్యకర్తలు



అంబేడ్కర్ విగ్రహనికి నివాళులర్పిస్తున్న విజయ్ కుమార్

పర్చూరు, నవంబరు 20 (ఆంధ్రప్రదేశ్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా తాడేపల్లిలో బాధ్యతలు స్వీకరించను న్న పెద్దపూడి విజయ్ కుమర్ తన సైనికులతో కలసి బుధవారం తరలివెళ్లారు. ఇంకొల్లు నుంచి పర్చూరు చేరుకున్న విజయ్‌కుమార్‌కు జనసేన కార్యకర్తలతోపాటు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. బొమ్మల సెంటర్‌లో డాక్టర్ అంబేడ్కర్, వంగవీటి మోహన్‌రంగా, ఎన్టీఆర్ విగ్రహాలకు విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శృంకర శెట్టి చిరంజీవి, విన్నకోట అజయ్, శీరం కుమార్, కందా సురేంద్రబాబు, కారంపూడి సందీప్ తేజ, టీడీపీ నాయకులు విన్నకోట సతీష్, రాజా, వెంకటేష్, రాజేష్, వడ్డెముక్కల అబ్రహం, మార్కు, కిషోర్, దళిత నాయకులు గేరా స్వరాజ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 10 వినతులు

అద్దంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎంకు 10 వినతులు వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు 10 వినతులు వచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా వినుకొండలో సాయంత్రం 4-45 బయలుదేరే బస్సు సమయాన్ని 5 గంటలకు బయలుదేరే విధంగా మార్పు చేయాలని, బొద్దికూరపాడు నుంచి విజయవాడకు నడుపుతన్న బస్సును ఆదివారం, ఇతర సెలవుదినాలలో కూడా నడపాలని, అద్దంకి నుంచి బొద్దికూరపాడుకు సాయంత్రం సమయంలో రద్దు చేసిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, బల్లికురవ మీదుగా గుంటూరుకు బస్ సర్వీస్ నడపాలని ప్రయాణికుల నుంచి వినతులు వచ్చినట్లు, వెంటనే అమలు పరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతంతోనే అభివృద్ధి



తిమ్మనపాలెంలో సహకార జెండాను ఆవిష్కరిస్తున్న డీసీఏవో తిరుపాల్‌రెడ్డి

మేదరమెట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులు, గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఏవో) కే.తిరుపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తిమ్మనపాలెం ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో 71వ సహకార వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సహకార శాఖ జెండాను ఆయన ఆవిష్కరించారు. సహకార సంఘాల్లో రికార్డుల నిర్వహణ పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సంఘాలు అభివృద్ధి చెందితేనే ఉద్యోగులకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోపరేటివ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుజాత, కోటేశ్వరమ్మ, రావినూతల బ్రాంచి మేనేజర్ ఏ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేంద్రబాబు, సొసైటీ సీఈవో కోటేశ్వరరావు, మండలంలోని సొసైటీల సీఈవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు

మార్టూరు, నవంబరు 20 : పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు సాగుచేసుకోవాలని, వాటి ద్వారా లాభాలు సాధించవచ్చునని మార్టూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు సాగుపై అవగాహన కలిగించేందుకు బుధవారం మండలంలోని బొబ్బేపల్లిగ్రామంలో రైతులతో మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు అధికంగా సాగు చేయడం ద్వారా డిమాండ్ తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న సాగుచేసుకోవడం మంచిదన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో శనగ పంటకు గ్రామం యూనిట్ కాగా, వరి, మొక్కజొన్న, జొన్న, మినుము, పెసరకు మండలం యూనిట్‌గా నిర్ణయించారన్నారు. పంట బీమా ప్రీమియాన్ని డిసెంబరు 31నాటికి చెల్లించాలన్నారు. మిగిలిన పంటలకు వచ్చేనెల 15వతేదీ లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి హనుమంతనాయక్, ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.కోట్లలో.. కిక్

(5వ పేజీ తరువాయి)

అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అప్పటి వరకు కొనసాగుతున్న మద్యం పాలసీని మార్చేశారు. ప్రభుత్వ దుకాణాల స్థానే ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉండే కేవలం నగదు లావాదేవీలు తొలగించి డిజిటల్ పేమెంట్స్‌ను కూడా అమల్లోకి తెచ్చారు. గత నెల దసరా పండుగ రోజు నుంచి కొత్త మద్యం షాపులు వెలిశాయి. అప్పటి వరకు కేవలం జేబులో నగదు ఉంటే మాత్రమే మద్యం కొనుక్కునే అవకాశం ఉండేది. డిజిటల్ లావాదేవీలు అమల్లోకి రావడంతో క్రెడిట్‌కార్డులు ఉన్నవారు సైతం ఎంచక్కా వైన్ షాపులకు వెళ్ళి మద్యం కొనుగోలు చేస్తున్నారు. దసరా పండుగ ముందు వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరికే మద్యం బ్రాండ్ల పేర్లు కూడా వింతగా ఉండేవి. బూమ్..బూమ్, బ్రిటీష్ ఎంపైర్ వంటి బీర్లు, ఆంధ్రగోల్డ్ విస్కీ, హైదరాబాద్ బ్లూ విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీలు వంటివి మాత్రమే అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన కొత్త మద్యం షాపుల్లో ఏ బ్రాండ్ మద్యమైనా అందుబాటులోకి వచ్చింది. కింగ్ ఫిషర్, బడ్వైజర్, నాకౌట్ వంటి ప్రముఖ బ్రాండెడ్ బీర్లు దొరుకుతున్నాయి. దీంతో ఈ నెల రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గత నెల 16 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అంటే 30 రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూ.259 కోట్ల 19లక్షల అమ్మకాలు జరిగాయి. ఇందులో రూ.208 కోట్ల విలువ చేసే మద్యం కేవలం కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపుల ద్వారానే జరిగింది. మిగతా అమ్మకాలు బార్లు, క్లబ్‌లలో జరిగాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129, బాపట్ల జిల్లాలో 117 కొత్తగా వెలిశాయి. అయితే బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కంటే గుంటూరు జిల్లాలోనే మద్యం దుకాణాల ద్వారా ఎక్కువ అమ్మకాలు జరిగాయి. పల్నాడు జిల్లాలో రూ.93 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.86 కోట్ల మద్యం అమ్మకం జరిగింది. ఇక గుంటూరు జిల్లాలో రూ.115 కోట్లకుపైగా విలువ చేసే మద్యం విక్రయించారు. ఇందులో ఒక గుంటూరు నగరంలోనే రూ.50 కోట్ల మద్యాన్ని కేవలం దుకాణాల ద్వారానే కొనుగోలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాల్లోనే రూ.34 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.16 కోట్ల అమ్మకాలు జరిగాయి. చిలకలూరిపేట ప్రాంతంలో అత్యధికంగా రూ.13 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. అక్టోబరు 16కు ముందు జగన్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేవి. అప్పటి అమ్మకాలతో బేరీజు వేసుకుంటే ప్రస్తుతం ఇంచుమించు నెలకు రూ.20 కోట్ల అమ్మకాలు పెరిగాయి.

సరఫరాకు మించి రూ.99 మద్యానికి డిమాండ్

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా డిస్టలరీ కంపెనీలకు ఇచ్చిన ఆదేశాల మేరకు నాణ్యతతో కూడుకున్న చౌక మద్యం రూ.99కే అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో తొలుత ఈ మద్యం అందుబాటులో లేదు. అయితే కొద్ది రోజులు ఆలస్యంగానైనా సరే మార్కెట్లోకి రూ.99 మద్యం వచ్చింది. ఈ నేపథ్యంలో వీఎస్‌వోపీ వారి బ్రాందీ(ట్రోపికాన)కు డిమాండ్ విపరీతంగా ఉంది. ఇది డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రస్తుతానికి సరఫరా లేదు. దీంతో డిపోల నుంచి షాపుల నిర్వాహకులు కోరినంత ఇవ్వలేకపోతున్నారు. త్వరలో ఈ బ్రాండ్లను కూడా భారీగా డంప్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

బాలికలకు హక్కులపై అవగాహన

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణిశ్రీ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు, ఉపాధ్యాయులతో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ నుంచి ఆర్ అండ్ బీరహదారి వరకు ర్యాలీని నిర్వహించారు. విద్యార్థినులకు బాలికల హక్కుల గురించి, ఆడ పిల్లలకు చదువు యొక్క ప్రాముఖ్యతను గురించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, ఉపాధ్యాయిని కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దౌర్జన్యంపై మహిళ ఫిర్యాదు

బల్లికురవ. నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో సిమెంట్ దుకాణ యజమాని అచ్చి రాధపై గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యం చేశారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

కొప్పెరపాడు గ్రామానికి చెందిన సిమెంట్ దుకాణ యజమాని రాధ బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మంగళవారం రాత్రి రాధ తమకు డబ్బులు ఇవ్వాలని గ్రామానికి చెందిన కొందరు నిలదీయగా మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. బంధువులు వెంటనే ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైద్య శాల నుంచి మహిళ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా తమ వద్ద రాధ సుమారు రూ.కోటి వరకు అప్పుగా నగదు తీసుకుందని డ బ్బులు ఇవ్వాలని అడిగితే తమపై దౌర్జన్యం చేశారని ఫిర్యాదు చేశారని బాధితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు అడిగితే ఆత్మహత్యాయత్న ప్రయత్నంతో భయపెడుతుందని 30 బాధితులు వాపోతున్నారు.

రోగ నిరోధక టీకాలపై అవగాహన

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సాగు చేస్తున్న రైతులు రోగ నిరోధక టీకాలపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి సుమతి అన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని గాంధీనగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే వరి, కూరగాయల పంటలను పరిశీలన చేసి సూచనలు అందించారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

మార్టూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలు, వాతావరణసమస్యల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలన్నా, భూమిని రక్షించుకోవాలన్నా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేపట్టాలని ఎంటీఎల్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలను వివరిస్తూ,ప్లేకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటరులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శశికళ, చంద్రశేఖర్, తులసి, శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారుల నయా దందా

- సిండికేట్‌గా మారి నిబంధనలకు పాతర
- అనుమతులు లేని లేఅవుట్లతో నష్టపోతున్న కొనుగోలుదారులు
- అక్రమ లేఅవుట్ల లెక్క తీస్తున్నామంటున్న రెవెన్యూ అధికారులు
- పూర్తయ్యేదెప్పటికో అంటున్న ప్రజలు
- ఆ లేఅవుట్ల వివరాలు, సర్వే నెంబరు వెల్లడించాలని బాధితుల విన్నపం

చీరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థిరాస్తి వ్యాపారుల్లో పలువురు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఎలాంటి అనుమతీ లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. జిల్లాలోనే అత్యధిక అనుమతులు లేని లేఅవుట్లు ఉన్నది చీరాల నియోజకవర్గంలోనే. కొందరు కనీసం ల్యాండ్ కన్వర్షన్ రుసుము కూడా చెల్లించడం లేదు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. తరువాత విక్రయించేవారిని అడిగినా ప్రయోజనం ఉండడం లేదని వాపోతున్నారు. ఒక వైపు అనధికారిక లేఅవుట్లలో స్థలాలు కొన్నవారికి గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని, మౌలిక వసతులు కల్పన జరగదని ఉన్నతాధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. అందుకు సంబంధించి అనధికారిక లేఅవుట్లు జాబితాను తయారు చేసి, బహిరంగ పరిచారు. ఆ తరువాత కూడా అనధికారిక లేఅవుట్లు వెలుస్తూనే ఉన్నాయి. వీటిపై మరలా పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నామని అధికారులు చెప్తున్నారు.

సిండికేట్‌గా మారుతున్న రియల్టర్లు



వాడరేవు రోడ్డులో వేసిన అనధికారిక లేఅవుట్ (ఫైల్)



216 జాతీయ రహదారి పక్కన అక్కాయిపాలెం పరిధిలో అనధికారిక లేఅవుట్ పనులు (ఫైల్)

రియల్ వ్యాపారుల్లో కొందరు సిండికేట్‌గా మారి తమ దందా సాగిస్తున్నారు. ఆయా సిండికేట్‌లలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు ఉండేలా చూచుకుంటున్నారు. సిండికేట్ భాగస్వాముల్లో ఏ ప్రాంతంలో ఎవరికి ఎక్కువ పట్టుంటే అక్కడ వేసే అనధికారిక లేఅవుట్ ఆ వ్యక్తిదని ప్రచారం చేస్తున్నారు. అధికారుల దగ్గర పాలకపక్షానికి చెందిన వ్యక్తులు ముందుంటున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు.

రూపాయిరూపాయి మదుపు చేసి కొనుగోలు చేస్తే ..

సొంతింటి కలను సాకారం చేసుకుందామని ప్రత ఒక్కరికీ ఉంటుంది. కొందరు స్థిరాస్తిగా స్థలాలు, పొలాలపై ముదపు చేస్తుంటారు. ఈ క్రమంలో రూపాయి రూపాయి కూడబెట్టుకుని స్థలాలు కొనుక్కుంటున్న వారిలో పలువురికి తరువాత గృహ నిర్మాణ సమయంలో చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అనధికారిక లేఅవుట్లకు మౌలిక వసతులు లేకపోవడం, కనీసం ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కూడా ఇవ్వమని అధికారులు చెప్పడం అందుకు కారణం. దీంతో అక్రమ లేఅవుట్లు వివరాలను సర్వే నెంబరు, పేర్లతో సహా ప్రభుత్వ అధికారులు వెల్లడించి తాము నష్టపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మీ ఫార్మాల్టీ మీకిస్తారు

మీ ఫార్మాల్టీ మీకిస్తారు. వార్తలు రాయొద్దని మీడియాకు, వారి జోలికి వెళ్లకుంటే మీ మంచిచెడులు చూస్తారని అధికారులకు పలువురు రియల్టర్ల తరఫున వకాల్తా పుచ్చుకుని రాయబేరాలు నడిపేవారు తెరపైకి వస్తున్నారు. ఇందులో మా స్వార్థం ఏమీ లేదు. అందరూ బాగుండాలనేది మా అభిమతం అని చెప్పిడం విశేషం. అయితే అంతిమంగా అనధికారిక లేఅవుట్లలో కొనుగోలు చేసిన వారు నష్టపోతారు కదా అని అడిగితే సమాధానమే లేదు.

ప్రహరీ రక్షణకు అని చెప్తున్నారు.. వివరాలు నమోదు చేస్తున్నాం



అనధికారిక లేఅవుట్లకు సంబంధించి వివరాలు నమోదు చేస్తున్నాం. కొందరు పక్కాగా లేఅవుట్ కోసం పనులు చేస్తూ, చుట్టూ గోడ కట్టి కూడా అది రక్షణకు ఏర్పాటు చేసుకున్నామని చెప్తున్నారు. వాటి మధ్యలో రాళ్లు వేయకుంటే అది లేఅవుట్ లెక్కలోకి రాదు. వారు కోర్టుకు వెళితే లేఅవుట్ అని నిరూపించలేం. నిలబడదు. అలాంటి వాటి వివరాలను నమోదు చేస్తున్నాం. అంతిమంగా కొనుగోలుదారులు పక్కాగా అనుమతులు ఉంటేనే లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయాలి.

- గోపీకృష్ణ, తహసీల్దార్, చీరాల మండలం

వివరాలు నమోదు చేస్తున్నాం కొనుగోలుదారులు జాగ్రత్తగా ఉండాలి



ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అనధికారిక లేఅవుట్లు జాబితా తయారు చేస్తున్నాం. గతంలో సేకరించిన వాటి వివరాలు ఇప్పటికే వెల్లడించాం. ఆ తరువాత, అంతక ముందు ఉన్న లేఅవుట్లలో కూడా అనుమతిలేని వాటి వివరాలపై నివేదిక తయారు చేస్తున్నాం. పూర్తి వివరాలతో నివేదికను ఒడా చైర్మన్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేసేందుకు క్షేత్రసాథయి పరిశీలన జరుగుతోంది.

- పార్వతి, తహసీల్దార్, వేటపాలెం మండలం



కొప్పెరపాడులో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన

ఒక్కరోజే 250 మంది స్వీకరణ

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. కొప్పెరపాడు టీడీపీ నేతలు స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశాల మేరకు వి.కొప్పెరపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గ్రామ కూడలిలో ప్రత్యేకంగా సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఒక్కరోజే గ్రామానికి చెందిన 250 మంది కార్యకర్తలుగా పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. టీడీపీ సభ్యత్వ నమోదు తీసుకున్న వారు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ.5లక్షల బీమా అందిస్తుందని నాయకులు అవగాహన కల్పించారు. మరో రెండు రోజుల పాటు ఈ డ్రైవ్ ఉంటుందని చెప్పారు. 900 మంది చేరికే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు నాయకులు నాగినేని సాంబశివరావు, కామినేని శ్యామలరావు, షేక్ అబ్దుల్‌సాహెబ్, పరిటాల పవన్, పూరేటి రామకృష్ణ, మక్కెన ప్రసన్న కుమార్, ప్రసాద్, శ్రీనివాసరావు, ఖాజా వలి, బాలయ్య, వరదయ్య పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలతో బోధనపై పట్టు

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెలవారీగా నిర్వమిస్తున్న కాంప్లెక్స్ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులకు బోధనపై పట్టు పెరుగుతుందని ఎంఈవో వస్త్రాం నాయక్ పేర్కొన్నారు. బుధవారం బల్లికురవ, వైదన గ్రామాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో ఎంఈవో పాల్గొన్నారు. బోధనలో తీసుకోవాల్సిన మెళకువలను ఆయన వివరించారు. అనంతరం వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీపై పురోగతి

సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించిన పోలీసులు

దేవాంగపురి(చీరాలటౌన్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్‌టౌన్ పరిధిలోని దేవాంగపురి పంచాయతీలో మంగళవారం జరిగిన చోరీకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు పురోగతి సాధించారు. ఇంటి యజమాని విశ్రాంత ప్రిన్సిపాల్ పృధ్వీ నటరాజ్ కుమార్ హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు సుమారు పది రోజుల కిందట భార్య కలిసి వెళ్లారు. అప్పటికే రెక్కీ నిర్వహించిన పాత నేరస్థుడు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశాడు. దీంతో సమాచారం అందుకున్న యజమాని వన్‌టౌన్ సీఐ మారీదు శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఈక్రమంలోనే ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానంతో పాత నేరస్థుడిగా పోలీసులు కనుగొన్నారు. అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 17 గ్రాముల బంగారం, 20 తులాలు వెండి, కొంత నగదు అపహరణ జరిగినట్లు పోలీసులు తెలిపారు.

నేర నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలి

చీరాల డీఎస్పీ మొయిన్

ఇంకొల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పోలీసు సిబ్బంది కృషి చేయాలని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ సూచించారు. ఇంకొల్లు పోలీసుస్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధునాతన పరిజ్ఞానంతో మండలంలో వివిధ గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ఎస్సై సురేష్‌ను అభినందించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళ్లలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిఘా పెంచాలని సూచాంచారు. ఇంకొల్లు సీఐ రమణయ్య, సిబ్బంది ఉన్నారు.

అత్యాచార కేసులో నిందితుడికి యావజ్జీవం

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించింది. పోలీసుల తెలిపిన కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బాలికపై 20-03-2018 సంవత్సరంలో అత్యాచారం జరిగింది. ఆదే గ్రామానికి చెందిన 57ఏళ్ల వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి చినగంజాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి చీరాల డీఎస్పీ వి.శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించి విచారించారు. నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ కేసు ఒంగోలు స్పెషల్ కోర్టు, పోక్సో కోర్టులో విచారణకు రాగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ స్వీయ పర్యవేక్షణలో చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ సూచనలతో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, చినగంజాం ఎస్ఐ శీలం రమేష్, ఒంగోలు కోర్టు కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావు సాక్షులను కోర్టుకు హాజరు పరచగా ప్రత్యేక పీపీ వై.వెంకటేశ్వర్లు, 1వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రాజా వెంకటాద్రి సాక్షులు చెప్పిన సాక్ష్యం, దర్యాప్తు అధికారి భౌతిక ఆధారాలను పరిగణలోనికి తీసుకొని బుధవారం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష (20ఏళ్లు) రూ.10వేల జరిమినా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలికలపై, మహిళల మీద జరుగుతున్న నేరాలను వేగంగా దర్యాప్తు చేసి నిర్ణీత గడువులోపు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతోపాటు సాక్షులను తగు రీతిలో భయం లేకుండా సాక్ష్యం చెప్పేలా తర్ఫీదు ఇవ్వడంవలనే కేసులలో నిందితులకు శిక్షలు పడుతున్నట్లు తెలిపారు. మహిళల మీద, బాలికల మీద చెడు ఉద్దేశంతో ప్రవర్తించేవారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పీపీకి ఎస్పీ అభినందించారు.

మద్యం విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని కొత్తపాలెం, వైకుంఠపురం, పాపరాజుతోట, గాంధీనగర్ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి నిర్వహించిన దాడుల్లో దండుబాట రోడ్డులో నివాసముంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 14 క్వార్టర్ మద్యం సీసాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్టీ కాలనీవాసులకు న్యాయం చేయాలి

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గతంలో ఎస్టీలకు అందజేసిన పట్టాలకు హద్దులు చూపించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు సిపాయి కాలనీని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల కిందట ప్రభుత్వం 25 మంది ఎస్టీలకు సర్వే నెంబరు 36, 37లో పట్టాలను మంజూరు చేసిందని, అప్పటి నుంచి వారు అక్కడే ఉంటున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఆ భూమి తనదని, ఖాళీ చేయాలని గిరిజనులను భయపెడుతున్నారని అన్నారు. ఈ విషయమై అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని ఎస్టీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు రమణయ్య, గొల్లపూడి అంజయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేఆర్‌కే కళాశాల విద్యార్థుల వైజ్ఞానిక యాత్ర

అద్దంకిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా బుధవారం వివిధ విభాగాల విద్యార్థులు విద్యా వైజ్ఞానిక విహారయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని మణికేశ్వరం గ్రామంలో చిన్న కాశీగా పిలువబడే మల్లేశ్వర స్వామి ఆలయాలన్ని సందర్శించారు. ఆలయ సమీపంలోని మొక్కల నర్సరీను సందర్శించారు. అక్కడ ఉన్న మొక్కల సమాచారం, వాటి వృద్ధికి అనుసరిస్తున్న సాంకేతిక అంశాలపై జీవశాస్త్రం విభాగ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి. రాజశేఖర్, డాక్టర్ షర్మిలారాణి, డాక్టర్ షేక్ మస్తాన్‌వలి, బి. అ శోక్‌కుమార్, వీ రామకృష్ణ పాల్గొన్నారు.



పత్తిని పరిశీలించిన ఏవో సుబ్బారెడ్డి

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు

పంగులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలకు అవసరానికి మించి ఎరువులను వాడొద్దని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ రైతులతో కలసి సాగు లో ఉన్న మిరప, పత్తిని పరిశీలించారు. పత్తి లో బోరాన్ లోపంతోపాటు రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మిరపలో ఆకుమచ్చ తెగులు, తెల్లదోమ అధికంగా ఉందని తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీఓఏ అలగ్జాండర్, మార్కెటింగ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ : రెండు రోజుల చలి చలి పెరిగిందని రైతులు పంటలలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి సూచించారు. బుధవారం మండలం లోని అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బీపీటీ 5204 వరిలో చలి కారణంగా అగ్గి తెగులు, మచ్చలు కనిపిస్తున్నాయని దా ని నివారణకు ట్రైసైక్లోజోల్ 120ని పిచికారీ చేయాలని ఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, వీఏఏ ప్రవీణ్, శ్రీకాంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు



రీ సర్వే సమస్యలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. మండలంలోని చందలూరు గ్రామ పంచాయతీ కార్యలయంలో బుధవారం రీసర్వే సమస్యల పరిష్కారంలో భాగంగా సంబంధిత రైతులతో చర్చించారు. మండల స్థాయిలో రీసర్వే జరిగిన 6 గ్రామాలలో సభలు నిర్వహించి మొత్తం 453 సమస్యలు గుర్తించామన్నారు. వాటి పరిష్కారం కోసం వీఆర్వో, సర్వేయర్‌లను ఒక బృందంగా నియమించి పరిశీలన కోసం రీసర్వే డీటీ, మండల సర్వేయర్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌ను పర్యవేక్షణ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15లోగా సమస్యలను పరిష్కరించే దిశగా బృందాలు పని చేస్తాయన్నారు. మండలంలోని కశ్యాపురం, రేణంగివరం, అలవలపాడు, చందలూరు, తూర్పు కొప్పెరపాడు, కోటపాడు గ్రామాలలో రీ సర్వే జరిగిందన్నారు. చందలూరులో జరిగిన కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, గ్రామ వీఆర్వో పరశురామిరెడ్డి, గ్రామ సర్వేయర్ నాగార్జున, కంప్యూటర్ ఆపరేటర్ నాగార్జున పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథపాలకురాలు ధనమ్మ, అతిథులు...



చినగంజాంలో బహుమతులతో విద్యార్థులు

చీరాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథి విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లీశ్వరరావు, సర్విశెట్టి సుబ్బరామయ్య తదితరులు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంధపాలకులు ధనమ్మ మాట్లాడుతూ తమకు సహకరిస్తు న్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిరుల్లీసాఖాన్, చుండూరి కృష్ణమూర్తి, రూపాదేవి, చంద్రమౌళి, కిషోర్, బ్రహ్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాం : గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కొద్ది రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, తెలుగు పాటలు పోటీలలో విజేతలైన వారికి, మ్యూజికల్ చైర్స్‌లో గెలుపొందిన మహిళలకు గ్రంథపాలకుడు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో బి.అజయ్ బాబు, చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం అలవాటు చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముగింపు వారోత్సవాల సందర్భంగా సోపిరాల గ్రామానికి చెందిన ఎన్నారై పర్వతరెడ్డి సునీల్‌కుమార్ సమకూర్చిన రూ.7000 విలువ చేసే టేబుల్‌ను ఆయన తండ్రి రిటైర్డ్ డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి హరిబాబు, మాజీ మున్సిపల్ కమిషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు గ్రంథపాలకునికి అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కాంతారావు, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వై.రామాంజనేయులు, భావనారాయణస్వామి యోగా శిక్షణ కేంద్రం అధ్యాపకులు వలివేటి రామానుజన్, పెదగంజాం, మున్నంవారిపాలెం బీడీసీఎల్ నిర్వాకులు దామెదర్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలికలకు చలికోట్లను అందజేస్తున్న సభ్యులు

దాతల సాయాన్ని వినియోగించుకోవాలి

చినగంజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి అన్నారు. బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషల్ వ్యవస్థాపకులు జయశాలి, పీడీ సుందరరావు జయంతి సందర్భంగా ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు బుధవారం కస్తూర్బా బాలికా విద్యాలయంలోని అనాథ బాలికలలకు చలికోటులను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీసీసీ రాష్ట్ర ఏవో శ్రీనివాసరావు, సీటీటీ వైస్ ప్రిన్సిపాల్ మనోహరావు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లలితకుమారి, కే.సుబ్బారావు, తిరుపతిరావు, కృష్ణ, ఆర్.పౌలు, ఎన్.విజయుడు, ఏలియా, శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

23న విద్యుత్ సమస్యలపై అదాలత్

చీరాలటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న వినియోగదారుల అదాలత్, అవగాహన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ ఈఈ జాన్‌థామస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ఈనెల 23వ తేదీ శనివారం కొత్తపేట రావి సుబ్బరాయుడు కల్యాణ మండపంలో వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఏలూరికి శుభాకాంక్షలు చెప్తున్న టీడీపీ నాయకులు

ఏలూరికి అభినందనలు

ఇంకొల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును బుధవారం ఇంకొల్లు టీడీపీ నాయకులు తాడేపల్లిలో కలిసారు. విజనరీ లీడర్ అవార్డును పొందిన సందర్భంగా ఏలూరిని కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు హనుమంతరావు, శ్రీనివాసరావు, పట్టణపార్టీ అధ్యక్షుడు మార్కు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రావు, శ్రీనివాసరావు, రఫీ, శ్రీను, మీరావలి పాల్గొన్నారు.

చినగంజాం : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకి పెదగంజాం టీడీపీ నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి విజనరీ అవార్డు పొందిన సందర్భంగా పెదగంజాం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేకు కట్ చేశారు. అనంతరం నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. భవిష్యత్ ఎమ్మెల్యే ఏలూరి మరెన్నో అత్యున్నత పదువులు, అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆసోది అంజిరెడ్డి, గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ఎంపీడీవో కుసుమకుమారి




వల్లాపల్లి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాయలయాలలో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో కె.కుసుమకుమారి హెచ్చరించారు. బుధవారం మండలంలోని వల్లాపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులు, సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి పరిశీలన చేశారు. అనంతరం అమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా సిబ్బంది పనిచేయాలన్నారు. సమస్య వచ్చినవారికి అది ఎప్పుడు పరిష్కారమవుతుందో చెప్పాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

గురువారం 21 నవంబరు 2024

- కనుపూరు, సర్వేపల్లి రిజర్వాయర్ల నుంచి గ్రావెల్ తరలింపుపై విచారణ
- ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫిర్యాదుతో ప్రభుత్వ నిర్ణయం
- అత్యవసరంగా నివేదిక పంపాలి : సీఎంవో ఆదేశం
- నాడు విచ్చలవిడిగా వైసీపీ నేతల దోపిడీ
- ఇరిగేషన్ అధికారులను బెదిరించి మరీ అక్రమాలు



నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు

మార్చి నాటికి రైల్వే పనుల పూర్తి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

నెల్లూరు వెంకటేశ్వరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు 2025 మార్చి కల్లా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రత్యేక రైలులో జిల్లా పర్యటనకు వచ్చారు. ముందుగా రైల్వే అధికారులతో కలసి ట్రాక్ స్పీడ్ టెస్టింగ్ చేశారు. అనంతరం నెల్లూరు ప్రధాన స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతలో ఎక్కడా కూడా రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలన్నారు. 2025 మార్చికి పనులు పూర్తి చేసేలా దిశానిర్దేశం చేశారు. జీఎం వెంట పలువురు రైల్వే ఉన్నతాధికారులు, తదితరులు ఉన్నారు.

తవ్విందెంత.. తిన్నదెంత?

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన గ్రావెల్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. నాడు జరిగిన దోపిడీపై విచారణ జరిపి, వేగంగా నివేదికను అందజేయాలని ఆదేశించింది. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లలో జరిగిన గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి ఇరిగేషన్ శాఖకు ఉత్తర్వులు అందాయి. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు తాజాగా విచారణ ప్రారంభించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదుతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

-నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



కనుపూరు చెరువులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా మట్టి, గ్రావెల్ దోపిడీ జరిగింది. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్‌లను కుళ్లబొడిచారు. రైతుల పేరుతో తవ్వకాలకు అనుమతులు తీసుకోవడం, అనంతరం ఆ మట్టి, గ్రావెల్‌ను నెల్లూరు పరిసరప్రాంతాల్లో ఉన్న లేఅవుట్లు, పరిశ్రమలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. అప్పట్లో ఈ తవ్వకాలపై ఎన్ని ఆరోపణలు వచ్చినా, చివరకు స్థానికులు అడ్డుకున్నా అక్రమార్కులు వెనక్కు తగ్గలేదు. సుమారు ఐదేళ్లపాటు విచ్చలవిడిగా దోపిడీ చేశారు. ఈ అక్రమాలపై గత ఏడాది ఆగస్టులో అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీఎంకి ఫిర్యాదు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అయితే గత నెలలో మరోసారి సోమిరెడ్డి సీఎంకి ఫిర్యాదు చేశారు. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లల్లో 15 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా గ్రావెల్, మట్టి దోపిడీ జరిగిందని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇందులో రూ.40 కోట్లు అక్రమంగా సంపాదించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన సీఎంవో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ సెక్రటరీ సాయిప్రసాద్‌ను ఆదేశించింది. ఆయన ఇరిగేషన్ ఈఎన్‌సీ, నెల్లూరు ఇరిగేషన్ ఎస్‌ఈలకు ఆదేశాలు పంపారు. ఈక్రమంలో కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లల్లో జరిగిన అక్రమ తవ్వకాలపై విచారణ ప్రారంభమైంది.

- అధికారులకు బెదిరించి అక్రమాలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ అధికారులను బెదిరించి, భయపెట్టి చెరువులు, రిజర్వాయర్లల్లోని మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టారు. పొలాలను సారవంతంగా

- మిగతా 6లో



పుడమి తల్లినే నమ్ముకున్న అన్నదాతను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విత్తు దశ నుంచి కోత వరకు సాంకేతికపరంగా రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ద్వారా క్షేత్రస్థాయిలో రైతులను ఆదుకునేలా మార్గదర్శకాలు రూపొందించాయి. అయితే, గత కొన్నేళ్లుగా 'ఆత్మ'కు నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఇంకేముంది ఈ వ్యవస్థ ఆశించిన స్థాయిలో రైతులకు వెన్నుదన్నుగా నిలవడం లేదు.

- నెల్లూరు వ్యవసాయం, (ఆంధ్రజ్యోతి)



'ఆత్మ' ఘోషిస్తోంది !

- నిధుల లేమితో పథకం నిర్వీర్యం
- నామమాత్రంగానే కార్యకలాపాలు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

రైతులకు సాంకేతిక పరమైన సలహాలు, శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలతోపాటు సరికొత్త పరిజ్ఞానం అందించేందుకు 2006లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆత్మ'ను ప్రారంభించాయి. 60-40 శాతం నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తూ పథకాన్ని అమలు చేయాలని అప్పటి పాలకులు నిర్ణయించారు. ఆ మేరకు 2018 వరకు పూర్తిస్థాయిలో రైతులకు సేవలందించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి ఒక వ్యవసాయ సబ్ డివిజన్‌కు ఒక బ్లాక్ టెక్నికల్ మేనేజర్ (బీటీఎం), ఇద్దరు అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్లు (ఏటీఎం) ఉండాలి. అయితే ప్రస్తుతం 12 బీటీఎంలకుగాను నలుగురు, 24 మంది ఏటీఎంలకు ముగ్గురు మాత్రమే అందుబాటులో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఆత్మకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయకపోవడంతో కేంద్రం నుంచి సైతం నిధులు నిలిచిపోయాయి.

- నామమాత్రంగా సదస్సులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 10లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి. దాదాపుగా 4లక్షల మంది రైతులకు వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఎంతో అవసరం. అంతేగాక అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో ఏయే కార్యక్రమాలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించడంలో ఆత్మ ఎంతో కీలకంగా వ్యవహరించేది. అయితే, 2019 నుంచి పథకానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధించడంతో ఆయా కార్యక్రమాలు నామమాత్రంగా నిర్వహించేవారు. గత రెండేళ్లలో పరిశీలిస్తే కేవలం రూ.5లక్షలు

- మిగతా 6లో



మొబైల్ హంట్ ద్వారా స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

సెల్ చేజారితే...!

- 'మొబైల్ హంట్'తో రికవరీ
- ఏడు విడతల్లో మూడువేల సెల్‌ఫోన్ల స్వాధీనం
- వాటి విలువ సుమారు రూ. 8 కోట్లు
- సెల్ పోయిందా... 91543 05600 నెంబరుకి వాట్సప్ చేయండి

నెల్లూరు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేడు మొబైల్ ఫోన్ మనిషి జీవితంలో నిత్యావసర వస్తువుగా మారింది. పేద, ధనిక అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కనిపిస్తున్నది. ఈ క్రమంలో సెల్‌ఫోన్ నెంబర్‌ను ప్రభుత్వ పథకాల కోసం వచ్చే మెసేజ్‌లు, మెయిల్, ఆన్‌లైన్ లావాదేవీలకు వినియోగిస్తున్నారు. పదికాలాలు గుర్తుండే ఫొటోలు తీయాలన్నా, వాటిని భద్రపరచాలన్నా సెల్‌ఫోనే సాధనం... ఇలా అన్నీ పనులకు సెల్‌ఫోనే అవసరం. అసలు మనిషి మెదడును ఉపయోగించడం మానేసి పూర్తిగా సెల్‌ఫోన్‌పైనే ఆధారపడ్డాడు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ చేజారిపోతే ఆ బాధ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అయితే, సెల్‌ఫోన్‌పోతే నేనున్నానంటూ పోలీసులు తీసుకువచ్చిన మొబైల్ హంట్ ఉపయోగపడుతున్నది. చోరీకి గురైన సెల్‌ఫోన్లను ఈ యాప్ రికవరీ చేస్తున్నది.

- ఫిర్యాదు చేయడం ఎలా..?

గతంలో సెల్‌ఫోన్ పోతే పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు వారికున్న పెద్ద కేసులతో పట్టించుకునేవారు కాదు. అయితే, మొబైల్ హంట్ సేవలు అందుబాటులోకి వచ్చాక పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, కేవలం వాట్సప్ మెసేజ్‌ల ద్వారా జిల్లా పరిధిలో చోరీకి గురైన, మిస్ అయిన సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాట్సప్ నెంబరు 9154305600కు ఫోన్ చేస్తేనే అది నెల్లూరు జిల్లా పోలీసు పేరున వెబ్‌లింక్ పంపుతుంది. ఆ లింక్‌ను క్లిక్ చేయగానే గూగుల్ పేజీ ఓపెన్ అవుతుంది. ఆ పేజీలో ఫిర్యాదుదారుడి పేరు, చిరునామా, సెల్‌ఫోన్ పోయిన తేదీ, సమయం, ప్రదేశాన్ని తెలియజేయాలి. మొబైల్ పోయిన విధానం గురించి చెప్పాలి. ఫిర్యాదుదారుడి పోలీసుస్టేషన్ పరిధి తెలియజేసి సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు లేక, బాక్స్‌పైన ఉన్న ఐఎంఐ నెంబర్లను నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. దీంతో మన ఫిర్యాదు నమోదు అవుతుంది. అనంతరం పోలీసులు విచారణ చేపట్టి మిస్‌అయిన, లేదా చోరీ అయిన ఫోన్‌ను కనుగొంటారు. ఇలా ఇప్పటివరకు జిల్లాలో ఏడు విడతల్లో సుమారు రూ. 8 కోట్ల విలువ చేసే మూడువేల సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

చోరీ మొబైళ్లు కొనుగోలు చేయొద్దు

మొబైళ్లను దొంగలించిన వ్యక్తులు మార్కెట్లో తక్కువ ధరకు వాటిని విక్రయిస్తుంటారు. దీంతో చాలామంది అత్యుత్సాహంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి వారిలో యువత విద్యార్థులు, గ్రామీణులు అధికంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి మొబైల్ హంట్‌లో ఫిర్యాదు చేయడంతో దాన్నిప్రస్తుతం వాడుతున్న వ్యక్తి నుంచి పోలీసులు రికవరీ చేస్తున్నారు. ఈ క్రమంలో దొంగలించిన ఫోన్‌ను ఎందుకు కొనుగోలు చేశారంటూ పోలీసులు గట్టిగా ప్రశ్నిస్తున్నారు. కాబట్టి ఎవరూ బిల్లులు లేని, తక్కువ ధరకు వస్తున్నాయన్న ఆశతో చోరీకి గురైన మొబైళ్లను కొనుగోలు చేసి ఇబ్బందులు తెచ్చుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు మొబైల్ హంట్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పలు దఫాలుగా ఫోన్లు పోగొట్టుకున్న మూడువేలమందికి మొబైల్ హంట్ ద్వారా రికవరీ చేసి అందించాం.

- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఫోన్ దొరుకుతుందని ఊహించలా ?



ఇంటి వరండాలో కూర్చొని ఫోన్ మాట్లాడి ఇంటి లోపలికి వెళ్లి వచ్చేసరికి నా ఫోన్ చోరీకి గురైంది. అయితే పోయిన ఫోన్ ఏం దొరుకుతుందేలే.. అని కొద్ది రోజులు దాన్ని గురించి వదిలేశా. నా మిత్రుడు మొబైల్ హంట్‌కు ఫిర్యాదు చేయమని చెబితే నవ్వుకున్నా. ఎట్టకేలకు అతని ఒత్తిడితో మొబైల్ హంట్‌కు ఫిర్యాదు చేశా. ఆరు నెలలు గడవక ముందే పోలీసుల నుంచి నాకు ఫోన్ వచ్చింది. నీ ఫోన్ దొరికింది వచ్చి తీసుకెళ్లమన్నారు. ఇప్పటికీ నమ్మలేకున్నాను. నిజంగా మొబైల్ హంట్ సేవలు అద్భుతం.


- జీ మధుబాబు, ఉలవపాడు

ఇంటర్ విద్యార్థులకూ ప్రోగ్రెస్ కార్డులు

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చర్యలు
- తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు
- ఈ ఏడాది నుంచే అమలులోకి..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగునకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ నూతన విధానంతో విద్యార్థులు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, వారి ప్రగతి తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా మంచి ఫలితాల సాధనకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)





ఇంటర్ విద్యార్థులకు అందజేసే ప్రోగ్రెస్ కార్డుల ఇవే!

ఇంటర్ ఫలితాల్లో 'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ కళాశాలలనూ తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, అంతర్గత పరీక్షల్లో వారు సాధించిన మార్కుల వివరాలు సదరు కార్డుల్లో నమోదు చేయనున్నారు. తల్లిదండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ పరీక్షలు, త్రైమాసికం, అర్ధ సంవత్సరం, ప్రీ ఫైనల్ పరీక్షలు రెండుసార్లు నిర్వహిస్తారు. వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెలుపు, జనరల్ ప్రథమ సంవత్సరం చదివే విద్యా ర్థులకు లేత పసుపు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లేత నీలం రంగుల్లో కార్డులు సిద్ధం చేస్తున్నారు. హాజరు వివరాలు నమోదు చేయనుండటంతో విద్యార్థులు సక్రమంగా కళాశా లలకు వెళుతున్నారా లేదా అన్న విషయాలు తల్లిదండ్రులకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కార్డుల నమూనాలను అధికారులు జూనియర్ కళాశాలలకు పంపించారు. వీటిని అమలు చేయాల్సిన తీరుపై ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డుల గురించి తెలియచేస్తూ వీటిని తప్పక అనుసరించాలని సూచనలు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

యాజమాన్యం	కళాశాలలు
ప్రభుత్వం	24
ఎయిడెడ్	2
మోడల్	11
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	6
కేజీబీవీ	12
హైస్కూల్ ప్లస్	16
ప్రైవేట్ అన్ ఎయిడెడ్	116
మొత్తం	187

విద్యార్థుల సంఖ్య	
జూనియర్లు :	28,297
సీనియర్లు :	24,706
మొత్తం :	53,003

ఉత్తమ ఫలితాలకు దోహదం

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోగ్రెస్ విధానం ఎంతో దోహదం చేస్తుంది. ఈ ఏడాది నిర్వహించే ప్రతి పరీక్షకు సంబంధించిన వివరాలు, హాజరుశాతం ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపిస్తారు. దీంతో విద్యార్థుల వివరాలు, వారి పరిస్థితి అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ముందుగానే తెలుస్తాయి. దీని ఆధారంగా వారిని బాగా చదివించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తాం.

- డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు, ఆర్ఐవో



బాధ్యతలు స్వీకరిస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు

దినేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం)/బుచ్చిరెడ్డిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దినేష్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎండీ ఫరూక్, వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి, కోవూరు, ఉదయగిరి, గూడూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీలు రాంభూపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మారిటైల్ కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య, పొల్యూషన్ బోర్డు చైర్మన్ పీ.కృష్ణయ్య, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గూటూరు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితోపాటు పలువురు అభినందించి, శుభాకాంక్షలు తెలియచేశారు. దినేష్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి బుచ్చి నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కాగా ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెంలో నేతలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

పెద్ద స్టేషన్‌లో కొత్త అండర్‌పాస్





నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తూర్పు వైపు నూతనంగా నిర్మించిన అండర్‌పాస్ వాడుకలోకి వచ్చింది. ఇప్పటి వరకు పడమర వైపు నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫాంల వరకు మాత్రమే భూగర్భంలో అండర్‌పాస్ ఉండేది. అయితే రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి కోసం రూ.102 కోట్లతో చేపట్టిన పనుల్లో భాగంగా తూర్పు వైపు నుంచి కొత్త అండర్ పాస్ నిర్మించి అన్ని ప్లాట్ ఫాంలకు వెళ్లేలా అనుసంధానించారు. కాగా, మరమ్మతుల కోసం తూర్పువైపు మెట్లమార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. పనులు పూర్తయ్యాక మెట్లమార్గం కూడా అందుబాటులోకి వస్తుందని స్టేషన్ సూపరింటెండెంట్ శివయ్య తెలిపారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

పైపులైను పగిలి కుంగిన రోడ్డు!



కావలి పట్టణ పరిధిలోని విట్స్ కళాశాల వెనుకవైపున రోడ్డు మలుపు వద్ద మంగళవారం అర్ధరాత్రి మంచినీటి ప్రధాన పైపులైన్ పగిలి రోడ్డుకు రంధ్రం పడి కుంగిపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించడంతోపాటు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ప్రధాన పైపులైన్ నుంచి పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరు వదలిన సమయంలో ఈ పైపులైను పెద్దపవని రోడ్డు నుంచి ఉదయగిరి రోడ్డులోకి ప్రవేశించే మలుపు వద్ద పగలడంతో రోడ్డు కూడా కుంగాపోయింది. కాగా పెద్దపవని రోడ్డులో కలుగోళ్లశాంబవి ఆలయం వద్ద ఆర్వోబీ వంతెన నిర్మాణం ఆగిపోవడంతో ఆమార్గంలో నడిచే వాహనాలను పెద్ద పవని రోడ్డు నుంచి ఉదయ గిరి రోడ్డు వైపు మళ్లిస్తూ ఒక రహదారిని నిర్మించారు. అయితే ఆ రహదారిలో ఉదయగిరి రోడ్డు మలుపు వద్ద పైపులైన్ పగిలి రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో వాహనాలను మినీ స్టేడియం లోపల నుంచి ఉదయగిరి రోడ్డు వైపు మళ్లించారు. అయితే అక్కడ కూడా మినీ స్టేడియం నుంచి ఉదయగిరి రోడ్డులోకి ప్రవేశించే వద్ద ఉన్న మురుగునీటి కాలువ కల్వర్టు కుంగి వాహనచోదకులు ఇబ్బందులకు గురవడంతో కల్వర్ట్ కుంగిన చోట గ్రావెల్ నింపి వాహనాల రాకపోకలు కొనసాగించారు. మంచి నీటి ప్రధాన పైపులైన్ పగిలిన కారణంగా పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీ, మున్సిపల్ కార్యాలయం, వెంగళరావునగర్, వైకుంఠపురం, కచ్చేరిమిట్ట ప్రాంతాల్లో ఉన్న ఓవర్‌మెడ్ ట్యాంకులకు నీటి సరఫరా ఆగిపోయింది.

- కావలి,(ఆంధ్రజ్యోతి)

ప్రశ్నార్థకంగా వర్సిటీ కళాశాలల క్రీడలు

జిల్లాలో అస్తవ్యస్తంగా నిర్వహణ

ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారులు

నెల్లూరు (విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(వీఎస్‌యూ) నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడలు ప్రశ్నార్థకంగా మారాయి. మూడేళ్లుగా ఇదే రీతిన జరుగుతుండడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్ కళాశాలల క్రీడాపోటీల నిర్వహణ, యూనివర్సిటీ జట్ల ఎంపికల షెడ్యూల్ గందరగోళంగా మారడంతో క్రీడాకారులు అయోమయానికి గురవుతున్నారు. కొన్ని కళాశాలలకు మాత్రమే లబ్ధి చేకూరేలా పోటీల నిర్వహణ చేస్తుండడంతో తాము క్రీడా ప్రయోజనాలు పొందలేకపోతున్నామని విద్యార్థులకు ఆందోళన చెందుతున్నారు.

● నిర్వహణ అధ్వానం

వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా అంతర్ కళాశాలల పోటీల నిర్వహణకు పొంతన లేని షెడ్యూల్ ప్రకటించడంతో గందరగోళం నెలకొంది. తొలుత ఈ పోటీల తేదీలను ఈనెల 17, 18వతేదీల్లో నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు ప్రకటించారు. అయితే వర్షాల కారణంగా ఈ తేదీలను రద్దు చేశామని నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలియచేసిన ఒక్కరోజులోనే తిరిగి 19, 20వతేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో క్రీడాకారులు, కళాశాలల నిర్వాహకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లోని క్రీడాకారులకు ముందస్తు సమాచారం లేకుండా, సమయం కూడా ఇవ్వకుండా ఒక్కరోజులోనే పోటీలకు హాజరు కావాలని ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు పోటీలకు హాజరు కావడం ఇబ్బందిగా ఉంటుందని, కనీసం తేదీలు ప్రకటించిన తరువాత రెండు, మూడు రోజులైనా సమయం ఇవ్వకుండా హడావుడిగా నిర్వహిస్తున్నారని పలువురు పీడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 19వతేదీ నుంచి నిర్వహిస్తానన్న ప్రకటించిన తేదీలను కూడా హడావుడిగా సోమవారం రాత్రి మార్పు చేశారు. గతంలో కబడ్డీ పోటీలను కూడా అకస్మాత్తుగా ఈనెల 10వతేదీ(ఆదివారం)సెలవు రోజున నిర్వహించడంతో నామమాత్రంగా క్రీడాకారులు హాజరయ్యారని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు నష్టం జరిగిందని చెబుతున్నారు. అలగప్ప యూనివర్సిటీలో మహిళా అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు ఈనెల 29వతేదీ నుంచి జరుగుతుండగా అన్ని క్రీడలతో పాటు అంతర్ కళాశాలల షెడ్యూల్ ప్రకారం నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ ఒక్క కబడ్డీ క్రీడనే ప్రత్యేకంగా నిర్వహించడం అనుమానాలకు తావిస్తోందంటున్నారు.



ఇటీవల జరిగిన కబడ్డీ పోటీలు

● కొన్ని కళాశాలలకే ప్రయోజనం

యూనివర్సిటీ పరిధిలోని 150 కళాశాలల్లోని క్రీడాకారులకు ప్రయోజనం కలిగించేలా రూపొందించాల్సిన షెడ్యూల్‌ను కొన్ని కళాశాలలకే ప్రయోజనం కలిగేలా కొంతమంది సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యూనివర్సిటీలో క్రీడా సాంకేతిక పరిజ్ఞానం లేని వ్యక్తులను క్రీడా ప్రతినిధులుగా నియమించడం, వారికి కొన్ని కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు తమకు అనుకూలంగా ప్రయోజనం పొందేలా సూచనలు, సలహాలు ఇవ్వడంతోనే యూనివర్సిటీ పరిధిలోని అత్యధిక కళాశాలల్లో విద్యార్థులు క్రీడా ప్రయోజనాలను పొందలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, యూనివర్సిటీ ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

'ఆత్మ' ఘోషిస్తోంది !

(5వ పేజీ తరువాయి)

మాత్రమే బడ్జెట్ కేటాయింపులు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నామమాత్రంగా నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని సందర్భాల్లో జీతాలు కూడా సమయానికి అందక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

● పూర్తిస్థాయిలో నిధులు కేటాయించేనా..?

గత తెలుగుదేశం పార్టీ హయాంలో (2014-19) ఆత్మ పథకానికి పూర్తిస్థాయి నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. సాంకేతిక పరమైన విజ్ఞాన యాత్రలు, అవగాహన సదస్సులు, శిక్షణతోపాటు క్షేత్రస్థాయి సందర్శనలకు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయింపులు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ సమావేశాల్లో వ్యవసాయ రంగానికి దాదాపు రూ.180 కోట్ల మేర కేటాయింపులు జరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో ఆత్మ పథకానికి పూర్తిస్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని రైతులు ఆశగా ఉన్నారు.

సాంకేతిక పద్ధతులు తెలియజేస్తున్నాం



వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ద్వారా రైతులకు సాంకేతిక పద్ధతులను తెలియజేస్తున్నాం. కేవీకే వాళ్లతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శనలు చేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. గతేడాది దాదాపు రూ.6.5 లక్షల బడ్జెట్ కేటాయించగా, ఉమ్మడి నెల్లూరు జిల్లా కిందే ఆత్మ కార్యక్రమాలు సాగిస్తున్నాం. ఉన్న నిధులతో రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు, మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

- శివన్నారాయణ, పీడీ, ఆత్మ

అమెరికాలో మన ఆటగాడు

● ఫ్లోరిడా రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రోహన్

● బెస్ట్‌ప్లేయర్ అవార్డు కైవసం

ఫ్లోరిడాలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన టీమ్‌లో.. (ఇన్‌సర్టులో) రోహన్ కుమార్





సంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో మూడురోజుల క్రితం రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్ -14 విభాగంలో పాల్గొన్న సంగం గ్రామానికి ప్రవాస భారతీయ విద్యార్థి వాగిశెర్ల రోహన్‌కుమార్ ప్రతిభ కనబరచి బెస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు. సంగం గ్రామానికి గునుపూడి గిరి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె, కుమారుడు అమెరికాలో ఉన్నారు. కుమార్తె పేరు స్రవంతి.ఆమెకు 12 ఏళ్ల క్రితం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న కావలికి చెందిన వాగిశెర్ల కల్యాణ్ చక్రవర్తితో వివాహమైయింది. వారికి రోహన్ కుమార్, ప్రేమ్‌కుమార్ సంతానం. రోహన్‌కుమార్ వయసు 11ఏళ్లు. అమెరికలో ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి కల్యాణ్ చక్రవర్తి క్రికెట్ క్రీడాకారుడు కావడంతో రోహన్‌కుమార్ ఫుట్‌బాల్ ప్లేయర్ శిక్షణ ఇచ్చాడు. దీంతో అతను ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రేమ్‌కుమార్ కూడా క్రికెట్ క్రీడాకారుడు.



బెస్ట్ ప్లేయర్ కప్పు అందుకున్న రోహన్‌కుమార్‌తో తండ్రి, తాత

● రాష్ట్రస్థాయిలో ప్రతిభ

ఈ నేపథ్యంలో ఇటీవల రోహన్ కుమార్ అండర్-14 కేటగిరిలో ఫుట్‌బాల్ విభాగంలో స్కూల్ స్థాయిలో ప్రతిభ కనబరి జాక్సన్ విల్లి జిల్లా స్థాయి టీమ్‌లో ఎంపికయ్యాడు. మూడు రోజుల కిందట ఫ్లోరిడాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రోహన్ కుమార్ ప్రతిభ కనబరచడంతో జాక్సన్ విల్లి టీమ్ రాష్ట్రస్థాయిలో విన్నర్‌గా నిలిచింది. టీమ్ గెలవడానికి కీలక గోల్ చేసిన రోహన్ కుమార్‌ను అక్కడి అధికారులు బెస్ట్ ప్లేయర్‌గా ప్రకటించారు. అమెరికాలోనూ తన అల్లుడు కల్యాణ్ చక్రవర్తి, మనవళ్లు రోహన్ కుమార్, ప్రేమ్‌కుమార్‌లు క్రీడాకారులుగా రాణించడం పట్ల సంగంలోని గునుపూడి గిరి కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.

అడవిలో పేలిన నాటుబాంబు

● ఆవుకు తీవ్ర గాయాలు

● రెండు నాటుబాంబుల స్వాధీనం



నాటు బాంబు పేలుడులో గాయపడిన ఆవు

మనుబోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో బుధవారం నాటుబాంబు పేలింది. దీంతో గోవు దవడకు తీవ్ర గాయమైంది. పొలాల్లోకి అటవీ ప్రాంతం నుంచి వచ్చే పందులు, జింకల కోసం నాటుబాంబులు వాడుతుంటారు. బాంబుల వద్ద ఆహారం వేయడంతో జంతువులు వాటిని ముట్టగానే అవిపేలుతాయి. దీంతో జంతువులు అక్కడికక్కడే కుప్పకూలుతాయి. వాటి మాంసాలు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఇలాంటి సంఘటలే గతంలో చెర్లోపల్లి పొలాల్లో, మడమనూరు ఎరుకల కాలనీ సమీపంలో జరిగాయి. కాగా మడమనూరుకు చెందిన ద్వారకయ్య అనే రైతు పంటపొలాల్లో వ్యవసాయపనులు జరుగుతుండడంతో తన గోవులను మేతకోసం అటవీప్రాంతానికి తోలుకెళ్లాడు. మేతమేసే ప్రయత్నంలో ఓ గోవు బాంబును తాకడంతో అదిపేలిపోయింది. భయంకర శబ్దం రావడంతో రైతు దాని దగ్గరకి పరిగెత్తుకు వచ్చాడు. అప్పటికే గోవు దవడకు తీవ్ర రక్తగాయమైంది. ఆ సమీపంలో రైతు ఉండి ఉంటే ఆయనకు ప్రమాదం జరిగి ఉండేది. సమాచారం అందుకున్న ఎస్ఐ. శివరాకేష్ ఆ ప్రాంతానికి చేరుకుని బాంబు పేలిన ప్రదేశాన్ని పరిశీలించారు. సమీపంలో ఉన్న పేలని రెండు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే బాంబులు అమర్చిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, నెల్లూరు ప్రజా సైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్ హాజరయ్యారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెస్, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, క్విజ్ పోటీల విజేతలైన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. ముందుగా చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదైన సాగర్ తన యోగాసనాలతో అబ్బురపరిచాడు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బందిని సన్మానించారు.

తవ్విందెంత.. తిన్నదెంత ?

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకుగాను చెరువులు, రిజర్వాయర్లల్లో మట్టిని క్యూబిక్ మీటర్ రూపాయి చొప్పున తీసుకెళ్లేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఆ జీవోను అడ్డంపెట్టుకొని కొందరు వైసీపీ నేతలు రైతుల ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారు. నిబంధనల ప్రకారం తవ్వకాలకు అనుమతి తీసుకునే రైతు తన పొలం వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. మట్టి తవ్వకాలు జరిగాక అనుమతి మేరకే జరిగాయా.. లేదా..? అన్నది ఇరిగేషన్ అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వంలో ఇవేమి జరగలేదు. సంబంధం లేని పొలాలకు మట్టి అవసరం అంటూ తెల్లకాగితాలపై దరఖాస్తులు చేసి అధికారులను భయపెట్టి అనుమతులు తీసుకోవడం జరిగాయి. వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకుంటే పదివేల క్యూబిక్ మీటర్లకుపైగా తవ్వినట్లు ఆరోపణలు ఉన్నాయి. అఖరకు అప్పటి ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేరుపై కూడా ఆయనకు తెలియకుండానే మట్టి తవ్వకాలకు అనుమతులు పొందడం అప్పట్లో పెద్దదుమారమే రేగింది. క్యూబిక్ మీటర్‌కు రూపాయి చొప్పున ఎవరు డీడీలు కట్టి అనుమతులు పొందారు..!?, ఆ పొలంలోకే మట్టి, గ్రావెల్ తోలేరా..!?, అన్నది విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రికార్డులు అప్పగిస్తున్నాం

కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలను అందించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్కిల్ పరిధిలో ఇచ్చిన అనుమతుల వివరాలను నేను పంపించాను. డివిజన్ స్థాయిలో ఇచ్చిన అనుమతుల వివరాలు అందించాలని ఈఈకి సూచించాం.

- ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశానాయక్

కృష్ణపట్నం పంచాయతీ

నిధుల దుర్వినియోగం

● ఇద్దరు గ్రామ కార్యదర్శుల సస్పెన్షన్

ముత్తుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పంచాయతీ నిధుల దుర్వినియోగంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను బుధవారం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 2021 ఏప్రిల్ నుంచి 2024జూలై వరకు పనిచేసిన ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు టీ రాజశేఖర్,బీ మస్తానయ్యను సస్పెండ్ చేశారు. పంచాయతీ పరిధిలో సాధారణ నిధులు, 14, 15 వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమయ్యాయని అధికారులు విచారణలో ధ్రువీకరించారు. గత వైసీపీ హయాంలో అప్పటి వైసీపీ నాయకులు, సర్పంచును అడ్డంపెట్టుకుని అడ్డగోలుగా నిధులు స్వాహాచేశారు. 2021ఏప్రిల్ నుంచి జూన్ 2023వరకు కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ.1.70కోట్లు దుర్వినియోగం చేశారని, రూ. 2.40కోట్లు అభ్యంతరకరంగా ఖర్చుచేశారని నివేదికలో పేర్కొన్నారు. 2023 జూన్ నుంచి 2024జూలై వరకు కార్యదర్శి మస్తానయ్య ఆధ్వర్యంలో రూ.1.47కోట్లు అభ్యంతరకరంగా ఖర్చు చేశారని, రూ. 20లక్షలు దుర్వినియోగం చేశారని నివేదికలో తెలిపారు. వైసీపీ పాలనలో జరిగిన నిధుల దుర్వినియోగంపై టీడీపీ అధికారంలోకి రాగానే స్థానిక నాయకులు డీపీవోకి, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విచారణలో నిధుల దుర్వినియోగం వాస్తవమేనని తేలడంతో ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేశారు. రాజశేఖర్ ప్రస్తుతం కోటమండలం కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శిగా, మస్తానయ్య ముత్తుకూరు మండలంలోనే నేలటూరు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వీరిద్దరిని ఆయా స్థానాల నుంచి వెళ్లకూడదని ఆదేశించారు.

మద్యం దుకాణం తొలగించండి

● విద్యార్థుల నిరసన

నెల్లూరు(క్రైం),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పరమేశ్వరి నగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. వాకర్స్ రోడ్డులోని పరమేశ్వరి నగర్ మెయిన్ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని నినదించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కలుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ ప్రాంతం నుంచి వైన్ షాప్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు.



మద్యం దుకాణం తొలగించాలంటూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఘరానా దొంగ అరెస్టు

● తాళం వేసిన ఇళ్లే లక్ష్యం ● రూ. 5.6 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైం),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాత్రి పూట తాళం వేసిన ఇళ్లని టార్గెట్ చేసి పక్కాగా రెక్కీ నిర్వహించి చాకచక్యంగా సర్వం దోచుకెళ్లే ఘరానా దొంగను బాలాజీనగర్ పోలీసులు ఎట్టకేలకు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి వివరాలను నెల్లూరు నగర డీఎస్పీ డీ శ్రీనివాస రెడ్డి బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం రాయవేలూరు జిల్లా వసంతపురం గ్రామానికి చెందిన మారీ రంజిత్ కుమార్ వ్యసనాలకు బానిసై దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడ్డాడు. నెల్లూరులోని బాలాజీనగర్ గుర్రాల మడుగు సంఘంలో అద్దూరి విజయకుమారి తన కుమార్తెతో కలిసి ఓ రేకుల ఇంట్లో నివసిస్తోంది. ఆ ఇంటి పక్కనే కొత్తగా భవనం నిర్మించుకున్నారు. ఈనెల 14వతేదీ రేకుల ఇంటికి తాళం వేసి నూతన భవనంలో నిద్రపోయారు. 15వతేదీ ఉదయం రేకుల ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపల బీరువాలో ఉండాల్సిన బంగారు, వెండి ఆభరణాలు మాయమయ్యాయి. దీంతో ఆమె బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత, ఇతర ఆధారాలతో తమిళనాడుకు చెందిన రంజిత్ కుమార్‌ని నిందితుడిగా గుర్తించారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా బాలాజీనగర్, వేదాయపాళెం పోలీసుస్టేషన్లతోపాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ అనేక దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.5.44 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.16 వేల విలువ చేసే వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవాణి

కందుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల నిల్వల రికార్డులలో తేడాలున్నా, ఎంఆర్‌పీకి మించి అధిక ధరకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి పి సత్యవాణి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎరువుల డీలర్లు, విత్తన డీలర్లతో ఆమె స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిరకాల ఎరువులు ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, రైతులకు రసీదు ఇవ్వాలని, నోటీసు బోర్డులో ఏరోజుకారోజు అమ్మకపు రేట్లు, ఎరువుల నిల్వల వివరాలు నమోదు చేయాలని నిర్దేశించారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించినా, రైతుల వద్ద అధిక ధరలు వసూలుచేసినా చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. లైసెన్సులు తీసుకున్న అన్ని పీఏసీఎస్‌లలో ఎరువులు అందుబాటులో ఉంచేలా తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారులకు ఆమె ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కందుకూరు ఏడీఏ పి అనసూయ, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం ఏడీఏలు ఏ నర్సోజీరావు, ముత్యాల శేషగిరి, ఏఓలు వి రాము, టీ హేమంత్ భరత్‌కుమార్, టీ అబ్రహం లింకన్, వి రవికుమార్, జె తిరుమలజ్యోతి, ఎరువుల డీలర్లు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

పరమానంద ఆశ్రమంలో ప్రశాంత వాతావరణం

● త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి

కలువాయి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పినాకిని నది ఒడ్డున రాజుపాళెం సమీపంలో ఉన్న పరమానంద ఆశ్రమంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ దాతలు మారంరెడ్డి మహేష్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.20లక్షల ఆర్థిక సాయంతో ఆశ్రమంలో నిర్మించిన ఆరు వసతి గదుల సముదాయాన్ని బుధవారం చినజీయర్ స్వామి ప్రారంభించారు. ఆశ్రమంలోని వేద పాఠశాల విద్యార్థుల కోసం తరగతి గది నిర్మాణానికి చినజీయర్‌స్వామి రూ.5లక్షలు సాయం అందజేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వసతి గదులను ప్రారంభిస్తున్న చినజీయర్‌స్వామి

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

● ఆత్మ పీడీ శివనారాయణ

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకే రైతులు పురుగుమందులు వినియోగించాలని నెల్లూరు జిల్లా ఆత్మ పీడీ డాక్టర్ శివనారాయణ సూచించారు. మండలంలోని పోకూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏఓ హేమంత్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ రైతులు సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని తెలిపారు. జిల్లా జలవనరుల కేంద్రం వ్యవసాయాధికారి డాక్టర్ శైలజాకుమారి మాట్లాడుతూ మినుము పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌బాషా రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య రాయితీ పథకాలపై అవగాహన

సంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతు సేవాకేంద్రం వీఏఏలకు సూక్ష్మ సేద్య పథకాలపై ఉద్యానశాఖాధికారి శ్రీలక్ష్మి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిందు, తుంపర్ల నీటి సాగు పథకాలపై ప్రభుత్వ నూరుశాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై ప్రజలకు అవగాహన



ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివ్య

సీతారామపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామ పంచాయతీలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో బుధవారం ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భం గా జిల్లా ఫ్లోరోసిస్ వైద్య అధికారి దివ్య మాట్లాడుతూ తాగునీటిలో ఫ్లోరిన్ అధిక స్థాయిలో ఉండటం వలన ప్రజలు ఫ్లోరోసిస్ బారిన పడతారని తెలిపారు. అంతేకాకుండా అన్నం మట్టి, స్టీలు పాత్రలలో వండాలని సూచించారు. పాలు, పెరుగు, కాల్షియం ఎక్కువగా ఉండే ఆహర పదార్థాలు తినాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఎంపిహెచ్‌ఓ మజీద్, రియాజ్, శేఖర్‌రాజు, తిరుపాల్ రెడ్డి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో అక్రమాలపై విచారణ జరపాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలో వరాల సాయినగర్ లేఅవుట్‌లో అక్రమాలకు పాల్పడ్డారని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన జగనన్న లే అవుట్లలో అక్రమాలను ప్రస్తావించి వరాల సాయినగర్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని, జగనన్న లే అవుట్లలో జరిగిన అక్రమాలన్నింటినీ వెలుగులోకి తేవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

రూ.5 కోట్లు వెచ్చిస్తే 30 వేల కుటుంబాలకు తాగునీరు

● అసెంబ్లీలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



జలదంకి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలకు రూ.26 కోట్లతో రూపుదిద్దుకున్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి గత వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం అసెంబ్లీలో వివరించారు. ప్రస్తుతం ఈ పథకానికి రూ.5కోట్లు ఖర్చు చేస్తే నియోజకవర్గంలోని 30 వేల కుటుంబాలకు శుద్ధి జలాలు అంది ప్రజలు ఫ్లోరైడ్ సమస్య నుంచి బయట పడతారని కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మెట్టప్రాంతం అయిన ఉదయగిరితో పాటు రాష్ట్రంలో నిలిచిపోయిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని తిరిగి కొనసాగించి రాష్ట్ర ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వారమైనా వదలని వర్షపు నీరు

● జలదిగ్బంధంలో చుట్టుగుంట రోడ్డు
● వాహనదారుల అవస్థలు



చుట్టుగుంట రోడ్డులో చప్టాపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కందుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షం తెరపిచ్చి వారంరోజులు గడిచినా కందుకూరు - చుట్టుగుంట రోడ్డు జలదిగ్బంధంలోనే ఉంది. 167బీ జాతీయ రహదారిలో కందుకూరు బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఈ మార్గంలో వాగులు పొంగుతూ చుట్టుపక్కల పొలాలు సరస్సులా మారటంతో నేలచప్టాలపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని చుట్టుగుంట- కంద్రావారిపాలెం, ఆత్మకూరు, మన్నేటికోట గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈనెల 12న వర్షం ప్రారంభమైంది మొదలు ఈ రహదారిలో ఐదు రోజులపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. వర్షం తెరపిచ్చి వారం రోజులైనా వాగులు మూడు అడుగుల లోతున ప్రవహిస్తుండటంతో బుధవారం కూడా మోటారుసైకిళ్లపై ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క మోకాటిలోతు గుంతలతో శిధిలమై ఉన్న నేలచప్టాలపై 3అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో మోటారుసైకిళ్లు, కార్లు కూడా ఈ గుంతలలో పడే ప్రమాదం ఉంది. ముమ్మరంగా వ్యవసాయ పనుల సీజన్ కావటంతో ఎరువులు, పురుగుమందుల కోసం, ఇతర అవసరాల కోసం మోపెడ్‌లపై కందుకూరు వెళ్లక తప్పటం లేదని, అయితే ఈ మార్గంలో వెళ్లే అవకాశం లేక 4 కిలోమీటర్లు చుట్టుతిరిగి ఆనందపురం మీదగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. వాగును పూర్తిగా ఆక్రమించేయటం ఈ పరిస్థితికి కొంత కారణమైతే హైవే నిర్మాణం వల్ల కూడా నీరు సాఫీగా వెళ్లలేక నిల్వ ఉంటున్నదని, మరో పదిరోజులు కూడా పరిస్థితి ఇలాగే ఉండేలా ఉందని ఈలోగా మళ్లీ వర్షం కురిస్తే నెలలతరబడి మాకు ఈ తిప్పలు తప్పవని ఆ నాలుగు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వాగు ఆక్రమణలను జేసీబీలతో తొలగించి నీరు వేగంగా ప్రవహించేలా చూడటంతో పాటు ఇక్కడ హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలి : ఎంపీడీవో



ఆత్మకూరు: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కృషిచేయాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో పనులు జరిగేలా చర్యలు తీసుకొని కొలతల ప్రకారం పనిచేయించి రూ. 300 వేతనం పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో, టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్ : ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్టికల్చర్, ఇంకుడు గుంతల తవ్వకాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. పనుల వద్ద కూలీ లకు వసతులు కల్పించడంతోపాటు వారు సమయపాలన పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరాజు, ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగసముద్రం: గత నెల 2వ తేదీన జరిగిన ఉపాధిహామీ గ్రామసభలో గుర్తించిన పనులకు ఆమోదం తెలిపినట్లు ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంటు జి రాఘవ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచు పి రాఘవులు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో ఇంకుడుగుంతల నిర్మాణం, గోకులం షెడ్లు ఏర్పాటు, పంట కాలువలో పూడికతీత పనులు మొదటి ప్రాధాన్యతగా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, ఎఫ్ఏ సీహెచ్ రమేష్, టీడీపీ నేతలు ఏ రంగయ్య, జి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఆపార్ నమోదులో జిల్లాను ముందంజలో ఉంచాలి



ఆత్మకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఖాజామొహిద్దీన్

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల ఆపార్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక ఉర్దూ ప్రైమరీ కాంప్లెక్స్ సమాశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపార్‌ను వేగవంతం చేసి జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. ఉర్దూ ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశాల అజెండాలో ఉన్న విద్యా ప్రవేశ్, ఎఫ్‌ఎల్‌ఎన్ తదితర అంశాల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆర్‌పిలు జిలానీ బాష, నాయబ్ జానీ, అల్తాఫ్ భగత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సముదాయ సమావేశాల తనిఖీ

ఉదయగిరి రూరల్: పాఠశాల సముదాయ సమావేశాలు అజెండా ప్రకారం నిర్వహించాలని ఉర్దూ పాఠశాలల జిల్లా ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ సూచించారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉర్దూ ప్రైమరీ పాఠశాల సముదాయ సమావేశాలను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్‌లు కరీంఖాన్, ఇనయితుల్లా, శంషాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. టిఎన్‌ఎస్ సర్వే, తదితర అంశాలపై ఎంఈవో మస్తాన్‌వలి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ వైస్ చైర్మన్ రామకృష్ణంరాజు, ఆర్పీలు రవిచంద్ర, శ్రీనివాసులు, మహేష్, లక్ష్మయ్య, గోడ్లవేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు మెరుగుపరచుకోవాలి

కొండాపురం : ఉపాధ్యాయులకు జరిగే కాంప్లెక్స్ సమావేశాలలో పాఠ్యాంశ బోధనలో మెలకువలు మెరుగుపరచుకునేందుకు అవకాశం ఉంటుందని ఎంఈవో-2 ఆనందరావు పేర్కొన్నారు. తూర్పుఎర్రబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే కొండాపురంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



అంకభూపాలపురం ఎస్టీ కాలనీల్లో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాల పురం ఎస్టీ కాలనీల్లో టీడీపీ నాయకులు ప్రగడ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈసందర్భంగా మోహన్‌కుమార్ టీడీపీ సభ్యత్వం వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కమంతుల ప్రసాద్, ప్రగడ మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దయాకర్

ఉదయగిరి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ట్రెజరీ ఇన్‌చార్జి ఉప ఖజానా అధికారిగా యడవల్లి దయాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్టీవో సీహెచ్ మమత ఓ ఉపాధ్యాయుడికి సంబంధించిన అరియర్స్ బిల్లు మంజూరు విషయమై నగదు డిమాండ్ చేసింది. అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారులు వింజమూరు సబ్‌ట్రెజరీ ఎస్టీవో దయాకర్‌ను ఇన్‌చార్జి ఎస్టీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు.

రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేయండి



రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు లోకోషెడ్ చిత్రపటాన్ని అందచేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంటలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భూముల్లో రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేయాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్.నూరుద్దీన్, మెతుకు రాజేశ్వరి, బీ. రవిచంద్ర, జహీర్, సుభానిలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. బుధవారం ప్రత్యేక రైల్లో తిరుపతి జిల్లా గూడూరు పర్యటనకు వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో బిట్రగుంటలో ఆగడంతో ఆయనను కలసి సన్మానించి లోకోషెడ్ చిత్రపటం అందచేశారు. బిట్రగుంట నుంచి తిరుపతికి మెమూ రైలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందచేశారు. స్పందించిన ఆయన బిట్రగుంట ప్రాంతంలో ఆర్వోహెచ్ ఏర్పాటు చేసేవిధంగా స్థల పరిశీలన చేపడుతామని జీఎం చెప్పారని వారు తెలిపారు. అలాగే బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, రైల్వే విశ్రాంత ఉద్యోగులు గోవిందరాజులు, విజయరాజు, భాగ్యరాజు, అంతోనిరాజ్, రాజన్నలు నెల్లూరు రైల్వే స్టేషన్లో జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి బిట్రగుంట అభివృద్ధిపై వినతిపత్రం అందచేశారు. కొవిడ్ సమయంలో బిట్రగుంటలో కొన్ని రైళ్ల స్టాపింగ్ ఎత్తివేయడంతో రైల్వే విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారని విన్నవించుకున్నారు.

పన్ను బకాయిల వసూళ్లు వేగవంతం చేయండి

● మున్సిపల్ కమిషనర్ అనూష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కందుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీలో ఇంటి పన్ను, నీటిపన్ను బకాయిల వసూళ్ల వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె అనూష సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాల యంలో 16 వార్డు సచివాలయాల అడ్మిన్‌లు, ఎమినిటీ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండేళ్లకు పైబడి బకాయిలు ఉన్నవారికి తక్షణం నోటీసులు జారీచేసి నిర్దేశిత గడువులోగా వారు బకాయి లు చెల్లించకుంటే నీటి కుళాయి కనెక్షన్ కట్ చేయాలని ఆమె సూచించారు. ప్రజలు కూడా తక్షణం బకాయిలు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



విద్యార్థికి రైటింగ్ ప్యాడ్, ప్రశంసాపత్రం అందచేస్తున్న ఎమ్పీడీవో శ్రీదేవి

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సమాజంలో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఎమ్పీడీవో సీహెచ్.శ్రీదేవి తెలిపారు. కావలి పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్పీడీవో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, శాఖ గ్రంథాలయ అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కెవి శేషారెడ్డి, తెలుగు భారతి సేవా సమితి పెద్దలు ఎస్ యానాదిరెడ్డి, వెంకటేశ్వర్లు, వి నారాయణరావు పేర్కొన్నారు. బుధవారం వారు స్థానిక గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డి, మేధా స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య, ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ పద్మప్రియ, గ్రంథాలయ లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, రికార్డు అసిస్టెంట్ తనూజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంట సాగులో భూసార పరీక్షలు కీలకమని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు వి దేవసేనమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భూసార పరీక్షలకు కనుగుణంగా ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. వరి సాగులో రైతులు నారుమడి దశ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, మహిమలూరు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లతో జాగ్రత్త

ఉదయగిరి (రూరల్,ఆంధ్రజ్యోతి): పంటలకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం పంటలకు సోకే తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవసేనమ్మ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

● ఇక్బాల్ అహ్మద్, తహసీల్దార్, కందుకూరు



కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాల సముదాయంలో ఐఓసీ పెట్రోలుబంకు ఏర్పాటుకు గత ప్రభుత్వంలో 20 సెంట్లు కేటాయించారు. అయితే ఈ కేటాయింపుపై ప్రజలు, వివిధ సంఘాల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకే తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్ పేర్కొన్నారు.

ముఖాముఖి

? మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకుకు అనుమతి ఇచ్చారా.

! గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చారట. మాకు కూడా ఈరోజే తెలిసింది.

? ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచోట పెట్రోలు బంకు ఏర్పాటు సమంజసమేనా ?

! పెట్రోలుబంకు ప్రతిపాదనను బుధవారం కందుకూరు అభివృద్ధి మండలి ప్రతినిధులు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతా.

? ఏ ప్రాతిపదికన స్థలాన్ని కేటాయించారు

! ఆ ప్రోసీడింగ్స్‌ను పూర్తిగా చదవలేదు. ఫైలు పరిశీలించాక తెలియచేస్తా.

? వరాల సాయినగర్ అక్రమాల గురించి ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు కదా.

! వరాలసాయినగర్‌లో పట్టాలు ఎవరికీ ఇవ్వలేదని, ఆ స్థలం అన్యాక్రాంతం అయిందని ఎమ్మెల్యే అన్నారు. విచారణకు ఆదేశాలు వస్తే విచారణ జరుపుతాం.

న్యూస్ బాక్స్

ఆదినారాయణరెడ్డికి ఘన నివాళులు

అల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి ఆదినారాయణరెడ్డి 43వ వర్ధంతి సందర్భగా మంగళవారం ఆయన అభిమానులు అల్లూరులోని నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, దొడ్ల వెంకారెడ్డి, గోసల గోపాల్‌రెడ్డి, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బిఎస్‌ఆర్ సెంటర్‌లో సాయిరేఖ జనరిక్ మందుల దుకాణాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతర పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సీఐ వేణు, మున్సిపల్ కమిషనర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపండి



డీఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని కోరుతూ సీపీఎం నేతలు బుధవారం ఎలక్ట్రికల్ డీఈ బెనర్జీకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నేతలు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో వేలకు వేలు బిల్లులు కట్టాలంటే పేదలు మధ్య తరగతి ప్రజలు వీలుకాదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల వద్ద దోచుకుని అదాని అంబానీ లాంటి బడా బాబులకు లాభాలు చేకూర్చు తున్నాం న్నారు. పాలకులు ఇప్పటికైనా ప్రజలకి ఇబ్బందికలిగించే చర్యలు మానుకోవాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పి.పెంచలయ్య, ఉపాధ్యక్షుడు మధు సూదన్‌రావు, యర్రంశెట్టి మోహన్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బోగోలు మండలంలో ప్రొహిబిషన్ ఎస్సై దేవిక, సిబ్బందితో కలిసి ఆయన బుధవారం పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. పాతబిట్రగుంట ఎస్టీ కాలనీలో పాలకుర్తి కొండయ్య వద్ద 10 క్వార్టర్ సీసాలు లభించాయని తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కొండయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.